ఆదివారం
17-8-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 327
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రేపు భారత్‌కు చైనా మంత్రి

న్యూఢిల్లీ: చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యి ఆగస్టు 18 నుండి 20 వరకు భారత్‌లో పర్యటిస్తారని ఆ దేశ విదేశాంగ శాఖ ప్రతినిధి శనివారం వెల్లడించారు. చైనా, భారత్ సరిహద్దు సమస్యపై ప్రతినిధులతో వాంగ్‌యి 24వ విడత చర్చలు జరపనున్నారు. కాగా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఆహ్వానం మేరకు చైనా మంత్రి వాంగ్ యి భారత్‌ను సందర్శించనున్నారు. ఈ పర్యటనలో భారత్-చైనా సరిహద్దు ప్రశ్నలపై 24వ రౌండ్ ప్రత్యేక ప్రతినిధుల (ఎస్ఆర్) చర్చలను వాంగ్ యి దోవల్‌తో నిర్వహిస్తారని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికారిక ప్రకటన తెలిపింది. ఈ పర్యటనలో వాంగ్‌యి భారత విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్‌తో రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నట్లు ఆ ప్రకటన పేర్కొంది.

విమానానికి త్రుటిలో తప్పిన ప్రమాదం

బెంగళూరు: పైలట్ అప్రమత్తంగా వ్యవహరించడంతో విమానానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. దీంతో 48 మంది ప్రయాణికులతోపాటు విమాన సిబ్బంది ప్రాణాలతో బయటపడ్డారు. శనివారం ఉదయం 48 మంది ప్రయాణికులతో కర్నాటకలోని బెళగావి నుంచి ముంబైకి స్టార్ ఎయిర్ సంస్థకు చెందిన విమానం బయలుదేరింది. అనంతరం కొన్ని నిమిషాలకు విమానంలోని ఒక ఇంజిన్‌లో సాంకేతిక లోపం ఏర్పడింది. ఈ విషయాన్ని విమాన పైలట్ గుర్తించారు. ఆ వెంటనే విమానాన్ని తిరిగి బెళగావి ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసరం అనుమతి తీసుకుని దింపేశారు. దీంతో విమాన

- మిగతా 2 లో

కుదరని ఏకాభిప్రాయం

- జరగని శాంతి ఒప్పందం
- ఫలితమివ్వని అలస్కా చర్చలు
- మాస్కోలో తదుపరి సమావేశం
- మీడియా ప్రశ్నలు దాటవేసిన అధినేతలు

వాషింగ్టన్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కోసం అమెరికా ఎర్ర తివాచీ పరిచింది. ఆయనకు తమకు దేశంలోకి ఆత్మీయ స్వాగతం పలికింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పుతిన్ మధ్య భేటీకి అలస్కా వేదికయ్యింది. ఉక్రెయిన్ యుద్ధం వేళ జరగబోయే తొలి సమావేశం కావడంతో పుతిన్-ట్రంప్ భేటీ అంచనాలను పెంచింది. ఇద్దరు అధినేతలు దాదాపు రెండున్నర గంటలు సమావేశమయ్యారు. చర్చలు స్నేహపూర్వకంగా, ఫలప్రదంగా జరిగాయని చెప్పుకున్నారు. అదే సమయంలో ఎలాంటి ఒప్పందం కుదరలేదని కూడా తెలిపారు. దీంతో అలాస్కా భేటీ కేవలం ఆర్భాటమా అన్న విమర్శలు వచ్చాయి. వాస్తవానికి పుతిన్ నేరుగా ట్రంప్‌తో భేటీ కావడం యావత్ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. 'శాంతి దూత'గా చెప్పుకునే ట్రంప్ ఏ విధంగా శాంతి కోసం రాజీ కుదురుస్తారన్నది ఆసక్తికరంగా మారింది. అయితే శాంతి ఒప్పందం జరగలేదు. యుద్ధం ఆపేందుకు ఏకాభిప్రాయం కురదలేదు. ఇద్దరు అధినేతలు యాంకరేజ్‌లోని జాయింట్ బేస్ ఎల్మెండార్ఫ్-రిచర్డ్‌సన్ వద్ద సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. అయితే విలేకరుల నుంచి ఎలాంటి ప్రశ్నలను స్వీకరించలేదు. తాము చెప్పాల్సింది చెప్పేసి మమా అనిపించుకున్నారు.

చర్చలు ఫలప్రదం: పుతిన్, ట్రంప్

సమావేశం ఫలప్రదంగా సాగిందని, అనేక అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరిందని ట్రంప్, పుతిన్ వెల్లడించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపుపై ఒప్పందం కుదరలేదన్నారు. తమ మధ్య చర్చలు కొనసాగుతాయని, తదుపరి మాస్కోలో భేటీకి అవకాశం ఉందన్నారు. అయితే మాస్కోలో సమావేశం జరగాలంటే అది ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, యూరప్ ప్రతినిధుల సహకారంపైనే ఆధారపడి ఉంటుందని పుతిన్ చెప్పారు. ట్రంప్ కూడా ఉక్రెయిన్‌పైనే బాధ్యత

- మిగతా 2 లో

ఆ అధికారం కోర్టుకు లేదు

రాష్ట్రపతికి, గవర్నర్లకు గడువు విధింపుపై కేంద్రం

న్యూఢిల్లీ: శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా ఆమోదించాలంటూ కోర్టులు నిర్దేశించవచ్చా అనే అంశంపై అభిప్రాయాలు తెలియజేయాలని సుప్రీం కోర్టు ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి పంపిన లిఖిత పూర్వక వివరాలు తాజాగా బయటకు వచ్చాయి. రాష్ట్రపతి, గవర్నర్ల ఆమోదానికి గడువు విధించే అధికారం కోర్టుకు ఉండదని కేంద్ర ప్రభుత్వం తెగేసి చెప్పింది. కొన్ని విషయాల్లో న్యాయస్థానం జోక్యం చేసుకుంటే రాజ్యాంగపరంగా గందరగోళం తలెత్తే అవకాశం ఉందని పేర్కొంది. బిల్లులపై గవర్నర్లు అంగీకారం తెలిపే విషయంలో కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ... గడువు విధించడం వల్ల రాష్ట్రపతి, గవర్నర్ల అత్యున్నత స్థానాన్ని తగ్గించినట్లు అవుతుందని కేంద్రం వివరించింది. ఆ రెండు స్థానాలు ప్రజాస్వామ్య పాలనకు సంబంధించిన ఉన్నత ఆదర్శాలను సూచిస్తాయని పేర్కొంది. వారి విధుల్లో ఏవైనా లోపాలు ఉంటే అనవసరమైన న్యాయ జోక్యాల ద్వారా కాకుండా రాజ్యాంగపరమైన యంత్రాంగాల ద్వారా సరిదిద్దాలని సూచించింది. తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నరు ఆర్ఎన్ రవి ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడం సరికాదని ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతి/గవర్నర్ గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో లేదా తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది. ఈ తీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని, గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని స్పష్టంచేసింది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం తేల్చి చెప్పింది. అయితే గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించడంపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందిస్తూ... రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. అనంతరం దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గడువు విధింపుపై అభిప్రాయాలు తెలియజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది.

కుంగిన కాఫర్ డ్యాం

విశాలాంధ్ర-పోలవరం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన ఎగువ కాఫర్ డ్యాం స్వల్పంగా కుంగింది. ఈ వార్త రాష్ట్రంలో సంచలనం రేపింది. అయితే ఊహించిన స్థాయి ప్రమాదం ఏమీ లేదు. కాఫర్‌డ్యాం ఎడమ వైపు ఎగువన కొద్దిగా కుంగినట్లు గమనించిన అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి దానిని పటిష్టపరిచారు. వరదలలో నీటిమట్టం పెరిగే అవకాశాలున్నాయని భావించిన అధికారులు గతంలో ఎగువ కాఫర్ డ్యాం వెడల్పు తొమ్మిది మీటర్లు, ఎత్తు మరో రెండు మీటర్లు

- మిగతా 2 లో

ధర్మవరంలో 'ఉగ్ర' కలకలం

పోలీసుల అదుపులో నూర్ మహమ్మద్

'జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ'తో సంబంధాలున్నట్టు ఐబీ గుర్తింపు

విశాలాంధ్ర-ధర్మవరం: శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఉగ్రవాదుల కదిలికలు దుమారం లేపుతున్నాయి. పట్టణంలోని కోటలో నివసిస్తున్న నూర్ మహమ్మద్‌ను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకొని ఇంచార్జి డీఎస్పీ నర్సింగప్ప పర్యవేక్షణలో విచారణ చేపట్టారు. నూర్ మహమ్మద్ ... సల్మాన్ బిర్యాని సెంటర్లో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. అతడు గత కొన్ని సంవత్సరాలుగా ధర్మవరంలోనే ఉంటూ ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపుకార్డు పొందాడు. మొబైల్ స్టేటస్‌లో ఐ లవ్ పాకిస్థాన్ అని పెట్టాడన్న స్పష్టమైన సమాచారం సేకరించారు. అతడిపై ఉన్న అనుమానంతో డీఎస్పీ కార్యాలయంలో

- మిగతా 2 లో

21న రాష్ట్ర మంత్రివర్గం

22న చంద్రబాబు ఢిల్లీ పయనం



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఈనెల 21వ తేదీన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వెలగపూడి సచివాలయం ఒకటో నెంబరు బ్లాక్‌లో గురువారం ఉదయం11 గంటలకు మంత్రివర్గ సమావేశం ప్రారంభమవుతుంది. అజెండా అంశాలు పంపాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి విజయానంద్ ఆయా శాఖల కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. సమావేశంలో రాజధాని పరిధిలోని ప్రముఖ సంస్థలకు భూ కేటాయింపులతో పాటు సీఆర్‌డీఏ ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలకు ఆమోదం తెలిపే అవకాశాలున్నాయి. సెప్టెంబరులో జరగనున్న అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టాల్సిన బిల్లులు, ఇతర అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. అలాగే ఈనెల 22వ తేదీన సీఎం చంద్రబాబు మరోసారి ఢిల్లీ పర్యటన చేపట్టనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీతోపాటు వివిధ శాఖల కేంద్ర మంత్రులతో భేటీ అయ్యే అవకాశాలున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అప్రమత్తంగా ఉండండి

- భారీ వర్షాలపై అధికారులతో సమీక్ష
- క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశం
- లోతట్టు ప్రాంత ప్రజలను శిబిరాలకు తరలించండి
- అవసరమైన చోట వైద్య శిబిరాలు
- ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు: సీఎం రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జగిత్యాల మినహా 15 జిల్లాల్లో అధిక వర్షపాతం, మిగతా జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని వాతావరణశాఖ వెల్లడించిందని సీఎం తెలిపారు. నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న సూచనల నేపథ్యంలో ముఖ్యమంత్రి శనివారం అన్నిశాఖల ఉన్నతాధికారులతో మాట్లాడారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను మోహరించామన్నారు. కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడతారని తెలిపారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని సీఎం ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ కలెక్టర్లకు ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. నీరు నిలిచిన రోడ్లు, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై రాకపోకలు పూర్తిగా నిషేధించాలన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలన్నారు. అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున అన్ని విభాగాల పారిశుద్ధ్య సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ మందులు అందుబాటులో ఉంచుకోవాలని... అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రాణ... ఆస్తి ... పశు నష్టం చోటుచేసుకోకుండా జాగ్రత్తలు వహించాలని సీఎం తెలిపారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని ఆదేశించారు.

రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలు పునరుద్ధరించండి: మంత్రి కోమటిరెడ్డి

ఆర్ అండ్ బీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా అధిక వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిల వివరాలపై శనివారం ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ఆ శాఖ ఇతర ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు తమ శాఖ పరిధిలో 454 ప్రాంతాల్లో 629 కి.మీ రోడ్డు దెబ్బతిందన్నారు. 22 చోట్ల రోడ్డు తెగిపోతే నాలుగు ప్రాంతాల్లో తాత్కాలికంగా పునరుద్ధరించి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చేశామన్నారు. 171 చోట్ల ఇంకా కాజ్‌వేలు, కల్వర్టులు వరద ప్రవాహంలో ఉన్నాయని, రాకపోకలకు ఇబ్బంది ఉన్న 108 ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన 71చోట్ల చక్కదిద్దామన్నారు. వాగుల వెంబడి 58 కి.మీ రోడ్డు కోతకు గురైందని,

- మిగతా 2 లో

మరో అల్పపీడనం

ఉత్తర, దక్షిణ కోస్తాకు మూడు రోజులు వర్షాలు

ఉత్తరాంధ్ర పోర్టుల్లో మూడో ప్రమాద హెచ్చరిక జారీ

రానున్న మూడు రోజులు కోస్తాలో చెదురుమదురుగా భారీ నుంచి అతిభారీ వర్షాలు, రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. తీరం వెంబడి 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. మంగళవారం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని సూచించారు.

2 లో

నేడు భారత్‌కు శుభాంశు శుక్లా

న్యూఢిల్లీ: యాక్సియం-4 మిషన్‌తో భారత రోదసి చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వ్యోమగామి శుభాంశు శుక్లా ఆదివారం భారత్ రానున్నారు. భారత్‌కు రాగానే ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. యాక్సియం-4 మిషన్ విజయవంతం తర్వాత తొలిసారి భారత్‌కు వస్తున్నానంటూ శుక్లా పోస్టు ద్వారా తెలిపారు. స్వదేశానికి తిరిగి వచ్చేందుకు విమానంలో కూర్చున్నప్పుడు భావోద్వేగానికి గురైనట్లు తెలిపారు. మిషన్ కోసం గతేడాది నుంచి తన స్నేహితులు, కుటుంబసభ్యులకు దూరంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇది తనను

- మిగతా 2 లో

ఇదీ లోకం!

దీన్నిబట్టి నాకర్థమయ్యిందేమిటంటే ఆయన ఎంతసేపైనా అబద్ధాలు ఆగకుండా చెప్పగలడని!

నేడు ఓట్ అధికార్ యాత్ర

బీహార్‌లో ప్రారంభించనున్న రాహుల్

పట్నా: బీహార్‌లో ఎస్ఐఆర్ నెపంతో లక్షల మంది ఓటర్ల పేర్లను జాబితాల్లో నుంచి తొలగించడం, గత ఎన్నికల్లో ఓట్లు దోచుకోవడం వంటి ఆరోపణలతో తమ పోరాటాన్ని ప్రతిపక్ష 'ఇండియా' ఉధృతం చేసింది. ఇదే క్రమంలో సోమవారం ఓట్ అధికార్ యాత్ర నిర్వహిస్తోంది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బీహార్‌లోని శాశారామ్ నుంచి ఈ యాత్రను లాంఛనంగా ప్రారంభించనున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అఖిలేశ్ ప్రసాద్ సింగ్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ యాత్ర వివరాలు వెల్లడించారు. రాజధాని పట్నాలో సెప్టెంబరు 1వ తేదీన యాత్ర ముగుస్తుందన్నారు. యాత్ర కోసం అన్ని అనుమతులు పొందామన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఇండియా ఐక్య సంఘటనకు ఊతమిచ్చేదిగా ఈ యాత్ర ఉంటుందన్నారు. రాష్ట్రంలోని 25 జిల్లాల గుండా 15 రోజులు సాగే ఈ యాత్ర కోసం రాహుల్ బీహార్‌లోనే

- మిగతా 2 లో

చరిత్ర వక్రీకరిస్తున్న మోదీ

- పదవి కాపాడుకోవడానికే ఆర్ఎస్ఎస్‌కు భజన
- పోలవరం నిర్వాసితుల సమస్యలపై పోరాటం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-రాజమండ్రి: ప్రధాని నరేంద్రమోదీ ఆర్ఎస్ఎస్ జపం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. స్వాతంత్ర్య వేడుకలలో భాగంగా ఎర్రకోటపై ఆయన చేసిన ప్రసంగమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. చరిత్రను వక్రీకరించే ప్రయత్నం మోదీ చేస్తున్నారని రామకృష్ణ మండిపడ్డారు. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా రెండు రాజకీయ పార్టీలు మాత్రమే పోరాడాయని, అందులో మహాత్మా గాంధీ అధ్వర్యంలో భారత జాతీయ కాంగ్రెస్ ఒకటి కాగా, ఎర్రజెండా చేత పట్టుకున్న సీపీఐ మరొకటని చెప్పారు. ప్రధాని మోదీ చరిత్రను విస్మరించి... ఆర్ఎస్ఎస్ వందేళ్ల గొప్పతనం గురించి మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా జాతీయ జెండాను ఆమోదించడం లేదని ఆర్ఎస్ఎస్ నిక్కచ్చిగా చెప్పిందని, అంబేద్కర్ రాజ్యాంగాన్ని తిరస్కరిస్తున్నట్లు నిస్సిగ్గుగా ప్రకటించిందని రామకృష్ణ గుర్తుచేశారు. ఇప్పటికీ మోదీ పార్టీకి రాజ్యాంగంపై నమ్మకం లేదన్నారు. ఎన్నికల్లో 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని మోదీ ఎన్నికల సమయంలో బహిరంగంగా ప్రకటించారన్నారు. గత ఎన్నికల్లో చావుదెబ్బ తినడంతో టీడీపీ, జేడీయూ వంటి పార్టీల మద్దతుతో అధికారం చేపట్టారని ఆరోపించారు. సెప్టెంబర్ నాటికి మోదీకి 75 ఏళ్లు పూర్తవుతాయని, దీని కారణంగా ప్రధాని పీఠంపై మరొకరిని కూర్చోబెట్టడానికి ఆర్ఎస్ఎస్ పావులు కదుపుతోందని, అందుకే ఆర్ఎస్ఎస్‌ను ప్రసన్నం చేసుకోవడానికి లేనిపోని గొప్పలు చెబుతున్నారని మండిపడ్డారు. దేశంలో 25 శాతం పేదరికాన్ని తగ్గించామని మోదీ ఘనంగా

- మిగతా 2 లో

ప్రజాస్వామ్యం, లౌకికవాదం, హక్కుల పరిరక్షణకు

ఐక్యంగా ఉద్యమిద్దాం

సీపీఐ బెంగాల్ రాష్ట్ర మహాసభల్లో డి.రాజా పిలుపు

కోల్‌కతా: ఐక్య ఉద్యమాలతోనే ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, ప్రజల హక్కులను కాపాడుకోగలమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఇందుకు కలిసి రావాలని బెంగాల్ ప్రజలకు పిలుపునిచ్చారు. సీపీఐ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర మహాసభలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజధాని కోల్‌కతాలోని సాల్ట్ లేక్ ఇందుకు ముస్తాబైంది. అరుణశోభను సంతరించుకుంది. మహాసభల ప్రారంభానికి ముందు నిర్వహించిన ర్యాలీలో ఆ ప్రాంతం ఎరుపెక్కింది. సీపీఐ నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు, మహిళలు, యువతీయువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కళాకారులు ఆట-పాటలతో సందడి చేశారు. మహాసభలలో పండుగ వాతావరణం కనిపించింది. సీపీఐ ప్రధాన కార్యదర్శి

- మిగతా 2 లో

ఎయిర్ కెనడా సిబ్బంది సమ్మె

700 సర్వీసుల నిలిపివేత

అట్టావా: వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఫ్లైట్ అటెండెంట్ల సమ్మె నేపథ్యంలో ఎయిర్ కెనడా కీలక నిర్ణయం తీసుకుంది. సమ్మె నోటీసు గడువు నేటితో ముగియడంతో... ఎయిర్ కెనడా, అనుబంధ సంస్థ ఎయిర్ కెనడా రూజ్ కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. థర్డ్ పార్టీ నిర్వహిస్తున్న ఎయిర్ కెనడా ఎక్స్‌ప్రెస్ సేవలు మాత్రం కొనసాగుతాయని తెలిపింది. తాజా పరిణామంతో రోజుకు 1.3 లక్షల మంది ప్రయాణికులపై ప్రభావం పడనుంది. కెనడాలో అతిపెద్ద విమానయాన సంస్థగా ఉన్న ఎయిర్ కెనడా నిత్యం 700 సర్వీసులు నడిపిస్తోంది. ఇందులో 10 వేల మంది ఫ్లైట్ అటెండెంట్లు పనిచేస్తున్నారు. విమాన ప్రయాణ సమయంలో ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు వీరిదే బాధ్యత. అయితే, వేతనాల పెంపునకు సంబంధించి కెనడియన్ యూనియన్ ఆఫ్ పబ్లిక్ ఎంప్లాయిస్ ఆగస్టు 13న మూడు రోజుల సమ్మె నోటీసులు ఇచ్చింది. నేటితో ఆ గడువు ముగియగా... ఇప్పటికీ ఒప్పందం కుదరకపోవడంతో సమ్మె ప్రారంభమైనట్లు ఉద్యోగ సంఘం వెల్లడించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా సేవలందించే దాదాపు 700 ఎయిర్ కెనడా విమానాలు గ్రౌండ్‌కే పరిమితమయ్యాయి. సమ్మె నేపథ్యంలో సర్వీసులను క్రమంగా రద్దు చేస్తున్నామని ఎయిర్ కెనడా ముందస్తుగానే ప్రకటించింది. అందులో భాగంగా శనివారం అన్ని సర్వీసులను నిలిపివేసినట్లు పేర్కొంది. విమానాల నిలిపివేత విదేశీ ప్రయాణాలపై అధికంగా ప్రభావం చూపనుంది. రద్దైన విమానాల్లో టికెట్లు కొనుగోలు చేసిన ప్రయాణికులు పూర్తి రుసుము వాపసుకు అర్హులని, వీలైనంత వరకూ ఇతర విమాన సంస్థలతో మాట్లాడి ప్రయాణికులను సర్దుబాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఎయిర్ కెనడా అధికారులు వెల్లడించారు.

రేపు ట్రంప్, జెలెన్‌స్కీ కీలక భేటీ

వాషింగ్టన్: ఉక్రెయిన్‌తో కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలకడంలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ అలాస్కాలో భేటీ అయ్యారు. ఈ భేటీ జరిగిన కొన్ని గంటలకే మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ యూరోపియన్ నేతలతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ క్రమంలోనే సోమవారం జెలెన్‌స్కీ ట్రంప్ వాషింగ్టన్‌లో భేటీ కానున్నట్లు తెలుస్తోంది. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ ఈ విషయాన్ని వెల్లడించారు. అలాస్కాలో సమావేశం అనంతరం విమానంలో తిరుగు ప్రయాణం చేస్తూ... ట్రంప్ ఈ కాల్ మాట్లాడినట్లు తెలిపారు. ఇదే విషయాన్ని జెలెన్‌స్కీ ఎక్స్ వేదికలో ధ్రువీకరించారు. ట్రంప్‌తో గంటన్నరకు పైగా ఫోన్‌లో మాట్లాడానని అన్నారు. శాంతి ఒప్పందానికి తాము సిద్ధంగా ఉన్నామనే విషయాన్ని పునరుద్ఘాటించినట్లు చెప్పారు. పుతిన్‌తో సమావేశంలో చర్చించుకున్న ముఖ్య విషయాలను ట్రంప్ తనకు తెలియజేసినట్లు పేర్కొన్నారు. త్రైపాక్షిక సమావేశంపై ట్రంప్ చేసిన ప్రతిపాదనకు తాను మద్దతిస్తున్నట్లు వెల్లడించారు. కీలక అంశాలపై చర్చించుకునేందుకు అది మంచి వేదిక అవుతుందన్నారు. పరిస్థితులను చక్కదిద్దే బలం అమెరికాకు ఉందని వ్యాఖ్యానించారు. సోమవారం వాషింగ్టన్ డీసీలో ట్రంప్‌తో సమావేశం కానున్నట్లు తెలిపారు. యుద్ధాన్ని నిలువరించే అన్ని విషయాలపై చర్చిస్తానన్నారు. శాంతి ఒప్పందంపై ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తున్న యూరోపియన్ నాయకులకు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలిపారు. అలస్కా వేదికగా ట్రంప్, పుతిన్ రెండున్నర గంటలకు పైగా చర్చించారు. అయినప్పటికీ ఎలాంటి ఒప్పందం కుదరలేదు. అయితే, చర్చలు సానుకూలంగా జరిగాయని ఇద్దరు నేతలు ప్రకటించారు. సమావేశం అనంతరం ట్రంప్ ఫాక్స్ న్యూస్ ప్రతినిధి సియాన్ హానిటీతో మాట్లాడుతూ... ఒప్పందంపై నిర్ణయం జెలెన్‌స్కీ చేతుల్లోనే ఉందన్నారు. ఒప్పందం కుదుర్చుకోవాలని తాను సూచిస్తానన్నారు.

పాక్‌లో వరదలు...320 మంది మృతి

ఇస్లామాబాద్: పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆకస్మిక వరదల కారణంగా రెండు రోజుల్లోనే 321 మంది మరణించినట్లు అధికారులు వెల్లడించారు. ఖైబర్‌పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోనే 307 మంది చనిపోయినట్లు ఆ రాష్ట్ర విపత్తు నిర్వహణ విభాగం పేర్కొంది. ఖైబర్‌పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని లోయర్ దిర్, బజౌర్, అబోటాబాద్, జబ్రారీ సహా పలు ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో భారీ విధ్వంసం చోటుచేసుకుంది.

వరదల కారణంగా పదుల సంఖ్యలో భవనాలు, పాఠశాలలు దెబ్బతిన్నాయి. పలు వంతెనలు కూడా కొట్టుకుపోయాయి. అనేక రహదారులు జలదిగ్బంధమయ్యాయి. వరదల్లో అనేక మంది గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. వీరికోసం ముమ్మర గాలింపు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికి తీసేందుకు దాదాపు 2వేల మందితో ఆపరేషన్ కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు పాక్‌లోని మరిన్ని ప్రాంతాలకు భారీ వర్ష ముప్పు ఉన్నట్లు స్థానిక వాతావరణ విభాగం హెచ్చరికలు జారీ చేసింది.

ఐక్యంగా ఉద్యమిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

డి.రాజా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. మోదీ ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ఎదిరించేందుకు మరింత బలంగా ముందుకెళ్లాలని, 100 ఏళ్ల పోరాటాల స్ఫూర్తితో భవిష్యత్ పోరాటాలకు సీపీఐ సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ కార్యదర్శులు పల్లబ్ సేన్ గుప్తా, రామకృష్ణ పాండా, రాష్ట్ర కార్యదర్శి స్వపన్ బెనర్జీ తదితరులు స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు చేశారు.

నేడు ఓట్ అధికార్ యాత్ర

(మొదటిపేజీ తరువాయి)

ఉంటారని ఒక ప్రశ్నకు సింగ్ సమాధానం ఇచ్చారు. యాత్రకు ఈనెల 20, 25, 31 తేదీల్లో విరామం ఉంటుందని చెప్పారు. రాహుల్‌తో పాటు ఆర్‌జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్, వామపక్షాలు సహా భాగస్వామ్య పార్టీల నాయకులు పాల్గొంటారన్నారు. ముగింపు రోజున భాగస్వామ్యపక్షాల పార్టీల నాయకులందరినీ ఏకతాటిపైకి తెస్తామని సింగ్ వెల్లడించారు. వీధుల్లోకి వచ్చి పోరాటం చేయడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని, పార్లమెంటులో చర్చలకు వీలు కల్పించడం లేదని, ఎన్నికల సంఘం వైఖరి సముచితంగా లేదని వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే ఈ యాత్రలో తమ నాయకుడికి ప్రాధాన్యత వచ్చేలా రెండున్నర నిమిషాల వీడియో పాటను ఆర్‌జేడీ విడుదల చేసింది. రాహుల్, తేజస్వి అందులో కనిపిస్తారు.

ధర్మవరంలో 'ఉగ్ర' కలకలం

(మొదటిపేజీ తరువాయి)

విచారణ చేపడుతున్నారు. మూడు రోజుల క్రితమే పోలీసులు నూర్ మహమ్మద్‌ను తీసుకెళ్లారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంచార్జి డీఎస్పీ నర్సింగప్ప విలేకరులతో మాట్లాడుతూ... నూర్ మహమ్మద్ పాకిస్థాన్‌లోని ఐదారు వాట్సాప్ గ్రూపులలో సభ్యుడుగా ఉన్నాడని స్పష్టం చేశారు. అనుమానం వచ్చి ఇంట్లో సోదాలు చేయగా 16 సిమ్ములు లభించాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. కుటుంబ సభ్యులు తమకేమీ తెలియదని చెబుతున్నారని చెప్పారు. వాట్సాప్ గ్రూపులకు డిజైన్లు, పంపించాడా... అతడి వ్యక్తిత్వం, కదలిక, ఆలోచన విధానంపై మరింత సమాచారాన్ని సేకరిస్తున్నామని పేర్కొన్నారు. అతడి బ్యాంకు ఖాతాలపై కూడా నిఘా ఉంచామన్నారు. నగదు లావాదేవీలు జరిగాయా, రాడికల్, ఇస్లామిక్ తదితర గ్రూపులకు ప్రేరేపితుడయ్యాడా అన్న కోణంలో విచారణ చేపడతామని తెలిపారు. కొద్ది రోజుల్లోనే అన్ని వివరాలను తెలియజేస్తామని నర్సింగప్ప తెలిపారు. ఇదిలా ఉండగా... పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ అనే ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్నట్టు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) గుర్తించింది. ఉగ్రవాద సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఉగ్రవాదులను నియంత్రించేందుకు ఐబీతో పాటు ఎన్ఐఏ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా జల్లెడ పడుతున్నారు.

విమానానికి తృటిలో తప్పిన ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

ప్రయాణికులతోపాటు ఎయిర్ పోర్టు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇంజిన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని గుర్తించే పనిలో స్టార్ ఎయిర్ సంస్థకు చెందిన నిపుణులు నిమగ్నమయ్యారు. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని తెలిపింది. భవిష్యత్తులో ఈ తరహా ఘటనలను పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని విమాన సంస్థ స్పష్టం చేసింది. అత్యవసర సమయంలో చాకచక్యంగా వ్యవహరించిన విమాన పైలట్‌ను అభినందించింది.

అమెరికా పన్నులతో మాకు తీవ్ర నష్టం: స్టాలిన్



చెన్నై: భారత్‌పై అమెరికా 50 శాతం పన్నులు విధించింది. ఈ పన్నుల వల్ల మిగతా రాష్ట్రాల కంటే తమిళనాడుకు ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శనివారం అన్నారు. మన ఎగుమతులు అమెరికా మార్కెట్‌తో ముడిపడి ఉన్నందున తమిళనాడు మిగతా రాష్ట్రాల కంటే తీవ్రంగా దెబ్బతింటుంది. వస్త్రాలు, తోలు, ఆటో యంత్రాలు, ఇతర రంగాలలో లక్షలాది ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయని స్టాలిన్ అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. మ్యాన్ మేడ్ ఫైబర్స్‌పై 5 శాతం జీఎస్టీని నిర్ణయించడం, పత్తి దిగుమతులపై సుంకాన్ని తొలగించడం, మారిటోరియంతో సులభమైన, తక్కువ వడ్డీ రుణాలను పొడిగించడం వంటి అనేక చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీని స్టాలిన్ కోరారు. సుంకాల సంక్షోభాన్ని పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వానికి తమిళనాడు పూర్తి మద్దతు ఇస్తోందన్నారు. ఈ వాణిజ్య సంక్షోభాన్ని అధిగమించడానికి కేంద్రం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని స్టాలిన్ అన్నారు.

కుదరని ఏకాభిప్రాయం

(మొదటిపేజీ తరువాయి)

మోపారు. ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ ఒక పరిష్కారాన్ని చూపాలన్నారు. పుతిన్, జెలెన్‌స్కీ త్వరలోనే భేటీ అవుతారని ఆకాంక్షించారు. ఆ సమావేశంలో తాను పాల్గొంటానన్నారు. పుతిన్‌తో ఏయే అంశాలపై చర్చించారన్న ప్రశ్నకు మాత్రం ట్రంప్ సమాధానం ఇవ్వలేదు. చర్చల్లో పురోగతి ఉందని, కొన్ని సమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉందని అన్నారు. అన్ని సమస్యలను పరిష్కరించుకొని సంతకాలకు సిద్ధమయ్యేంత వరకు ఒప్పందం జరగదని ట్రంప్ వెల్లడించారు. పుతిన్ మాట్లాడుతూ జెలెన్‌స్కీతో భేటీకి షరతులతో కూడుకొని ఉంటుందని చెప్పారు. ఆయనతో భేటీకి తానేమీ వ్యతిరేకం కాదన్నారు. శాంతి ఒప్పందంపై సంతకాలకు సిద్ధమైనప్పుడే తమ భేటీ జరుగుతుందని తెలిపారు. రెండవ ప్రపంచ యుద్ధం సమయం నుంచి అమెరికా-రష్యా మధ్య చారిత్రక సంబంధాలను గుర్తుచేసుకున్నారు. 2020 ఎన్నికల్లో తాను గెలిచివుంటే యుద్ధం జరిగేది కాదని ట్రంప్ పదేపదే చెప్పుకోవడాన్ని సమర్థించారు. బహుశ అలాగే జరిగేదేమో అని పుతిన్ అన్నారు. ట్రంప్‌తో భేటీ స్నేహపూర్వకంగా సాగిందని చెప్పారు. గతాన్ని మరిచి ముందుకు సాగడం రెండు దేశాలకు మంచిదని పుతిన్ అభిప్రాయపడ్డారు. మీడియా నుంచి ప్రశ్నలు స్వీకరించలేదు కాబట్టి 15 నిమిషాల్లో సమావేశం ముగిసింది. ఈ చర్చల వల్ల ఎలాంటి ఫలితం లభించలేదని స్పష్టమైంది. కాగా, పుతిన్ దాదాపు పదేళ్ల తర్వాత అమెరికాలో పర్యటించారు.

రేపు జెలెన్‌స్కీతో ట్రంప్ భేటీ

ఉక్రెయిన్ అధ్యక్షుడు సోమవారం అమెరికా రాబోతున్నట్లు ట్రంప్ స్వయంగా వెల్లడించారు. ఓవల్ కార్యాలయంలో ఆయనతో భేటీ కాబోతున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఫోన్‌లో మాట్లాడినట్లు ట్రూత్ సోషల్ మాధ్యమంగా చెప్పారు. శాంతి ఒప్పందమే యుద్ధం ముగించేందుకు ఉత్తమ మార్గమన్నారు. 'పుతిన్‌తో సమావేశం బాగా జరిగింది. అనేక అంశాలపై చర్చించారు. జెలెన్‌స్కీతో, నాటో అధినేతతో, యూరప్ నేతలతోనూ వేర్వేరుగా ఫోన్‌లో మాట్లాడాను. నేరుగా శాంతి ఒప్పందం చేసుకోవాలన్న నిర్ణయానికి వచ్చాం. అన్ని అనుకున్నట్లు జరిగితే పుతిన్‌తో మరొక సమావేశం నిర్వహిస్తాం. యుద్ధం ముగిస్తే లక్షలాది మంది ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుంది' అని ట్రంప్ పేర్కొన్నారు.

ఎర్ర తివాచీ వివాదం

అలస్కా వేదిక ఒక వివాదానికీ తెరతీసింది. విమానాశ్రయంలో పుతిన్ విమానం మెట్ల వద్ద అమెరికా సైనికులు మోకరిల్లిన దృశ్యం వైరల్‌గా మారింది. పుతిన్ కోసం ఎర్ర తివాచీ పరిచే సమయంలో తీసిన చిత్రం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. దీనిపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ప్రత్యర్థి దేశాధినేత కోసం అమెరికా సైన్యం మోకరిల్లడమంటే దేశ ఆత్మగౌరవానికి భంగం కలిగించడమే అని నెటిజన్లు వ్యాఖ్యానించారు. మోకరిల్లడానికి ఘనత కల్పించండి అంటూ ఉక్రెయిన్ మాజీ అధికారి ముస్తఫా నాయీమ్ కూడా ఎక్స్‌లో వ్యంగ్యంగా పోస్టు పెట్టారు.

పుతిన్‌కు మెలానియా లేఖ

పుతిన్‌కు అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ వ్యక్తిగతంగా ఓ లేఖ రాశారు. అలాస్కా భేటీలో ట్రంప్ ఆ లేఖను అందించారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం కారణంగా పిల్లల దుస్థితిని తెలియజేసేలా మెలానియా లేఖ ఉన్నట్లు శ్వేతసౌధం అధికారులు తెలిపారు. అందులోని ఇతర విషయాలను మాత్రం వెల్లడించలేదు.

అప్రమత్తంగా ఉండండి

(మొదటిపేజీ తరువాయి)

378 మీటర్లు మూసివేశామన్నారు. 147 ప్రదేశాల్లో కాజ్ వే,మైనర్ బ్రిడ్జి లు, కల్వర్టులు పునరుద్ధరించాలని గుర్తించామని మంత్రి పేర్కొన్నారు. తరచూ క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తూ ప్రాణనష్టం జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పోలీస్, విద్యుత్, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ విభాగాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. జిల్లా సర్కిల్స్ వారీగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి రాష్ట్ర కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేసి పర్యవేక్షిస్తున్నామని స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ మంత్రికి వివరించారు. ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా రోడ్లు, కల్వర్టులు పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని రాష్ట్ర రహదారులు చీఫ్ ఇంజినీర్ మోహన్ నాయక్‌ను ప్రత్యేకంగా ఆదేశించారు. రాష్ట్ర మొత్తం జిల్లాల వారీగా 37 డివిజన్ల పరిస్థితులు, ఫీల్డ్ ఇంజినీర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిద్ధంగా ఉన్నామని మోహన్ నాయక్ మంత్రికి వివరించారు. ధ్వంజమైన రోడ్లు,వంతెనల శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర జాతీయ రహదారుల వివరాలు ఇంచార్జి ఈఎన్సీ జయ భారతి, ఆర్వోబి, ఆర్‌యుబీల వద్ద పరిస్థితిని సీఈ రాజేశ్వర్ రెడ్డి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మరో రెండు రోజులు ఎవరూ సెలవు పై వెళ్లొద్దని మంత్రి కోమటి రెడ్డి స్పష్టం చేశారు.

అమరావతిని రిజర్వాయర్లు రక్షించేనా?

విశాలాంధ్ర - సచివాలయం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని అమరావతికి హైటెక్ కళ వచ్చింది. వచ్చే నెల నుంచి చురుగ్గా పనులు పున:ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. సరికొత్త రికార్డు దిశగా అడుగులు వేస్తోంది. అమరావతి ప్రాంతంలో నీటి ప్రవాహం అధికంగా ఉంటుందని, భారీ వర్షాల సమయంలో నగరం విపత్తుల్లో చిక్కుకోవడం ఖాయమని కొందరు భావిస్తున్నారు. ఈ సమయంలో అమరావతి విషయంలో ఏ చిన్న విమర్శకు అవకాశం ఇవ్వకూడదని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రాంతాన్ని వరదలు చుట్టుముడితే... వరదనీటిని రిజర్వాయర్లలోకి మళ్లించేందుకు భారీగా నాలుగు కాలువలను తవ్వుతున్నారు. దీనికి దీటుగా నాలుగు రిజర్వాయర్లను నిర్మిస్తున్నారు. రెండు ఎత్తిపోతలను సైతం ఏర్పాటు చేస్తున్నారు. రాజధాని నిర్మాణం కోసమే ఎత్తిపోతలతో పాటు రిజర్వాయర్లు నిర్మించడం చిన్న విషయం కాదు. రాజధాని ప్రాంతంలో కొండవీడు వాగు, పాలవాగు ప్రవహి స్తుంటుంది. దాదాపు అన్ని గ్రామాలు భారీ వర్షాల సమయంలో ముంపులోనే ఉంటాయి. కొండవీడు వాగు ఎత్తిపోతల పథకం పక్కనే మరో ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తున్నారు. అంటే రాజధాని నిర్మాణం కోసం రూ.వందల కోట్లతో ఇలా ఎత్తిపోతల, రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టడం హర్షించదగ్గ పరిణామమే. అయితే... రాజధానికి ఉన్న వరద ముప్పుపై ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తూనే ఉన్నట్లు తెలుస్తోంది. రాజధాని ప్రాంతాన్ని కృష్ణానది వరదల నుంచి రక్షించేందుకు గతంలో కొండవీటి వాగు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. అయితే దీంతో వరదలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయడం సాధ్యం కాదన్న రుణాలు ఇవ్వబోతున్న బ్యాంకులు వివిధ సూచనలు చేశాయి. దీంతో కొండవీటి వాగు ఎత్తిపోతలకు అదనంగా మరో ఎత్తిపోతల నిర్మించేం దుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గతంలో టీడీపీ ప్రభుత్వం కొండవీటి ఎత్తిపోతలను రూ.237 కోట్లతో కేవలం 18 నెలల్లోనే పూర్తి చేసింది. అమరావతిని కృష్ణానది వరదల నుంచి కాపాడేందుకు వీలుగా ప్రస్తుతం ఉన్న కరకట్టను విస్తరించేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) ప్రణాళిక రూపొందిస్తోంది. వరద నీరు 15 లక్షల క్యూసెక్కులు వచ్చినా అమరావతి నగరానికి ఇబ్బంది లేకుండా దీన్ని రూపొందించను న్నారు. బ్యాంకుల ప్రతినిధి బృందాలు డిజైన్లపై సంతృప్తిని వెలిబుచ్చారు. కొన్ని ప్రతిపాదనలు కూడా చేశారు. ఇందులో భాగంగా రాజధాని నగరంలో అంతర్గతంగా, బాహ్యంగా నీటి నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్ల పనులు తక్షణమే చేపట్టాలని ప్రతిపాదించారు. నెదర్లాండ్స్ డిజైన్లను ఆమోదించారు.

నేడు భారత్‌కు శుభాంశు శుక్లా

(మొదటిపేజీ తరువాయి)

ఎంతో బాధించిందన్నారు. వారిని కలిసి తన అనుభవాలన పంచుకునేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. తాను విమానంలో కూర్చొన్న ఫొటోను పంచుకున్నారు. ఆదివారం భారత్‌కు రానున్న శుక్లా... సోమవారం మోదీతో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈనెల 23న జరిగే జాతీయ అంతరిక్ష దినోత్సవంలో కూడా శుక్లా పాల్గొంటారని వెల్లడించాయి. ఇటీవల నిర్వహించిన యాక్సియం-4 మిషన్ ప్రయోగం విజయవంతమైంది. రోదసిలో 18 రోజులు గడిపి మానవాళికి ప్రయోజనం కలిగించే అనేక ప్రయోగాలను నిర్వహించిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా బృందం జులై 15న భూమికి తిరిగి వచ్చింది. వచ్చిన వెంటనే వ్యోమగాములను క్వారంటైన్ సెంటర్‌కు తరలించారు. వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ (పోలండ్), టిబర్ కపు ఈ బృందంలో ఉన్నారు.

కుంగిన కాఫర్ డ్యాం

(మొదటిపేజీ తరువాయి)

పెంచారు. ప్రస్తుతం అదే ప్రాంతంలో డ్యాం కుంగింది. సీపేజీ నివారణ కోసం విదేశీ నిపుణుల బృందం సిఫార్సు మేరకు ఎగువ కాఫర్ డ్యాం పొడవునా బట్రస్ డ్యాం నిర్మాణం పూర్తయింది. కుంగిన భాగాన్ని పునరుద్ధరించారు. బట్రస్ డ్యాంతో ఎలాంటి సమస్య ఉండదని ఇంజనీరింగ్ చీఫ్ నరసింహమూర్తి తెలిపారు. ఇదే విషయంపై పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

రాహుల్ గాంధీ ఆరోపణలు

నేడు ఎన్నికల సంఘం వివరణ

న్యూఢిల్లీ: ఓట్లు చోరీ చేసిందంటూ భారత ఎన్నికల సంఘంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీ పదేపదే ఆరోపణలు చేస్తుండటంపై ఈసీ ఆగ్రహం ప్రదర్శిస్తోంది. రాహుల్ ఆరోపణలకు సమాధానం చెప్పడానికి భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) రంగం సిద్ధం చేసుకుంటుంది. అందులో భాగంగా ఆదివారం న్యూఢిల్లీలోని నేషనల్ మీడియా సెంటర్‌లో మీడియా సమావేశం పెట్టాలని ఈసీఐ నిర్ణయించింది. బీహార్‌లో ఎన్నికల సంఘం ఇటీవల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నిర్వహించింది. దీని తర్వాత ఈసీఐ తొలిసారిగా స్పందించనుంది. బీహార్‌లో మరికొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు ప్రారంభం కానున్నాయి. ఆగస్టు నెల ప్రారంభంలో బీహార్‌లో ఎస్ఐఆర్‌ను ఎన్నికల సంఘం నిర్వహించింది. దీనిని లక్ష్యంగా చేసుకుని పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభంలో అధికార పార్టీని ఇరుకునపెట్టేందుకు ప్రతిపక్షాలు ప్రశ్నలు సంధించిన విషయం విదితమే. మరోవైపు 2024 సార్వత్రిక ఎన్నికల్లో భారీ సంఖ్యలో ఓట్లు చోరీ చేసి... బీజేపీ గెలుపునకు ఎన్నికల సంఘం పరోక్షంగా మేలు చేసిందంటూ రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలకు తెర తీశారు. అంతేకాకుండా... మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్నాటకలో భారీగా నకిలీ ఓటర్లను చేర్చిందంటూ ఎన్నికల సంఘంపై ఆరోపణలు గుప్పించారు. అందుకు సంబంధించిన అనేక అంశాలను ఆయన సోదాహరణగా వివరించారు.

మరోవైపు... బీహార్ ఓటర్ల జాబితా పునర్విమర్శకు వ్యతిరేకంగా ఓటర్ అధికార్ యాత్ర నిర్వహిస్తున్నట్లు రాహుల్ గాంధీ ప్రకటించారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా బీహార్‌లో ఈ యాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. ఆగస్టు 17వ తేదీ నుంచి ఈ యాత్ర ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

చరిత్ర వక్రీకరిస్తున్న మోదీ

(మొదటిపేజీ తరువాయి)

చెప్పుకుంటున్నారని, నిజంగా పేదరికమే తగ్గితే 80-90 కోట్లమందికి ఉచిత బియ్యం ఎందుకు పంపిణీ చేస్తున్నారని రామకృష్ణ ప్రశ్నించారు. మోదీ సర్కారు... అదానీ, అంబానీలను పెంచి పోషిస్తోందని, పేదరికం తగ్గిందని చెప్పడం అంతా మాయ అని అన్నారు. పోలవరం నిర్వాసితులను దెబ్బతీయడానికి మోదీ సర్కారు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తోందని రామకృష్ణ అన్నారు. నిర్వాసితులకు నష్టపరిహారం తగ్గించడానికి పోలవరం ఎత్తు తగ్గించాలని షరతులు పెడుతోందని, ప్రాజెక్టు ఎత్తు తగ్గితే అది కేవలం బ్యారేజీగా మాత్రమే మిగులుతుందని హెచ్చరించారు. పునరావాస సౌకర్యాలు కల్పించకపోవడంతో గిరిజనులు నీటిలోనే మగ్గుతున్నారన్నారు. పేదలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయన్నారు. మోదీ సర్కారు పోలవరం ఎత్తు తగ్గింపునకు కుట్ర చేస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు మౌనమునిగా ఉన్నారని ఆరోపించారు. చంద్రబాబు చెబుతున్న బనకచర్ల ప్రాజెక్టు ఓ అంబక్ ప్రాజెక్టు ఎద్దేవా చేశారు. నీటిపారుదల ప్రాజెక్టులపై ప్రైవేటు వ్యక్తుల పెత్తనాన్ని తాము సహించేది లేదన్నారు. బనకచర్లకు రెండు లక్షల కోట్ల రూపాయలు అవసరమని, వాటిలో లక్ష కోట్ల రూపాయలు ప్రైవేటు వ్యక్తుల నుంచి తీసుకుంటే... వారు నీరెలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు పథకాన్ని తాము స్వాగతిస్తున్నామని, కానీ దానిని అమలు చేయడానికి అదనంగా మూడు వేల బస్సులు, పది వేలమంది సిబ్బంది అవసరమవుతారన్నారు. ఈ సమస్యను పరిష్కరిస్తేనే స్త్రీ శక్తి పథకాన్ని పూర్తిగా అమలు చేయవచ్చన్నారు. తమ పార్టీ పేద, బలహీన వర్గాలకు ఇళ్ల స్థలాల కోసం ఉద్యమిస్తోందన్నారు. పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇచ్చి...ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని పోరాడుతున్నామన్నారు. చంద్రబాబు మాత్రం దాని ఊసే ఎత్తడం లేదన్నారు. మోదీ, చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పించలేదన్నారు. రాష్ట్రంలో ఏ కార్యాలయం చూసినా అవుట్ సోర్సింగ్ సిబ్బందే కనిపిస్తున్నారన్నారు. ప్రైవేటు విద్య తప్ప ప్రభుత్వ విద్యపై చంద్రబాబుకు ప్రేమలేదని, ప్రైవేటు వ్యక్తులకు రాష్ట్రాన్ని అమ్మేస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి హామీల గురించి మాట్లాడటమే చంద్రబాబు మర్చిపోయారన్నారు. సూపర్ సిక్స్ హామీలు పూర్తిగా అమలు చేయకపోతే ఉద్యమించక తప్పదన్నారు. ఓట్ల చోరీతో మోదీ సర్కారు ఏర్పడిందని, ఇందుకు ఎన్నికల సంఘం పూర్తిస్థాయిలో సహకరించిందని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్, జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సహాయ కార్యదర్శి కె.రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శులు సప్ప రమణ, పి.లావణ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు అల్లం వెంకటేశ్వరరావు, సీహెచ్ సునీల్, పి.త్రిమూర్తులు పాల్గొన్నారు.

మరో అల్పపీడనం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: భారత వాతావరణ శాఖ సూచనల ప్రకారం దక్షిణ చత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనం కొనసాగుతోందని, సోమవారం నాటికి వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వీటి ప్రభావంతో రానున్న మూడు రోజులు కోస్తాలో చెదురుమదురుగా భారీ నుంచి అతిభారీ వర్షాలు, రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. తీరం వెంబడి 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. మంగళవారం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని సూచించారు. భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాలు, హోర్డింగుల వద్ద ఉండరాదని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోను పొంగిపొర్లే వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదని సూచించారు. ఇప్పటికే ప్రభావిత జిల్లాల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈనెల 18వ తేదీన తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈనెల 19వ తేదీన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని, మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటల నాటికి శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో 30.2 మిమీ, మన్యం జిల్లా జియమ్మవలసలో 27.2 మిమీ, కర్నూలు జిల్లా పందికోనలో 27 మిమీ చొప్పున వర్షపాతం నమోదైందని వెల్లడించారు. ఉత్తరాంధ్రలోని అన్ని పోర్టుల్లో మూడో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్టు వాతావరణ కేంద్రం అధికారి సుధా వల్లీ తెలిపారు. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేయగా... ఆదివారం విశాఖ, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేయనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

జల దిగ్బంధంలో ఏడుపాయల వన దుర్గమాత ఆలయం

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : తెలంగాణలో ప్రసిద్ధ ఏడుపాయల వన దుర్గమాత ఆలయం జల దిగ్బంధంలో చిక్కుకుంది. మూడు రోజులుగా ఆలయానికి తాళం వేశారు. రాజగోపురం వద్ద ఉత్సవ మూర్తికి పూజలు చేస్తున్నారు. సింగూరు ప్రాజెక్ట్ 5 గేట్లు ఎత్తడంతో దిగువ మంజీరా నది పరవళ్లు తొక్కుతోంది. వరి పొలాలు నీట మునిగాయి. హల్దీ, పుష్పాలవాగు, మహబూబ్ నహర్ కాలువలు పారుతున్నాయి. మెదక్ - కామారెడ్డి జిల్లా సరిహద్దులో గల పోచారం ప్రాజెక్ట్ పొంగి పొర్లుతుంది. హవెలి ఘనపూర్ మండలం వాడి సమీపంలో గల దూప్ సింగ్ తండా వద్ద కాజ్‌వేపై నుండి పారుతుంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. కాగా జిల్లాలో చెరువులు ఇంకా నిండాల్సి ఉంది. మెదక్ జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా వర్షాలు కుడుస్తున్నందున ప్రజలు దూర ప్రాంత ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. నర్సాపూర్ మున్సిపాలిటీలోని రాయరావు చెరువు, మున్సిపాలిటీలోని 7, 9వ వార్డులలో పర్యటించి డ్రైనేజీలను పరిశీలించారు. సింగూరు ప్రాజెక్టు నుండి భారీ ఎత్తున నీరు విడుదల చేయడం వల్ల మంజీరా పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. ఘనపూర్ అనకట్ట, పోచారం ప్రాజెక్ట్ వద్దకు పర్యాటకులు వెళ్లొద్దని సూచించారు. పోలీస్ రెవిన్యూ, పంచాయతీరాజ్, శాఖల అధికారుల సెలవులు రద్దు చేసి అప్రమత్తంగా ఉంచామన్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురతే కంట్రోల్ రూం. 9391942254కి సమాచారం ఇవ్వాలని సూచించారు. కాగా అదనపు కలెక్టర్ నగేష్ ఏడుపాయల సందర్శించి వరద పర్యవేక్షించారు.

ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపి ప్రపంచ శాంతిని కాపాడాలి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : యుద్ధం వద్దు శాంతి ముద్దు అనే నినాదంతో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం నల్గొండ క్లాక్ టవర్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లం మహేష్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం ఖండించాలని పాలస్తీనాపై గత ఏడాదిన్నరగా ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని ప్రపంచ శాంతిని కాపాడాలన్నారు.ప్రపంచ శాంతిని కాపాడాలని ఆగస్టు 18న నల్గొండలో జరిగే శాంతి ర్యాలీలో ప్రముఖులు మేధావులు యువకులు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. అమెరికా అండతో ఇజ్రాయిల్ యుద్ధం పేరిట పాలస్తీనాలో చిన్నపిల్లలను సైతం వదలకుండా చంపుతున్నారు. ఇప్పటివరకు 85000 మంది చిన్న, పెద్ద చనిపోయారు లక్షల మంది నిరాశ్రయులయ్యారు, అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. యుద్ధాన్ని ప్రపంచానికి తెలియజేస్తున్నరని 245 మంది జర్నలిస్టులను చంపారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపాలని ఐక్యరాజ్యసమితి సూచనలు చేసిన అమెరికా సామ్రాజ్యవాద నియంతృత్వ ధోరణితో వివరిస్తున్న తీరును మేధావులు, వామపక్షాలు ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పుల్లెంల శ్రీకర్, గుండాల నరేష్ డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి, వడ్డగాని మహేష్, గద్దపాటి సుధాకర్ ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు కిరణ్, సైఫ్ జిల్లా నాయకులు పోకల శశి, బొడ్డుపల్లి నరేష్, గంజి రాజేష్, వంశీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు

ప్రజా సమస్యలపై పోరాటాలకు రూపకల్పన

విశాలాంధ్ర - వనపర్తి : సిపిఐ 4వరాష్ట్ర మహాసభలు ప్రజా సమస్యలపై పోరాటాల రూపకల్పనకు వేదిక ఉందని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ అన్నారు. శనివారం పెబ్బేర్ లో సిపిఐ నాలుగవ రాష్ట్ర మహాసభల గోడ పత్రికలను విడుదల చేసి మాట్లాడారు. మల్కాజ్గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో మహాసభలు ఆగస్ట్ 20 నుంచి 22 వరకు మూడు రోజులపాటు జరుగుతాయన్నారు. రాష్ట్రంలో దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మహాసభ చర్చిస్తుందని పరిష్కారానికి పోరాట కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా మతం పేరుతో దేవుళ్ళ పేరుతో ప్రజలను మోసం చేస్తున్న బిజెపి బండారాన్ని మహాసభల్లో ఎండగట్టటం జరుగుతుందన్నారు. బిజెపి వ్యతిరేక శక్తులను బలోపేతం చేసేందుకు ప్రణాళికలను రూపొందిస్తారు అన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చి 11 ఏళ్లు గడిచిన సామాన్య ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. సంపన్నుల ఆదాయం మాత్రం పెరిగిందన్నారు. ప్రధాని మోదీ మాటలు గారడిని తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీ లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసేందుకు నలుమూలల నుంచి ప్రతినిధులు తరలిరావాల న్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీరామ్ పెబ్బేరు మండల సహాయ కార్యదర్శులు పెద్ద మొగులయ్య, గాంధీ, నాయకులు శాంతమూర్తి, పెద్ద మన్యం, రిక్షారాములు, గంధం శివ, ఎస్.చంద్రయ్య, జి.లక్ష్మన్న,గొర్ల వెంకటన్న, గంధం కృష్ణయ్య, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి జన్మదినోత్సవం సందర్భంగా పాటల పోటీలు

విశాలాంధ్ర - నేరేడుచర్ల : హైదరాబాదులోని చిరంజీవి పుట్టినరోజు వేడుకల సందర్భం గా శనివారం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి పాటల పోటీలో భాగంగా సెమీఫైనల్‌లో పాటల పోటీ కార్యక్రమంలో మొదటి విజేతగా ఎంపికైన సూర్యపేట జిల్లా నేరేడుచర్ల మండలం సోమవారం గ్రామ సిద్దపంగా సౌమ్య రాష్ట్రస్థాయి పాటల పోటీలో ప్రథమ బహుమతి పొందినందుకు గాను కుటుంబ సభ్యులు బంధుమిత్రులు ఆనందోత్సాహాలతో వేడుకలు జరుపుకున్నారు.

గురుకుల పాఠశాలలో సైన్స్ టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - కొత్తగూడెం : పాల్వంచలోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల లో టీజీటీ జనరల్ సైన్స్ పోస్ట్ ఖాళీ ఉందని ప్రిన్సిపాల్ ఇ.జీవన్ ఒక ప్రకటనలో వెల్లడించారు. పాల్వంచలో ఉన్న కొత్తగూడెం బాయ్స్ - 1 గురుకుల స్కూల్లో ఈ పోస్టుకు మహిళ అభ్యర్థుల తోపాటు పురుష అభ్యర్థులు అర్హులు కూడా అర్హులని తెలిపారు. ఈ పోస్టుకు డిగ్రీలో బి జెడ్ సి పూర్తి చేసి ఉండాలని, దీంతో పాటు బీ.ఈ.డీ చేసి కనీసం మూడు ఏళ్ల అనుభవం కలిగిన వారు అర్హులని ప్రిన్సిపల్ తెలిపారు. తమ సర్టిఫికెట్లతో పాల్వంచలోని శేఖరం బంజర్‌లో ఉన్న ఈ గురుకులలో ఈనెల 19 న సాయంత్రం 4 గంటలలోపు దరఖాస్తులు అందించాలని ఆయన కోరారు.

బాధితులకి ప్రభుత్వం అండగా ఉంటుంది : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : నల్లగొండ జిల్లా సఖి కేంద్రాన్ని శనివారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సందర్శించారు. అనంతరం సఖి సెంటర్లోని అందిస్తున్న సేవలు అందులోని విజేతలుగా ఉన్నటువంటి మహిళలని జిల్లాలో గుర్తించి వారికి గ్రామ్య రిసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్, సెంటర్ ఫర్ ఓల్డ్ సాలిడారిటీ వారి ఆర్థిక సౌజన్యంతో జిల్లాల్లో గుర్తించబడిన సఖి విజేతలకు 17 మందికి కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. బాధితులకి ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి అందుతున్న సేవలలో జాప్యం జరిగినట్లయితే ప్రభుత్వం చిత్తశుద్ధితో పోలీస్ న్యాయ శాఖల సమన్వయంతో త్వరితగతిన న్యాయం జరగడం కోసం కృషి చేస్తామని ఆమె అన్నారు. ఈ సందర్భంగా సఖి విజేతలకు వారి సమస్యల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండి వారికి ఏ విధమైనటువంటి సహాయం చేసినట్లయితే భవిష్యత్తులో మీరు ముందుకెళ్ల గలుగుతారు. వీరిని ముందుకు తీసుకెళ్లడం కోసం వివిధ ప్రభుత్వాల శాఖల సమన్వయం ఏ మేరకు అవసరం ఉన్నదో గుర్తించి వీరి కోసం జిల్లా స్థాయిలో ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సఖి విజేతలకు న్యాయం జరిగేలా చూడడం జరుగుతుందని అన్నారు. సఖి కేంద్రం నందు నెలకు సుమారుగా 60 నుంచి 70 కేసులు రావడం జరుగుతుందని వారికి జిల్లాలో ఐదు రకాలైనటువంటి సేవలను ఒకేచోట అందించడంతోపాటు వారికి త్వరితగతిన న్యాయం జరిగేలా సిబ్బంది కృషి చేయడం జరుగుతుందని అన్నారు. సఖి విజేతలు మానసిక స్థైర్యాన్ని పెంపొంది బలంగా దృఢంగా ఉండి వారు వారి కుటుంబ సభ్యుల సహకారంతో విజేతలుగా తయారవ్వాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని కె.వి కృష్ణవేణి, గ్రామ్య రిసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్ డైరెక్టర్ సుమలత, సఖి సిబ్బంది సునీత, వరుణశ్రీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ దవాఖానలో సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో - నాగర్ కర్నూల్ : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, నాగర్‌కర్నూల్ జిల్లా నిర్మాణ బాధ్యులు ఎం బాల నరసింహ డిమాండు చేశారు. జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మణ చారి భవనంలో నిర్వహించిన సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న తీవ్రమైన వర్షాల వల్ల కాలనీలు, గ్రామాలు, పట్టణాలు అన్ని కలుషితమైన నీటితో నిండిపోయి కంపుగొడుతున్న కారణంగా ఈగలు దోమలు ఎక్కువై ప్రజలు రోగాల బారిన పడుతునానరని ఆవేధన వ్యక్తం చేశారు. జిల్లా ఆసుపత్రిలో రోగులకు సరిపడా పడకలు లేవని, కావల్సిన అత్యవసర మందులు కూడా అందుబాటులో లేవని, చిన్నపాటి రక్త పరీక్షలు కూడా చేయకుండా ప్రైవేటు ల్యాబ్‌లకు పంపడం వలన ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. పేదల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వీడి జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి సరైన చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా గ్రామాల్లోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కనీసం ఒక్కో ఎంబీబీఎస్ డాక్టర్‌ను ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. లేని యెడల డిఎంహెచ్ఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈర్ల చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా పార్టీ కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్, రాష్ట్ర సమితి సభ్యులు హెచ్ ఆనంద్ జి, కేశవులు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పెబ్బేటి విజయుడు, కోళ్ల యేసయ్య, జిల్లా సమితి సభ్యులు కృష్ణాజి, శంకర్ గౌడ్, మర్యాద వెంకటయ్య, బోల్లెద్దుల శ్రీను, రవీందర్, విద్య శ్రీను, బండి లక్ష్మీపతి, తుమ్మల శివుడు, మారేడు శివశంకర్, బాలమురళి, వెంకటమ్మ, కిరణ్ కుమార్, ఖాజా మైనుద్దీన్, పరశు రాములు, గోపాల్, ఆంజనేయులు, మధు గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుడి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - నేరేడుచర్ల : దేశమంతా ఆనందోత్సాహాలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్దలు తమ చిన్నారులతో ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా నేరేడుచర్ల పట్టణంలో గల శ్రీ కోదండ రామాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ అంజలి పాఠశాల విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆలయాలు చిన్నారుల ఇల్లు పూలతో అలంకరించారు, తల్లి తండ్రి వారి చిన్నారి బాల బాలికలను శ్రీకృష్ణుడు, రాధగా అలంకరించి మురిసి పోయారు. చిన్నారుల వేషధారణ ఆకట్టుకుంది పిల్లలు పండుగలను ఆస్వాదిస్తూ, ధర్మం, నీతి విలువలను నేర్చుకుంటుండటం అభినందనీయం అని పెద్దలు అభిప్రాయపడ్డారు.

జర్నలిస్టుల సమస్యను పరిష్కరిస్తాం

విశాలాంధ్ర బ్యూరో -పెద్దపల్లి: ఇంటి స్థలాలు, ఇండ్ల కోసం పోరాడుతున్న జర్నలిస్టుల సమస్యను పరిష్కరిస్తానని పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయ రమణారావు స్పష్టం చేశారు. శనివారం పెద్దపల్లిలోని క్యాంపు కార్యాలయంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ), టీడబ్ల్యుజేఎఫ్, పెద్దపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఎమ్మెల్యేను కలిసి పెద్దపల్లి పట్టణం, మండల పరిధిలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల జాబితాతో కూడుకున్న వినతి పత్రాన్ని అందజేశారు. ఈ విషయమై ఎమ్మెల్యే విజయరమణ రావుతో పాటు మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, ఉత్తంకుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి వినతి పత్రాలు ఇచ్చామని గుర్తు చేశారు. ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి కలెక్టరేట్‌కు సమీపంలో గల సర్వే నంబర్ 129లో 5 గుంటల ప్రభుత్వ భూమిని ఇప్పించాలని కోరారు. ఈ విషయమై ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ వెంటనే ప్రభుత్వ స్థలాలను గుర్తించి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇస్తామని, సొంత ఇంటి స్థలం ఉన్న జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ వెంటనే జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఫోన్ చేసి జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు గాను పెద్దపల్లి పట్టణం, శివారులో ప్రభుత్వ భూములను త్వరగా గుర్తించాలని చెప్పారు. జర్నలిస్టు నాయకులు బుర్ర సంపత్ కుమార్ గౌడ్, నారాయణదాసు అశోక్, చింతకింది చంద్రమౌళి, పోగుల విజయ్ కుమార్, ఎండి గౌస్ పాషా, బాలసాని రాజయ్య, బాలసాని వెంకటేశం గౌడ్, కొండ లింగమూర్తి యాదవ్, వీరమల్ల విద్యాసాగర్, ఆకుల రమేష్, తిరుమల సురేష్, జర్నలిస్టులు జంగా సంపత్, కుమ్మరి ముఖేష్, చేగొండ రవికుమార్, కన్నూరి ఆంజనేయులు, ఎండి ఇబ్రహీం, కొత్తకొండ సతీష్, రావుల చంద్రమౌళి, బొల్లి సత్యనారాయణ, అడిచెర్ల రమేష్, మాజిద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో, ములుగు సబ్-డివిజన్లోని లోతట్టు ప్రాంతాలు, జంపన్న వాగు పరివాహక ప్రాంతాలలో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పోలీస్ శాఖ ములుగు డి ఎస్పీ ఎన్. రవీందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా డి ఎస్పీ రవీందర్ మాట్లాడుతూ ప్రజలు వరద నీటి ప్రవాహంలో ఉన్న వంతెనలు, కల్వర్టులు, రహదారులపై నుంచి దాటరాదని, అలాగే శిధిలావస్థలో ఉన్న ఇండ్లలో నివాసం ఉండకూడదన్నారు. తడిగా ఉన్న విద్యుత్ కరెంట్ పోల్స్, ట్రాన్స్ఫార్మర్లు తాకవద్దని, గ్రామాల్లో చేపల వేటకు ఎవ్వరూ వెళ్లవద్దని, అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని, వరద ప్రవాహాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - హుస్నాబాద్ : తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల పేరెంట్స్ అసోసియేషన్ (టీఆర్జీపీఏ) నూతన కార్యవర్గం ఎన్నుకున్నట్లు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కార్యదర్శి శ్రీరాముల వెంకటేశ్వర్లు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడు తూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠశాలల్లో విద్య, వైద్యం, ఆహారం, అన్ని సౌకర్యాలను కల్పించేందుకు తల్లిదండ్రులకు జిల్లాల వారీగా బాధ్యతలను అప్పగించి, సంఘటితం చేస్తే, విద్యారంగ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సిద్దిపేట జిల్లాలో 16 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలబాలికల ఆశ్రమ పాఠశాలు ఉన్నాయని చెప్పరు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో నూతన కమిటీలో జిల్లా ప్రధాన కార్యదర్శి వంతడుపుల శ్యాంసుందర్, ఆహార కార్యదర్శి గంగారపు చేతన్, సహాయ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, వి.శ్రీనివాస్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

మరో నాలుగు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : భారీ వర్షాలా కారణంగా, ములుగు జిల్లా ప్రజలు, మరో నాల్గు రోజులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వాతావరణం శాఖ సూచనల మేరకు, భారీ, అతిభారీ వర్షాలు మరో నాలుగు రోజులు ఉంటాయని, ప్రజలు ఎవరు కూడ బయటికి వెళ్ళవద్దని, అత్యవసరం ఉంటే తప్ప, బయటికి పోవద్దని, పాత బడ్డ నివాసంలో ఉండవద్దని, వర్షల వల్ల ఇల్లులు కూలి పోయే ప్రమాదం ఉందని, వర్షాలు తగ్గు ముఖం పట్టే వరకు బంధువుల, ఇల్లలో కొద్దిరోజులు ఉండాలని కోరారు. ఎవరు కూడ వాగులు, దటావద్దని, చేపల వేటకు వెళ్ళవద్దని, వాగులు, గోదావరి నీరు ప్రవాహం ఎక్కువగా ఉందన్నారు. గర్భిణీ స్త్రీల కోసం, వైద్య శాఖ తగ్గు జాగ్రత్తలు ఏర్పాటు చేసారని, ఆశా వర్కర్స్ అందుబాటులో ఉన్నారని, అత్య అవసరం ఉంటే వెంటనే, ఆసుపత్రికి తరలించాలన్నారు. సమస్యలు ఉంటే, అధికారులకు వెంటనే సమాచారం అందించాలని కోరారు.

కడెం ప్రాజెక్టు పరిసరాలకు ఎవరూ వెళ్లవద్దు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్, నియోజకవర్గం లోని కడెం, నదీ పరివాహక ప్రాంతాలు, వాగులు, లోతట్టు ప్రదేశాలకు ఎవరూ వెళ్లవద్దని, ముఖ్యంగా పశువుల కాపరులు తమ పశువులను నది-వాగుల దారుల్లోకి తీసుకెళ్లకూడదని కలెక్టర్ సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షణలో భాగంగా అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కడెం ప్రాజెక్ట్ గేట్లు ఎత్తిన నేపథ్యంలో దిగువ గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. నదీ పరివాహక ప్రాంతాల్లోకి చేపలు పట్టేవారు, రైతులు, ఇతరులు వెళ్లకూడదని హెచ్చరించారు. జిల్లా యంత్రాంగం 24 గంటలు అప్రమత్తంగా ఉందని, ఎస్టీఆర్ఎఫ్ టీంలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 91005 77132 ను సంప్రదించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర- చర్ల: చర్ల మండల పరిధిలోని అనేక గ్రామాలలో డెంగ్యూ, మలేరియా, విష జ్వరాలు వ్యాప్తి చెంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని సిపిఐ మండల కార్యదర్శి నూప పోతయ్య ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధుల వ్యాప్తిని అరికట్టడానికి సంబంధిత వైద్యాధికారులు మండల అధికారులు సంయుక్తంగా ప్రణాళికను రూపొందించాలన్నారు. డెంగ్యూ వంటి వ్యాధు లు ప్రజారోగ్యానికి ముప్పుగా పరిగణిస్తుందన్నారు. వ్యాధుల వ్యాప్తిని అరికట్టడానికి దోమ తెరలు అందించి, దోమల నిర్మూలనకు పారిశుధ్య పనులు వెంటనే చేపట్టాలని కోరారు. దోమల ద్వారా వ్యాప్తించే వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో దోమల నివారణ మందులను స్ప్రే చేయాలన్నారు. ప్రజల ప్రాణాలు పోక ముందే అధికారులు చర్యలు తీసుకుంటే మంచిదన్నారు.

అవసరం మేరకే రైతులు యూరియా కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో -పెద్దపల్లి: ప్రస్తుత అవసరం మేరకే రైతులు యూరియా కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో యూరియా పంపిణీ పై వ్యవసాయ అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షరివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రస్తుత అవసరం మేరకు మాత్రమే రైతులు యూరియా కొనుగోలు చేయాలని, ఈ అంశాన్ని మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ఎట్టి పరిస్థితుల్లో యూరియా ను ముందస్తుగా కొనుగోలు చేసే నిల్వ చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో యూరియా నిలువలు బాగా ఉన్నాయని రైతులు ఆందోళన చెందవద్దని వ్యవసాయ విస్తరణ అధికారు లు గ్రామాల పర్యటన సందర్భంగా రైతులకు తెలియజేయాలని, రైతులు భయభ్రాంతులకు గురై పెద్ద ఎత్తున బస్తాలు కొనకుండా రైతులను చైతన్య పర్చాలని అన్నారు. గ్రామాలలో ఒకే వ్యక్తి తరచుగా యూరియా కొనే వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

21న చంద్రుగొండలో ముఖ్యమంత్రి పర్యటన

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ఈనెల 21న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మారుమూల ఏజెన్సీ గ్రామం బెండలపాడు రానున్నారు. దశాబ్దాలుగా ఏ ముఖ్యమంత్రి కూడా ఆ హెూదాలో ఈ మండలాన్ని సందర్శించిన దాఖలాలు లేవు. దీంతో మండల ప్రజల్లో ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. మండలంలో నెలకొన్న సమస్యలు తీరుస్తూ, వరాలు కురిపిస్తారని ముఖ్యమంత్రిపై ప్రజల్లో ఆశాభావం సర్వత్ర కనిపిస్తుంది. వ్యూహాత్మకంగా ఈ గిరిజన గ్రామాన్ని ఎంచుకొని ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి ఇక్కడ మోడల్ గా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బెండాలపాడు గ్రామంలో జిల్లా అధికారులతో సీఎం పర్యటన నేపథ్యంలో సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కోరారు. సభాస్థల నిర్మాణం, వేదిక రూపకల్పన, అతిథులు కూర్చునే సదుపాయాలు, పార్కింగ్ ఏర్పాట్లు, రవాణా, పారిశుధ్యం, తాగునీటి సదుపాయాలు, విద్యుత్ సరఫరా, వైద్య శిబిరం, అగ్నిమాపక సిబ్బంది, భద్రతా చర్యలు వంటి అంశాలను నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ సమగ్ర భద్రతా చర్యలు చేపడతామన్నారు. హెలిప్యాడ్ ప్రదేశంలో ముఖ్యమంత్రి కాన్వాయ్ మినహాయించి వేరే వాహనాలకు అనుమతి ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ సియం పర్యటన విజయవంతం చేయడం అధికారులతో పాటు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తల బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా బెండాలపాడు గ్రామంలో సభాస్థలి, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు అందరూ పాల్గొన్నారు.

ముస్లిం విద్యార్థులు బీఈడీ కౌన్సిలింగ్



విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ఈ ఏడాది జరిగిన బి.ఈడి - 2025 ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులైన ముస్లిం మైనార్టీ విద్యార్థులు మైనారిటీ కాలేజీలలో ప్రవేశాల కొరకు నిర్వహించే ప్రత్యేక కౌన్సిలింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎండి. యాకూబ్ పాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన ముస్లిం విద్యార్థులు ఎడ్ సెట్ ర్యాంకు కార్డు, ఇంటర్, డిగ్రీ, 10వ తరగతి మెమో, 9 నుండి డిగ్రీ వరకు చదివిన స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఒరిజినల్‌తో పాటు తొమ్మిది సెట్ల జిరాక్స్ కాపీలతో హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఉన్న ముస్లిం యూనివర్సిటీ, ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ దగ్గర జరిగే కౌన్సిలింగ్‌కు హజరుకావాలని ఆయన కోరారు. ఈనెల 19న ఫిజికల్ సైన్స్, మ్యాథమెటిక్స్, ఓరియంటల్ లాంగ్వేజ్ విద్యార్థులకు, 20వ తేదీన సోషల్ స్టడీస్ విద్యార్థులకు, 21న బయోలాజికల్ సైన్స్ విద్యార్థులకు కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. ఇతర వివరాల కోసం కన్వీనర్ జుబేర్ 9700375315, 8520860785 సెల్ నంబర్లకు సంప్రదించాలని యాకుబ్ పాషా కోరారు.

ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రైతు క్లబ్ చైర్మన్ పరామర్శ

విశాలాంధ్ర - చర్ల: వర్షాకాల సీజనల్ వ్యాధులతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను రైతు క్లబ్ చైర్మన్ కొత్తపల్లి రామాంజనేయులు పరామర్శించారు. రోగులకు అందుతున్న వైద్య చికిత్సల గురించి అడిగి తెలుసుకున్నారు. శనివారం ఆయన తొలుత కృష్ణాష్టమి సందర్భంగా జరిగిన కొన్ని సామాజిక సేవల్లో పాల్గొన్నారు. తదుపరి చర్లలో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని అక్కడ ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో హాజరై స్వయంగా ఉట్టి కొట్టి స్థానికులను అలరించారు. అనంతరం ఆసుపత్రిని సందర్శించి వ్యాధిగ్రస్తు లకు పళ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. ఎవరికి ఏమైనా అవసరం ఏర్పడితే తాను ఎల్లప్పుడు సేవ చేయడానికి ముందుంటానని భరోసా ఇచ్చారు. పోలిన లంక రాజు, సోయం రాజారావు, కాకి అనిల్, పంజా రాజు, గార చంటి పాల్గొన్నారు.

ఉద్యమాల వేగుచుక్క అయోధ్య...

నేడు మణుగూరులొ సంతాప సభ : సాబీర్ పాషా

విశాలాంధ్ర - మణుగూరు : నాలుగు దశాబ్దాల కాలంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని తడిమి చూస్తే పీడిత ప్రజల మనిషిగా ఉద్యమాల వేగుచుక్కగా సిపిఐ రాష్ట్ర నాయకులు అమరజీవి బొల్లోజు అయోధ్య గుర్తుకొస్తారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబిర్ పాషా అన్నారు. అసమాన పోరాట యోధునిగా, ప్రజా సమస్యల పరిష్కారంలో మడమతిప్పని నాయకునిగా పేరున్న అయోధ్య రోడ్డు ప్రమాదంలో పులుప్ర్కమించడం పేద, బాధిత ప్రజలకు తీరని లోటని సాబీర్ పాషా శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలు తెలిపారు. మణుగూరులో ఆదివారం అయోధ్య సంతాప సభ పెద్ద ఎత్తున నిర్వహించను న్నట్లు తెలిపారు. సూర్యాపేట నియోజకవర్గ పరిధిలో ఉన్న తుంగతుర్తి మండలంలోని గానబండ్ల అయోధ్య స్వగ్రామం అని వివరించారు. యాదృచ్ఛి కంగా అయోధ్య ఏ ప్రాంతంలో జన్మించారో అదే ప్రాంతంలో ఇటీవల చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదములో తుది శ్వాస విడిచారన్నారు. తొలినాళ్ల నుండి కమ్యూనిస్టు భావాజాలం గల కుటుంబం కావడంతో ఆయన సహజంగానే ఎర్రజెండా సిద్ధాంతాలను పునికి పుచ్చుకున్నారన్నారు. ప్రస్తుత పినపాక నియోజకవర్గం ఏజెన్సీ ప్రాంతంలో అప్పటి నాయకులైన దాట్ల వెంకటేశ్వర బాబు, మైసా కొండయ్య, పాకాలపాటి వెంకటేశ్వరరావు (పెద్దబ్బాయి)తో కలిసి బలమైన ప్రజాఉద్యమాలు నిర్మించారని ఆనాటి పోరాటాలు సాబీర్ గుర్తు చేసారు. రెండు దశాబ్దాలుగా మణుగూరు ప్రాంతంలో ప్రధానంగా నియోజకవర్గ వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీకి అన్నీ తానై నిలిచారన్నారు. ఆనాటి పీపుల్స్ వార్ నాయకులు కొండన్న, మంగన్న, ఏప నారాయణస్వామి దళాలు అయోధ్యని అడవుల్లోకి ఎత్తుకెళ్లి " ఏజెన్సీ గ్రామాల్లో నువ్వు కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం చేపట్టడం మా పీపుల్స్ వార్ ఉనికికి ప్రమాదంగా మారుతోందని "చెప్పి పాయింట్ బ్లాక్ రేంజిలో తుపాకి ఎక్కి పెట్టినా అయోధ్య ఏమాత్రం బెదరకుండా " తాను కూడా పేద ప్రజల కోసమే ఉద్యమిస్తున్నానని ఏమాత్రం వెనక్కు తగ్గేది లేదని అయోధ్య గుండెల్లోని ఎర్ర జెండా సాక్షిగా.. దమ్ముంటే కాల్చండంటూ ఎదురొడ్డి నిలిచిన దమ్మున్న దీశాలి అని కొనియాడారు. ఆయన కార్మికులు, కర్షకుల పక్షాన నిలబడి కమ్యూనిస్టు పార్టీ ప్రజా సంఘాల నిర్మాణంలో కీలక భూమిక పోషించారన్నారు. బూర్గంపాడు, పినపాక నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల గెలుపులో ఆయన ప్రభావం స్పష్టంగా కనిపించేదన్నారు. దేశ, రాష్ట్ర రాజకీయ అవసరాల నిమిత్తం సిపిఐ అధిష్టానం తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి పనిచేసేవారన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తో కలిసి 400 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టి ప్రజలను రాష్ట్ర సాధనకై చైతన్యపరిచిన స్ఫూర్తి ప్రదాత అన్నారు. మణుగూరు విద్యుత్ సౌధ నిర్మాణంలో కీలక పాత్ర వహించి భూ నిర్వాసితులకు హేతుబద్ధమైన ప్యాకేజీ ఇప్పించడంతో పాటు ఆ పరిశ్రమలో ఉద్యోగ, ఉపాధి కల్పనకు ఆయన చేసిన కృషి చిరకాలం నిలిచిపోతుందన్నారు. జీవన పరిణామ క్రమంలో ఏ మనిషి కైన మరణం తధ్యమే అయినా అయోధ్య చేసిన అసమాన త్యాగాలు చిరస్మరణీయమన్నారు.

సంపాదకీయం

బుట్టలోంచి పామును తీసిన మోదీ

అధికారంలోకి వచ్చిన తరవాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మత విద్వేష పామును బుట్టలో దాచి పెట్టారట. "స్వాతంత్ర్యం వచ్చిన తరవాత కూడా మనం కులతత్వం, మతతత్వంతో ఇబ్బందులు పడుతూనే ఉన్నాం. ఈ దుష్ట వ్యవహారాలు ఇంకెన్నేళ్లు కొనసాగాలి. పదేళ్ల దాకా వీటి జోలికి వెళ్లకుండా ఉందామని ప్రతిజ్ఞ చేద్దాం" అని మోదీ అధికారం చేపట్టిన కొత్తలో పేర్కొన్నారు. అంతమాత్రం చేత మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ఆ తరవాత ప్రధానమంత్రి అయిన తరవాత మతోన్మాద రాజకీయాలకు దూరంగా ఉన్నారని కాదు. ఆయన ప్రధానమంత్రి అయిన దగ్గర నుంచి గో సంరక్షణ పేరుతోనో మరో పేరుతోనూ మతోన్మాదం చెలరేగుతూనే ఉంది. ఏమైతేనేం పదేళ్లపాటు కుల, మత చిచ్చులకు దూరంగా ఉందామన్న మోదీ ఆ "చాంద్రాయణ వ్రతాన్ని" వదులుకున్నట్టున్నారు. శుక్రవారం ఆయన ఎర్రకోట బురుజుల మీంచి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ను కీర్తించడంతో ఆయనలో ఉన్న మతత్వవాదం మళ్లీ బుసలు కొట్టింది. అంటే ఇన్నాళ్లు బుట్టలో దాచి ఉంచిన మతోన్మాదాన్ని ఆయన బయటకు తీసినట్టున్నారు. కుల, మతోన్మాదాలకు పదేళ్లు దూరంగా ఉందామనడంలో ఆంతర్యం మళ్లీ వీటికి పని చెప్దామన్నదే మోదీ ఆలోచన అయి ఉండాలి. శుక్రవారం ఎర్ర కోట బురుజుల మీంచి ఆయన చెప్పిన మాటలు మతోన్మాదం అంటే ఆయనకు ఎంత ప్రీతిపాత్రమో అర్థమవుతూనే ఉంది. మోదీ కేవలం ఆర్ఎస్ఎస్‌ను మాత్రమే ప్రస్తుతించారు. మిగతా ఎవరూ ఆయన కంటికి కనిపించలేదు. ఆర్ఎస్ఎస్ ఏర్పడి వందేళ్లు అయి ఉండొచ్చు. ఆ సంస్థ చేసిన "సేవ" మోదీకి ఆనందం కలిగించి ఉండవచ్చు. కానీ ఆర్ఎస్ఎస్ అనేక త్యాగాలు చేసిందని ఆయన చెప్పిన మాట పచ్చి అబద్ధం. స్వాతంత్ర్య పోరాటంలో ఆర్ఎస్ఎస్‌కు ఏ పాత్రా లేదు. కనీసం హిందూ మహాసభలో ఉన్న కొందరైనా స్వాతంత్ర్య పోరాటంలో అంతో ఇంతో పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ అసలు లక్ష్యం "హిందూ రాష్ట్రం" ఏర్పాటు చేయడం. గోవాల్కర్ లాంటి వారు ప్రవచించిన హిందూ రాష్ట్ర సిద్ధాంతం ప్రకారం ఈ దేశంలో అత్యధిక సంఖ్యాకులు హిందువులైనందువల్ల వారి రాజ్యమే ఉండాలి. ముస్లింలు, ఇతర మతాల వారు ఈ దేశంలో ఉండాలనుకుంటే హిందువులకు లొంగి ఉండాల్సిందే. మన దేశంలో జనాభా స్వరూపాన్ని పనిగట్టుకుని మారుస్తున్నారని, చొరబాటుదార్లు మనకు దక్కాల్సిన జీవనోపాధిని లాగేస్తున్నారని కూడా మోదీ అన్నారు. చొరబాటుదార్ల గురించి మోదీ ప్రధానమంత్రి కాక ముందు నుంచీ మాట్లాడుతూనే ఉన్నారు. కానీ ఆయన ప్రధానమంత్రి అయిన తరవాత కూడా చొరబాట్లు కొనసాగుతున్నాయని ఆయన మాటలనుబట్టి అర్థం అవుతోంది. ఆయన అధికారంలోకి వచ్చిన తరవాత చొరబాట్లకు అడ్డుకట్ట వేయడానికి ఆయనను ఎవరు కాదన్నారు. సరిహద్దులో పహరాకాసే సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) సైన్యం కేంద్ర ప్రభుత్వం చేతిలోనే ఉంటాయి కదా. మరి ఎందుకు చొరబాట్లను ఆపలేక పోయారు. ఇందులో కేంద్ర హోం మంత్రి బాధ్యత ఏమీ లేదా? ఆ విషయం మోదీ ఎందుకు పట్టించుకోరో! చొరబాటుదార్లు మన యువతకు దక్కాల్సిన జీవనోపాధిని లాగేస్తున్నారంటే మన వారికన్నా వారికి ఎక్కువ తెలివితేటలు, నైపుణ్యం ఉన్నాయనుకోవాల్సి వస్తుంది కదా! ఈ మౌలిక ప్రశ్నలకు మోదీ జవాబు చెప్పరు. ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రసంగాలు మాత్రం ఇష్టానుసారం చేస్తుంటారు. మోదీ అక్కడితో ఆగలేదు. ఈ చొరబాటుదార్లు మన సోదరీమణులను, కూతుర్లను లొంగదీసుకుంటున్నారంటారు. దీనికి సంఘ్ పరివార్ పెట్టిన ముద్దు పేరు "లవ్ జిహాద్." ఈ లవ్ జిహాద్ కొనసాగుతున్నట్టు ఇప్పటిదాకా ఒక్క సందర్భంలోనూ రుజువు కాలేదు. పైగా మోదీ మాటలనుబట్టి చూస్తే "లవ్ జిహాద్"కు పాల్పడుతున్నది చొరబాటుదార్లే అయి ఉండాలి. చొరబాటుదార్లు అని ఆయన వాడుతున్న మాట కేవలం ముస్లింలను ఉద్దేశించి మాత్రమేనని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. "లవ్ జిహాద్" గురించి మోదీ మాట్లాడినా, సంఘ్ పరివార్ కుదురులోని మరెవరు మాట్లాడినా దానికి రుజువులే లేవు.

మైనారిటీ వర్గం మీద మెజారిటీ వర్గం దాడి చేయడాన్ని అర్థం చేసుకోవచ్చు. విచిత్రంగా సంఘ్ పరివార్ మెజారిటీగా ఉన్న హిందూ మతానికి ముస్లింల నుంచి ముప్పు ఉందని సంఘ్ పరివార్ విచిత్రమైన వాదన చేస్తూ ఉంటుంది. చొరబాటుదార్లు దేశ భద్రతకు ముప్పు అని మోదీ అంటున్నారు. రొహింగ్యా చొరబాటు దార్ల గురించి బీజేపీ నానా యాగీ చేసింది. తీరా ప్రభుత్వ లెక్కల ప్రకారమే వారి సంఖ్య కొన్ని వేలకు మించి లేదు. ఈ రుగ్మతను ఎదుర్కోవడానికి జనాభా స్వరూప పథకం ప్రారంభిస్తారట. వాలకం చూస్తూ ఉంటే ఈ పథకం కూడా ముస్లింలను వేధించడానికి మరో ఆయుధంలా తయారయ్యేలా ఉంది. మరో వేపున ముస్లింల ఓటు హక్కు లాగేసే ప్రయత్నాలు ఎంత తీవ్రంగా జరుగుతున్నాయో చూస్తూనే ఉన్నాం. మన జీవితాల్లో, వ్యవస్థల్లో, నిబంధనల్లో, చట్టాలో, సంప్రదాయాల్లో బానిస చిహ్నాలు ఒక్కటి కూడా ఉండకూడదని మోదీ అంటున్నారు. అంటే వైవిధ్యభరితమైన మన సంప్రదాయంలో హిందుత్వ ఛాయలు తప్ప మరేదీ ఉండకూడదని మోదీ ఆలోచన. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో మోదీ బాహాటంగా ఆర్ఎస్ఎస్‌ను పొగడడం అంటే పాలక పక్షంలోని వైరుధ్యాలను దూరం చేయడం కావొచ్చు. హిందుత్వ మతతత్వ రాజకీయాలను మరింత ప్రోత్సహిస్తే ఆ కుదురులో ఉన్న వారి మధ్య వైరుధ్యాలు సమసి పోయేట్టు చేయొచ్చునన్నది మోదీ ఆలోచన కావొచ్చు. ఆర్ఎస్ఎస్. ఎజెండా అమలు చేసినంత మాత్రాన మోదీ పదవికి భరోసా ఉండే పరిస్థితి లేదు. అందుకే ఆయన బహిరంగంగా, అధికార కార్యక్రమాల్లోనూ సంఘ్ పరివార్‌ను సంతృప్తి పరిచే పనిలో నిమగ్నమయ్యారు. విపరీతమైన వైవిధ్యం ఉన్న దేశంలో ప్రధానమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి తన కుదురుకు చెందిన వారిని వెనకేసుకు రావడం అత్యంత ప్రమాదకరమైన పరిస్థితికి దారి తీస్తుంది. మోదీ ఆర్ఎస్ఎస్‌ను బాహాటంగా కీర్తించే పరిస్థితి తలెత్తింది అంటే అది ప్రత్యక్షంగా నిజమైన స్వాతంత్ర్య సమర యోధులను అవమానించడమే. వ్యక్తిత్వ నిర్మాణానికి, రాష్ట్ర (దేశ) నిర్మాణానికి, మాతృభూమి నిర్మాణానికి ఆర్ఎస్ఎస్ వారు తమ జీవితాలను అంకితం చేశారని మోదీ చెప్పడం అత్యంత హాస్యాస్పదం. ఆర్ఎస్ఎస్‌ను కీర్తించడం అంటే రాజ్యాంగ స్ఫూర్తిని, సెక్యులర్ గణ తంత్రాన్ని అవమాన పరచడమే. తాను ఎదిగి వచ్చిన సంస్థ మీద మోదీకి అభిమానం ఉండడంలో ఆశ్చర్యం లేదు. కానీ ఆర్ఎస్ఎస్ దేశ సేవకు అంకితమైంది అని స్తుతించడం ఎంత మాత్రం అంగీకార యోగ్యం కాదు.

ప్రభుత్వాల అలసత్వానికి పీపీబీఆర్ నిలువుటద్దం!


టి. లక్ష్మీనారాయణ

పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయరు(పీఏబీఆర్) నిర్వహణ పట్ల శ్రద్ధపెట్టి, దానికి అవసరమైన మరమ్మతులు చేసి, తుంగభద్ర రిజర్వాయరు నుంచి 10 టీఎంసీలను పీఏబీఆర్‌కు తరలించడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందడం అత్యంత గర్హనీయం. కె. శ్రీరామకృష్ణయ్య పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయరుగా నామకరణం చేసిన ఈ రిజర్వాయరులో ఒక్కసారి మాత్రమే ఆరు టీఎంసీలను నిల్వ చేసినట్లు గతంలో ప్రసారమాధ్యమాల్లో వార్త చదివినట్లు గుర్తు. తుంగభద్ర డ్యాం పూడిక వల్ల గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 101 టీఎంసీలకు పడిపోయింది. గత ఏడాది ఒక గేటు దెబ్బతిన్నది. సాంకేతిక నిపుణులు కన్నయ్యనాయుడు నేతృత్వంలో యుద్ధప్రాతిపదికన కొత్త గేటును ఏర్పాటు చేసి, ఆదుకున్నారు. మిగిలిన గేట్లకు సత్వరం మరమ్మతులు చేయాలని సూచించినా చేయని పర్యవసానంగా ప్రస్తుతం నీటి నిల్వను 80 టీఎంసీలకు కుదించారు. మరొక వైపున గడచిన రెండున్నర నెలల్లోనే తుంగభద్ర నది నుంచి శ్రీశైలం జలాశయానికి దాదాపు 150 టీఎంసీలు చేరాయి. ఈ నేపథ్యంలో కూడా పీఏబీఆర్‌లో 3.5 టీఎంసీలు మాత్రమే నిల్వ చేశారు. పీఏబీఆర్‌ను గరిష్ట సామర్థ్యంలో వినియోగించుకోవడంలో వరుస ప్రభుత్వాలు ఎలా విఫలమవుతున్నాయో! ఇదొక ప్రబల నిదర్శనం. గరిష్ట నిల్వ సామర్థ్యాన్ని 5.5 టీఎంసీలకు కుదించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అదే నిజమైతే ఆత్మహత్యాశదృశ్యమే!

పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయరు, యాడికి కాలువ

నిర్మాణం కోసం, పీఏబీఆర్‌కు తుంగభద్ర రిజర్వాయరు నుంచి 10 టీఎంసీల సాధన కోసం సాగించిన పోరాటాల్లో సీపీఐ, అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ముఖ్యమైన పాత్ర పోషించాయి. అలుపెరగని ఉద్యమాల ద్వారా సాధించుకున్న ప్రాజెక్టు పీఏబీఆర్. అనంతపురం జిల్లా కూడేరు మండలం కొర్రకోడు గ్రామం సమీపంలో పెన్నా నదిపై 11.10 టీఎంసీల గరిష్ట నిల్వ సామర్థ్యంతో పీఏబీఆర్‌ను నిర్మించారు. పీఏబీఆర్ కుడి కాలువ కింద 50,000 ఎకరాలు, యాడికి కాలువ వ్యవస్థ కింద 50,000 ఎకరాలు, చెరువుల కింద 7,500 ఎకరాల స్థిరీకరణకు నీటిపారుదల సౌకర్యం కల్పించడంతో పాటు తాగునీరు అందించే లక్ష్యంతో నిర్మించారు. 1978లో పీఏబీఆర్ కుడి కాలువ నిర్మాణాన్ని చేపట్టి 1997 నాటికి దాదాపు పూర్తి చేశారు. రెండవ దశ కింద యాడికి కాలువను నిర్మించాలని చాలా కాలం పాటు పోరాటం కొనసాగించాల్సి వచ్చింది. పీఏబీఆర్ వద్ద 40 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తికి మౌలిక సదుపాయాలు కూడా నెలకొల్పారు.

పీఏబీఆర్, యాడికి కాలువ కోసం సాగించిన ఉద్యమాలకు నాయకత్వం వహించిన అమరజీవి కామ్రేడ్ వీకే ఆదినారాయణరెడ్డి చిరస్మరణీయులు. నాడు రు.140 కోట్లకుపైగా వెచ్చించి నిర్మించిన పీఏబీఆర్ నీరులేని ప్రాజెక్టుగా పాలకులను వెక్కిరించింది. బచావత్ ట్రిబ్యునల్ కేసీ కెనాల్‌కు తుంగభద్ర డ్యాం నుంచి కేటాయించిన 10 టీఎంసీలను అత్యంత కరవు పీడిత అనంతపురం జిల్లాలో నిర్మించిన పీఏబీఆర్‌కు సర్దుబాటు చేసి, శ్రీశైలం జలాశయం నుంచి కేసీ కెనాల్‌కు 10 టీఎంసీలను సర్దుబాటు చేయాలన్న కోర్కెను ప్రభుత్వాలు చాలా కాలం పెడచెవిన పెట్టాయి. కోట్ల విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రగా ఉన్నప్పుడు, ఆయన "ఎవర్ని అడిగి ఆ ప్రాజెక్టు కట్టారు? ఆ ప్రాజెక్టుకు నీరు ఎక్కడ నుంచి యివ్వను? కేసీ కెనాల్ ఆయకట్టుకు నష్టం జరుగుతుందంటూ తిరస్కరించారు". కడప జిల్లాలోని కేసీ కెనాల్ ఆయకట్టుదారుల పక్షాన కొందరు గట్టిగా వ్యతిరేకించారు. రాష్ట్ర స్థాయిలో అఖిల పక్ష సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసిన తర్వాత కూడా ఆ సమస్య పరిష్కారం కాలేదు. ప్రజలు సాగించిన పోరాట ఫలితంగా శ్రీశైలం జలాశయం నుంచి 10టీఎంసీలను కేసీ కెనాల్‌కు సర్దుబాటు చేసి, తుంగభద్ర డ్యాం నుంచి 10 టీఎంసీలను పీఏబీఆర్‌కు సర్దుబాటు చేస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో నెం.3ను జారీ చేసింది. పీఏబీఆర్ వెనుక ఇంత పోరాటాల చరిత్ర ఉన్నా నేటికీ 10 టీఎంసీలను తుంగభద్ర డ్యాం నుంచి తరలించక పోవడం ఎంత దుర్మార్గం, ప్రభుత్వాల అసమర్థతకు ఇది తార్కాణం. ప్రజలు విజ్ఞతతో నీటి పారుదల ప్రాజెక్టుల సమస్యలపై ఆలోచించమని విజ్ఞప్తి.

ఆలోచనాపరుల వేదిక

కార్పొరేట్లు క్విట్ ఇండియా

అమర్‌జిత్ కౌర్
ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి

"కార్పొరేట్లు ఇండియాను వదలాలి" అనే నినాదంతో పది కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) అధ్వర్యాన సంయుక్తంగా ఆగస్టు 13న దేశవ్యాప్తంగా జరిగిన నిరసనాందోళన విజయవంతంగా జరిగింది. ప్రైవేటీకరణకు, ప్రభుత్వరంగ సంస్థలను చౌకగా విక్రయించడానికి, కార్పొరేట్ల లూటీకి వ్యతిరేకంగా ఉద్యమం మారుమోగింది. ప్రధానంగా 'కార్పొరేట్లు ఇండియాను వదిలిపెట్టాలి' అని పెద్దపెట్టున నినదించారు. పట్టణాలు, నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో అనేకచోట్ల పరిశ్రమలు, ఫ్యాక్టరీల గేట్ల వద్ద తమ డిమాండ్లను నినదించారు. జిల్లా కేంద్రాలు ఇతర బహిరంగ ప్రదేశాలలోనూ డిమాండ్లను ప్రజల, పాలకుల దృష్టికి తీసుకువెళ్లారు. ట్రాక్టర్లు, బైక్‌లు తదితర వాహనాలలో పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రదర్శనలు జరిపారు.

ట్రేడ్ యూనియన్లు, ఎస్‌కేఎం ఆధ్వర్యంలో 2025 జులైన 9న సార్వత్రిక సమ్మె విజయవంతంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో జరిగింది. కేంద్రంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న జాతి వ్యతిరేక విధానాలు, కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా రూపొందించిన విధానాలను నిరసిస్తూ సమ్మె చేశారు. సంయుక్తంగా పోరాటాలు నిర్వహించాలని నిర్ణయించారు. జాతీయ సార్వభౌమాధికారానికి తీవ్ర ముప్పుకలుగుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50శాతం సుంకాలు విధించినప్పటికీ, తగిన ప్రతిఘటన చర్యలను తీసుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. రష్యా నుంచి ముడిచమురును చౌకగా దిగుమతి చేసుకోవడంపై జరిమానా విధిస్తామని ట్రంప్ ప్రకటించడంపై కేంద్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా మౌనంగా ఉండి అవమానాల పాలవుతోంది. ట్రంప్ బెదిరింపులను ట్రేడ్ యూనియన్లు, ఎస్‌కెఎం తీవ్రంగా ఖండించాయి. ట్రంప్ తీసుకున్న నిర్ణయాలతో బరితెగించి ఆర్థిక వత్తిడికి పాల్పడుతూ, ఇండియాను ట్రేడ్‌యూనియన్లను ఆదేశించడం ట్రంప్‌ను నియంతగా పరిగణించాలి. ఈ దుందుడుకు వంచనను తిరస్కరించాలి.

అయినప్పటికీ పశ్చిమ రాజ్యాలు సామ్రాజ్యవాద ప్రయోజనాలకు లొంగి ఉండటం ఎంత మాత్రం సహించరాదు. భారత్- బ్రిటన్ ప్రభుత్వాల మధ్య ఆర్థిక, వాణిజ్య ఒప్పందాన్ని (ఓఈటీఏ)కుదుర్చుకుని మన రైతుల, కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీశారు. ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కోల్పోయారు. విదేశీ లాభాలను, కార్పొరేట్ల లాభాలను కట్టబెడుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం రైతులు, కార్మికులను బెదిరిస్తూ డిమాండ్లను తిరస్కరిస్తోంది. మరో వైపు అమెరికాకు అనుకూలంగా ఉంటూ వ్యూహాత్మకంగా నిశ్శబ్దంగా ఉంటూ రాజీపడుతోంది. అంతేకాదు, ఇండియా మార్కెట్లను అమెరికా చౌకగా పాలు, పాల ఉత్పత్తులను, గోదుమలు, మాంసం తదితరాలను మన మార్కెట్లను నింపేసి మన పాల ఉత్పత్తిదారులను, గోదుమ పండించే రైతులను, మాంసం విక్రయించే వారిని తీవ్ర కష్టాలపాలు చేస్తోంది. ఇండియా-ఆసియా స్వేచ్ఛా వాణిజ్యం కారణంగా కేరళలో రబ్బరు ధరలు 70శాతం పడిపోయాయి. ఇండియా ఆరోగ్యవ్యవస్థను, ప్రైవేటు రంగాన్ని బ్రిటన్ ప్రైవేటు కార్పొరేట్లకు అప్పగించడం వల్ల ఆస్పత్రుల ప్రైవేటీకరణ వేగవంతమవుతోంది. ఔషధాల గుత్త పెట్టుబడిదారులను పెంచుతారు. ఇప్పటికే నిరుద్యోగుల సంఖ్య అపారంగా పెరిగిపోతోంది. ఔషధాల ధరలు ఆకాశాన్ని అందుతున్నాయి. జులై 9వ తేదీన కార్మికులు, రైతులు, ఉద్యోగులు, దేశవ్యాప్తంగా సమ్మెను దిగ్విజయం చేసినప్పటికీ కార్మికవర్గం, రైతులు వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడకుండా, కార్మిక వర్గం 44 చట్టాలను

> ప్రజలకు గల చట్టబద్ధమైన హక్కులను ఉల్లంఘించి విధ్వంసకర విధానాలను కేంద్రం అనుసరిస్తోంది. నీరు, అడవులు, భూములపై ప్రజలకు గల హక్కులను తిరస్కరించి కార్పొరేట్ల దురాశలను తీరుస్తోంది. అభివృద్ధిపేరుతో రైతుల భూములను ప్రభుత్వం బలవంతంగా లాక్కుంటున్నది. వాతావరణాన్ని నాశనం చేస్తోంది.

రద్దుచేసి నాలుగు కోడ్‌లను ప్రభుత్వం ఆమోదించి కార్పొరేట్ల అనుకూల విధానాలను అమలు చేసేందుకు సిద్ధమైంది. రైతుల పంటలకు ఎంఎస్‌పి-సి2+50శాతం చట్టబద్ధమైన ధరలు ఆమోదించకుండా కేంద్ర ప్రభుత్వం తిరస్కరిస్తోంది. ప్రజలకు గల చట్టబద్ధమైన హక్కులను ఉల్లంఘించి విధ్వంసకర విధానాలను కేంద్రం అనుసరిస్తోంది. నీరు, అడవులు, భూములపై ప్రజలకు గల హక్కులను తిరస్కరించి కార్పొరేట్ల దురాశలను తీరుస్తోంది. అభివృద్ధిపేరుతో రైతుల భూములను ప్రభుత్వం బలవంతంగా లాక్కుంటున్నది. వాతావరణాన్ని నాశనం చేస్తోంది. ప్రభుత్వం సంస్థలను ప్రైవేటు సంపన్నులకు కారుచౌకగా విక్రయిస్తోంది. దేశప్రయోజనాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం కార్పొరేట్లకు వివిధ సేవలను అందిస్తోంది.

ఈ నేపథ్యంలో కేంద్ర ట్రేడ్ యూనియన్లు, కిసాన్ మోర్చాలు కలిసి ఈ నెల 13న దేశవ్యాప్తంగా సమ్మెను విజయవంతం చేశాయి. వివిధ ప్రజాసంఘాలు ట్రాక్టర్లు, మోటార్‌సైకిళ్లు తదితర వాహనాలతో దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో ర్యాలీలునిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ప్రదర్శనలు, ధర్నాలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో రైతులు, కార్మికులు, యువకులు , విద్యార్థులు, మహిళా ప్రజాసంఘాలు పాల్గొని సమ్మెను విజయవంతం చేశారు. దేశ స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమాధికారాన్ని, పరిరక్షించాలని ప్రజా సమూహాలు ప్రదర్శనల్లో పాల్గొని వివిధ డిమాండ్లను నినదించారు. ఇండియా, యూకే కుదుర్చుకున్న ఒప్పందాలు మన రైతులకు, కార్మికులకు ఇతర శ్రామికులకు తీవ్ర నష్టాలుకలిగిస్తాయి. అందువల్ల ఈ ఒప్పందాలను తిరస్కరించాలని డిమాండ్‌చేశారు. అలాగే ట్రంప్ సుంకాలు పెంచడం వివిధ అంశాలపైన బెదిరించడాన్ని ఇండియా తిరస్కరించాలి. కార్పొరేట్ల లూటీలను నిరోధించేందుకు అమెరికా-ఇండియా ట్రేడ్ ఒప్పందంకోసం జరిపే చర్చలను తక్షణం నిలిపివేయాలి. భవిష్యత్తులో ఏ ఒప్పందాలు కుదుర్చుకున్నా పార్లమెంటులో చర్చించాలని డిమాండ్ చేశారు. ఈస్ట్ ఇండియా కంపెనీ దేశాన్ని వలసవాద రాజ్యంగా మార్చివేసింది.

కొలిక్కిరాని ట్రంప్, పుతిన్ భేటీ

బుడ్డిగ జమిందార్

ఆగస్టు 15 నాడు మూడు గంటలకు పైగా అలస్కాలో జరిగిన ట్రంప్- పుతిన్ భేటీలో ఉక్రెయిన్‌లో యుద్ధ విరమణ లేక కాల్పుల విరమణకై నిర్దిష్టమైన ఒప్పందానికి రాలేకపోయారు. ఒకవైపు ఏ విధమైన ఒప్పందం జరగలేదని ట్రంప్ తెలియచేయగా మరొకవైపు దీర్ఘకాలిక శాంతి ఒప్పందాలు జరగాలంటే యుద్ధ మూలాలపై చర్చ జరిగి సమస్యలను తొలగించాలని పుతిన్ అభిప్రాయపడ్డారు. కానీ ఇద్దరు నాయకులు కూడా చర్చలపై అనుకూల అభిప్రాయాలనే వ్యక్తపరిచారు. భేటీ అనంతరం జరిగిన ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ సమీప భవిష్యత్తులో రష్యా అధ్యక్షుడు పుతిన్-ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సమావేశమయ్యే అవకాశాలున్నాయని, అప్పుడు కాల్పుల విరమణ, యుద్ధం ఆపే ప్రయత్నాలు జరుగుతాయని అన్నారు. 'నేటి చర్చలు ఉక్రెయిన్ సమస్యను పరిష్కరించటానికి మాత్రమే కాకుండా, రష్యా-అమెరికా మధ్య వర్తక వాణిజ్యాలు వంటి ఆచరణాత్మక సంబంధాల పునరుద్ధరణకు కూడా ఒక సూచన బిందువుగా మారుతాయని మేము ఆశిస్తున్నామని' పుతిన్ అన్నారు.

అమెరికా అధ్యక్షునిగా ఎన్నికైన మరుసటి రోజునే ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ఆపుతామని గట్టిగా వక్కాణించిన ట్రంప్ 8 నెలలు కావస్తున్నా యుద్ధం తీవ్రతరం అవుతుంది గానీ ఎక్కడా కాల్పుల విరమణ అనేది కనబడలేదు. రష్యా సేనలు కీవ్ దిశగా ఉక్రెయిన్ తూర్పు భూభాగాన్ని వశపర్చుకొంటూ ముందుకు కొనసాగుతున్నాయి. ఉక్రెయిన్ మరణాలను గురించి నిజమైన చర్చను అమెరికా-యూరోపియన్ దేశాలు బహిర్గతం చేయటంలేదు. ఒకప్పుడు జెలెన్‌స్కీ ఒక ప్రకటనలో 31 వేల మంది ఉక్రెయిన్‌లో మరణించారని అబద్ధపు ప్రకటన చేశారు, వాస్తవానికి మరణాలు భయంకర సంఖ్యలో ఉంటాయి. మాక్‌గ్రేగర్ వంటి వాషింగ్టన్ విశ్లేషకులు 18 లక్షల వరకూ మరణించి ఉంటారని అంచనా వేసినప్పటికీ, ప్రస్తుత యుద్ధంలో ఉక్రెయిన్‌లో పోరాట సామర్థ్య వయసు గల

సైనికుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. రష్యా ఇప్పటికే ఉక్రెయిన్‌లో రష్యన్ మాట్లాడే డొనెట్స్క్, లూహాన్స్క్, జాపోరిజ్జియా ప్రాంతాలను స్వాధీనం చేసుకొంది. ఆర్థికపరంగా, ప్రాణ నష్టంగా కూడా రష్యా చాలా సమస్యలతో ఉంది. రెండు దేశాలు ప్రపంచ శాంతి కోసం యుద్ధాన్ని అనివార్యంగా యుద్ధాన్ని విరమించాలి. కానీ యుద్ధాన్ని విరమణ చేయాలనే యోచన ఐరోపా యూనియన్ దేశాలకు లేనేలేదు. కీలుబొమ్మ జెలెన్‌స్కీ ఈ.యూ. దేశాలకు తోక ఊపుతున్నాడు.

పశ్చిమ ఉక్రెయిన్‌లో అమెరికా- ఈయూ దేశాలకు అనువైన ఉక్రెయిన్ రాజ్యం ఏర్పడాలనేది వీరి మనో భావన. ఉక్రెయిన్‌లో బలమైన ఆర్మీకిగానీ, నాటో సభ్యత్వానికి గానీ రష్యా ససేమిరా అంటుంది. నాటో సభ్యత్వాన్ని వ్యతిరేకించి రష్యా ఉక్రెయిన్‌పై యుద్ధానికి దిగింది. ఇంతవరకూ వచ్చిన తర్వాత నాటో సభ్యత్వాన్ని రష్యా ససేమిరా అంగీకరించదు. ఈ విషయంలో ట్రంప్ కొంత మెతకవైఖరితో ఉన్నప్పటికీ ఐరోపా దేశాలు సంసిద్ధంగా లేవు.

మరొకవైపు ఉక్రెయిన్ ఖనిజ సంపదపై ట్రంప్‌తో పాటుగా ఈయూ దేశాలు కన్నేశాయి. యుద్ధాన్ని కొనసాగించడం ద్వారా రష్యా ఆర్థిక వ్యవస్థను బలహీనపర్చి కుదేలైన తర్వాత రష్యాను విడగొట్టి అక్కడ అపారమైన ఖనిజ సంపదను వశపర్చుకొంటే సంక్షోభంలో ఉన్న యూరపు దేశాల పెట్టుబడీదారుల పరిశ్రమలకు తిరుగు ఉండదని వీరి ఆలోచన.

రష్యన్ దూమా (పార్లమెంటు) డిప్యూటీ లెఫ్టినెంట్ జనరల్ విక్టర్ సోబొరేన్ "ట్రంప్ - పుతిన్ చర్చలు ఎట్టి పరిస్థితుల్లోనూ యుద్ధాన్ని ముగించవని అన్నారు. చెర్నిహివ్, సుమీ, ఖార్కివ్, డ్నిప్రోపెట్రోవ్స్క్, మైకోలోవ్, ఒబ్లాస్ట్‌లను విలీనం చేయవల్సిన ప్రాంతాల జాబితాలో చేర్చాలని పిలుపునిచ్చారు. ఉక్రెయిన్‌పై ఇంకా పెద్ద ఎత్తున దాడి ప్రణాళిక ఉంటే చాలా తీవ్రమైన ఫలితాలు ఉండొచ్చు. అప్పుడు నాటో పశ్చిమ ఉక్రెయిన్‌ను ఆక్రమించినా ఆశ్చర్య పోనవసరం లేదు. అప్పుడు రష్యా నాటో దేశాలతో ప్రత్యక్ష యుద్ధానికి తలపడాల్సి వస్తుంది.

- 9849491969

> విలువైన ఖనిజ సంపదతో, సుందరమైన భూ ఉపరితలంతో, భౌగోళికంగా విశిష్ట ప్రాధాన్యత కల్గిన అలస్కా ప్రాంతాన్ని రష్యన్ చక్రవర్తి అలెగ్జాండర్-2 అమెరికాకు అప్పగించటం ఇప్పటికీ ఒక వివాదాస్పదమైన చర్చనీయాంశమే! రష్యన్ చక్రవర్తి దారాదత్తం చేయటం మిస్టరీగా కొనసాగుతోంది. 158 సంవత్సరాల క్రితం అమెరికా అనధికార దౌత్యవేత్తలు ఎడ్వర్డ్ డే స్టోకెన్, యుఎస్‌స్టేట్ సెక్రటరీ విలియమ్ సేవాల మధ్య జరిగిన ఒప్పందంలో 586,422 చదరపు మైళ్ల భూమిని (9లక్షల 44 వేల చదరపు కి.మీ॥ భారతదేశంలో 3 వ వంతు) 72 లక్షల బంగారు డాలర్లకు లేదా ఎకరాన్ని రెండు సెంట్లకు చొప్పున అమ్మారు. కొందరు రష్యన్ పరిశోధకులు అలస్కాను అమ్మినట్లు, కాదూ...99 సంవత్సరాల కారుచౌకగా లీజుకు ఇచ్చినట్టు కొందరు పరిశోధకులు 'రష్యన్ ట్రెజరీ' లోకి ఆ ధనం ఎప్పుడూ చేరలేదని, ఓరనే అను నౌకలో రవాణా చేసిన ఆ బంగారం తీసుకొస్తున్న నౌక బాల్టిక్ సముద్రంలో మునిగినట్లు చెబుతుంటారు. అబ్రహాంలింకన్‌కు రష్యా మిలిటరీపరంగా సహాయం చేసింది. బ్రిటీష్ ఉత్తర వ్యూహాత్మక ఎత్తుగడలకు వ్యతిరేకంగా రష్యన్ చక్రవర్తి అలెగ్జాండర్-2, అబ్రహాంలింకన్‌కు చేసిన సహాయంతో, ఉత్తర అమెరికా వ్యూహాత్మక ఎత్తుగడలకు వ్యతిరేకంగా బ్రిటీష్ సామ్రాజ్యంపై సాధించిన విజయానికి చిహ్నం. గ్రేట్ బ్రిటన్ బోస్టన్, న్యూయార్క్‌లపై బాంబుల వర్షం కురిపించి మంటల్లో ఉంచాల్సిన సమయంలో ఫ్రెంచ్, బ్రిటన్ ప్రణాళికలను తిప్పి కొడుతూ అమెరికాకు రష్యా నౌకాదళాల సహాయాన్ని అందించింది అని అమెరికా చరిత్ర పరిశోధకుడు టారే అన్నారు.
>
> 1. 1853-56 మధ్య సాగిన క్రిమియా యుద్ధంలో రష్యన్ చక్రవర్తి ఆర్థికంగా అలిసిపోవటంతో రష్యన్ వలస ప్రాంతమైన అలస్కాను ఆర్థికంగా ఆదుకోలేకపోయారని 2. ఎప్పటికైనా అలస్కాను బ్రిటీష్ సామ్రాజ్యం స్వాధీనం చేసుకొంటుంది అనే అభిప్రాయం ఉండటం. 3. అమెరికన్లే అలస్కాలోకి చొచ్చుకొచ్చి నష్టపరిహారం లేకుండా స్వాధీనపర్చుకొంటారని అలస్కాను అమ్మారని అంటుంటారు.
>
> కానీ అమెరికన్ అంతర్యుద్ధంలో బ్రిటీష్ శక్తులకు వ్యతిరేకంగా రష్యన్ నౌకలు పోరాటం వెనుక ఆసియా- పసిఫిక్- అట్లాంటిక్ ప్రాంతాల్లో రష్యా బలమైన నౌకాశక్తి సామర్థ్యాలు కల్గి ఉందని తెలియజేస్తుంది. అప్పట్లో అమెరికా అలస్కాను స్వాధీనం చేసుకొని ఉండేది కాదని, రెండు దేశాల మధ్య సత్సంబంధాలు ఉండేవని, క్రిమియన్ యుద్ధం కారణంగా అలస్కాను అమ్మలేదని "అలస్కా మోసగించబడి అమ్మివేయబడింది" అని పుస్తకంలో ఇవాన్ మికోనొవ్ చక్కగా విశ్లేషించారు.
>
> (రష్యన్ న్యూస్ పత్రిక స్పుత్నిక్ నుంచి సేకరణ)

కంపెనీలకు మరిన్ని ప్రోత్సాహకాలు: నితీశ్

పట్నా: ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీహార్ రాజకీయాలు వాడివేడిగా మారాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రధాన పార్టీల నేతలు పోటీ పడుతున్నారు. తాజాగా ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కీలక ప్రకటన చేశారు. రాష్ట్ర యువత కోసం కోటి ఉద్యోగ అవకాశాలతోపాటు పారిశ్రామిక వృద్ధిని ప్రోత్సహించే పథకాలు ప్రకటించారు. 2020లో మొదలైన సాత్ నిశ్చయ్-2 కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే 50 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించామని సీఎం నితీశ్ చెప్పుకొచ్చారు. వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇవి కేవలం మాటలు మాత్రమే కాదని, పని చేసి చూపించడానికి తీసుకున్న నిర్ణయమని నితీశ్ కుమార్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. దీంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా కంపెనీలు పెట్టే వారికి అనేక ప్రోత్సాహక పథకాలను ప్రకటించారు.

వరద బాధితులకు ఒమర్ అబ్దుల్లా పరామర్శ

శ్రీనగర్: జమ్మూకశ్మీరులోని కిష్టార్ జిల్లా చషోటి గ్రామాన్ని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా శనివారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించారు. వరద బాధితులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇదిలా ఉండగా, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. విపత్తులో మృతిచెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.రెండు లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేలు అందించనున్నట్లు తెలిపింది. పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.లక్ష, తీవ్రంగా దెబ్బతిన్న నిర్మాణాలకు రూ.50 వేలు, పాక్షికంగా దెబ్బతిన్నవాటికి రూ.25 వేలు చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కాగా, రెండు రోజుల క్రితం కురిసిన కుండపోత వర్షానికి వరదలు ముంచెత్తగా పెద్ద సంఖ్యలో పౌరులు మరణించారు. 100 మందికిపైగా గాయపడ్డారు. చషోటీ గ్రామంలో వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

ఫాస్టాగ్ వార్షిక పాస్...
తొలిరోజు 1.4 లక్షల మంది కొనుగోలు

న్యూఢిల్లీ: తరచూ హైవేపై ప్రయాణించే వారికి మరింత సులభతరమైన, చౌక ప్రయాణాన్ని కల్పించేందుకు కొత్తగా ఫాస్టాగ్ వార్షిక పాసును నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) అందుబాటులోకి తెచ్చింది. ప్రైవేట్ కార్లు, జీపులు, వ్యాన్ల కోసం ప్రవేశపెట్టిన రూ.3,000 వార్షిక హైవే టోల్ పాసు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలలోని సుమారు 1,150 టోల్ ప్లాజాల్లో ఫాస్టాగ్ వార్షిక పాస్ సౌకర్యాన్ని ఎన్‌హెచ్‌ఏఐ విజయవంతంగా అమలు చేసింది. తొలి రోజు సాయంత్రం ఏడు గంటల వరకు దాదాపు 1.4 లక్షల మంది వినియోగదారులు వార్షిక పాస్‌ను కొనుగోలు చేసి వినియోగంలోకి తెచ్చినట్టు ఎన్‌హెచ్‌ఏఐ వెల్లడించింది. అదేవిధంగా టోల్ ప్లాజాల్లో దాదాపు 1.39 లక్షల లావాదేవీలు నమోదైనట్లు తెలిపింది. ఈ వార్షిక పాస్ తీసుకున్న వినియోగదారులు ఎస్ఎమ్ఎస్ ద్వారా జీరో టోల్ మెసేజ్ అందుకుంటున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ వివరించింది. కాగా, స్వాతంత్ర్య దినోత్సవం నుంచి దేశంలో ఫాస్టాగ్ టోల్ చెల్లింపు విధానంలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి.

నేడు బీజేపీ పార్లమెంటరీ బోర్డు భేటీ

న్యూఢిల్లీ: బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశం ఆదివారం న్యూఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరగబోతోంది. ఈ సమావేశంలో ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిపై చర్చ జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఇతర పార్లమెంటరీ బోర్డు సభ్యులు సమావేశంలో పాల్గొంటారు. ఆగస్టు 6న జరిగిన పాలక ఎన్డీయే నాయకులు ఏకగ్రీవంగా ఒక తీర్మానాన్ని ఆమోదించారు. సెప్టెంబర్ 9న జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికలకు ఎన్డీఏ అభ్యర్థిని ఖరారు చేయడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు పూర్తి అధికారం ఇస్తూ తీర్మానాన్ని ఆమోదించారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ జులై 21న ఆరోగ్య కారణాలు చూపుతూ తన పదవికి రాజీనామా చేశారు. ఉపరాష్ట్రపతి తన అధికారిక ఎక్స్ ఖాతాలో చేసిన పోస్ట్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాజీనామా లేఖ సమర్పించారు. దీంతో ఉపరాష్ట్రపతి ఎన్నిక షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించింది. ఒకవేళ ఎన్నికకు పోటీ జరిగితే... సెప్టెంబర్ 9న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల మధ్య పార్లమెంట్ హౌస్ మొదటి అంతస్తులో పోలింగ్ జరుగుతుంది.

గుడ్, సింపుల్ ట్యాక్స్ అవశ్యం

- సరళీకృత విధానం కోసం సమగ్ర చర్చ
- జీఎస్టీ సంస్కరణలపై అధికార పత్రం: కాంగ్రెస్

న్యూఢిల్లీ: జీఎస్టీ 2.0పై అధికార పత్రాల కోసం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. దీనిపై సమగ్ర, విస్తృత చర్చలు జరగడం అవసరమని పేర్కొంది. జీఎస్టీ అంటే వృద్ధిని నిరోధించే పన్ను కాకుండా 'గుడ్ అండ్ సింపుల్ ట్యాక్స్' (సరళీకృత మంచి పన్ను) కావాలని సూచించింది. కొత్త సంస్కరణలు ప్రజలకు ప్రయోజనం చేకూర్చగలగాలని శనివారం ఒక ప్రకటన చేసింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దీపావళి నాటికి కొత్త సంస్కరణలతో జీఎస్టీ సరికొత్తగా ప్రజల ముందుకు రాబోతోందని ప్రధాని మోదీ ప్రకటించారు. జీఎస్టీ భారం తగ్గబోతోందని చెప్పారు. దీంతో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందిస్తూ జీఎస్టీ ఇకపై గుడ్ & సింపుల్ ట్యాక్స్‌గా ఉండాలన్నారు. జీఎస్టీని ప్రతిపక్షం గబ్బర్ సింగ్ ట్యాక్స్‌గా వ్యవహరించడం తెలిసిందే. 'ఎట్టకేలకు ప్రధాని మోదీ మేల్కొన్నారు. జీఎస్టీని సంస్కరిస్తే తప్ప ఆర్థిక వృద్ధి జరగదని, ప్రైవేటు వినియోగం, పెట్టుబడులు పెరగాలని గ్రహించారు. జీఎస్టీ 2.0పై అధికారిక పత్రాన్ని త్వరగా అందజేస్తే, సమగ్ర-విస్తృత స్థాయి చర్చ జరపవచ్చు' అని అన్నారు. గత లోక్‌సభ ఎన్నికలప్పుడు జీఎస్టీ ప్రధాన ప్రచారంశంగా ఉందని జైరాం రమేశ్ గుర్తుచేశారు. గత ఏడేళ్లలో అనేక మినహాయింపులు ఇవ్వడం, రేట్లు పెంచడం వల్ల జీఎస్టీ స్ఫూర్తికి విఘాతం కలిగిందని అన్నారు. పన్నులను సరళీకరించాలని, రాష్ట్రాలకు ఆదాయ అనిశ్చితి లేకుండా, వర్గీకృత విభేదాలు రాకుండా చూడాలని డిమాండ్ చేశారు. జీఎస్టీ పరిహారం సెస్ కాలాన్ని పొడిగించాలని కోరారు. 2026, మార్చి 31తో పరిహారం సెస్ గడువు ముగియనుంది. అలాగే, ఎంఎస్ఎంఈలు, టెక్స్‌టైల్స్, పర్యాటకం, ఎగుమతులు, హస్తకళలు, వ్యవసాయ రంగానికి సంబంధిత సంస్థాగత సంస్యల పరిష్కారంపై అర్థవంతంగా చర్చించి, పరిష్కరించాలని కేంద్రాన్ని సూచన చేశారు. విద్యుత్, మద్యం, పెట్రోలియం, రియల్ ఎస్టేట్ రంగాలను ప్రోత్సహించేలా రాష్ట్ర స్థాయిలో జీఎస్టీని తెచ్చేందుకు రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని కూడా కేంద్రాన్ని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు.

మోదీ అబద్ధాల కోరు: జైరాం రమేశ్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, సమాచార విభాగం అధినేత జైరామ్ రమేశ్ ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్వాతంత్ర్య వేడుకల్లో మోదీ మాట్లాడుతూ ఇండియా సెమీ కండక్టర్ చరిత్ర గురించి తప్పుడు ఆరోపణలు చేశారని ఎక్స్ వేదికగా జైరాం రమేశ్ విమర్శించారు. మోదీ అబద్ధాల కోరు అని వ్యాఖ్యానించారు. 'ప్రధాని మోదీ అబద్ధాల కోరు అని చెప్పడానికి ఇది మరో ఉదాహరణ. సెమీ కండక్టర్ కాంప్లెక్స్ లిమిటెడ్ చండీగఢ్‌లో ఏర్పాటైంది. 1983లో ఆపరేషన్స్ మొదలయ్యాయి' అని ఆయన తెలిపారు. ఆ పోస్టులో మోదీ ప్రసంగానికి సంబంధించిన వీడియోను కూడా జోడించారు. ఆ వీడియోలో నరేంద్ర మోదీ సెమీ కండక్టర్ల గురించి మాట్లాడారు. 'నేను టెక్నాలజీకి సంబంధించిన పలు విషయాల గురించి మాట్లాడినపుడు... సెమీ కండక్టర్ల గురించిన ఉదాహరణను మీ దృష్టికి తీసుకువస్తాను. నేను ఎర్రకోట దగ్గర ఏ ప్రభుత్వాన్ని విమర్శించడానికి లేను. విమర్శించాలని అనుకోవటం కూడా లేదు. కానీ, దేశంలోని యువత దీని గురించి తప్పకుండా తెలుసుకోవాలి. 50 నుంచి 60 ఏళ్ల క్రితం సెమీ కండక్టర్లకు సంబంధించిన ఫైల్ వర్క్ మొదలైంది. సెమీ కండక్టర్ ఫ్యాక్టరీ ఆలోచన 60 ఏళ్ల క్రితం తెరపైకి వచ్చింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... సెమీ కండక్టర్ల ఆలోచన అప్పుడే చచ్చిపోయింది. 50-60 ఏళ్లు మనం నష్టపోయాము' అని మోదీ అన్నారు.

దేశ విభజనపై ఎన్‌సీఈఆర్‌టీ పాఠం

కాంగ్రెస్ ఆగ్రహం

న్యూఢిల్లీ: దేశ విభజన సమయంలోని భయానక పరిస్థితులను వివరిస్తూ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) విద్యార్థుల కోసం ఓ ప్రత్యేక మాడ్యూల్‌ను విడుదల చేసింది. ఇందులో 1947లో జరిగిన దేశ విభజనకు ఒక వ్యక్తి మాత్రమే కారణం కాదని, ఇందులో ముగ్గురి పాత్ర ఉందని పేర్కొంది. విభజనకు పట్టుబట్టిన ముస్లిం లీగ్ అగ్రనేత మహమ్మద్ అలీజిన్నా, దానికి అంగీకరించిన కాంగ్రెస్, అమలు చేసిన లార్డ్ లూయిస్ మౌంట్ బాటన్ అని తెలిపింది. ఈ విభజన వల్లే భారత్‌కు కశ్మీర్ సమస్యగా మారిందని, నాటి నుంచి కశ్మీర్‌ను పాక్ మార్గంగా చేసుకొని దేశంపై ఒత్తిళ్లు తీసుకురావడానికి ఉపయోగించుకుంటోందని ఆరోపించింది. 1947లో జరిగిన భారత్, పాకిస్థాన్ విభజన సమయంలో ప్రజల బాధ, బాధితుల వేదనలను గుర్తు చేసుకుంటూ ఏటా ఆగస్టు 14న కేంద్ర ప్రభుత్వం నిర్వహించే 'విభజన గాయాల స్మారక దినం' గురించి ప్రస్తావించారు. అయితే చరిత్రలో జరిగిన అసలు విషయాలు తెలియజేయకుండా వక్రీకరించారని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా ఆరోపించారు. దేశంలోని లౌకికవాదాన్ని నిర్మూలించాలని చూస్తున్న ఆర్ఎస్ఎస్ ఈ దేశానికి చాలా ప్రమాదకరమని అన్నారు. కాగా గతేడాది తొమ్మిది నుంచి 12వ తరగతులకు సంబంధించిన సిలబస్‌లో అనేక అంశాలను ఎన్‌సీఈఆర్‌టీ తొలగించిన విషయం తెలిసిందే. ఈ చర్యలను అప్పట్లో కాంగ్రెస్ వ్యతిరేకించింది. విద్యార్థులకు అసలైన చరిత్ర గురించి చెప్పకుండా... సిలబస్‌ను కాషాయీకరణ చేస్తున్నారంటూ ఆరోపించింది.

నాగాలాండ్ గవర్నర్ గణేశన్ మృతి

చెన్నై: నాగాలాండ్ గవర్నర్ లా గణేశన్ (80) చెన్నయ్ లోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో శుక్రవారం రాత్రి కన్నుమూశారు. ఈ నెల ఎనిమిదో తేదీన చెన్నైలోని తన నివాసంలో కుప్పకూలిన గణేశన్‌కు తలలో తీవ్ర గాయమవ్వడంతో ఆసుపత్రిలో చేర్పించారు. ఐసీయూలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచినట్లు రాజ్‌భవన్ అధికారులు ప్రకటించారు. గణేశన్ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తదితర ప్రముఖుల సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. 1945 ఫిబ్రవరి 16న తంజావూరులో జన్మించిన గణేశన్... చిన్న వయసులోనే ఆర్ఎస్ఎస్ భావజాలం పట్ల ఆకర్షితులయ్యారు. ఆయన తండ్రి, సోదరులకు కూడా ఆర్ఎస్ఎస్‌తో సంబంధాలున్నాయి. 20 ఏళ్ల పాటు మదురై తదితర ప్రాంతాల్లో ఆర్ఎస్ఎస్‌లో పనిచేశారు. 1991లో బీజేపీలో చేరి తమిళనాడు శాఖ సంస్థాగత కార్యదర్శిగా నియమితులయ్యారు. జాతీయ స్థాయిలో వివిధ హోదాల్లో పనిచేశారు. 2006-09 మధ్య కాలంలో తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగానూ పనిచేశారు. 2016లో మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2021 ఆగస్టులో మణిపూర్ గవర్నర్‌గా నియమితులైన ఆయన... 2023 ఫిబ్రవరి 19వరకు కొనసాగారు. 2022లో పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గానూ అదనపు బాధ్యతలు నిర్వహించారు. అనంతరం 2023 ఫిబ్రవరి నుంచి నాగాలాండ్ గవర్నర్‌గా ఉన్నారు.

ప్రజలు మేల్కొన్నారు

ఓట్ల చోరీపై కాంగ్రెస్ కొత్త వీడియో
'లాపతా ఓట్' విడుదల చేసిన రాహుల్

న్యూఢిల్లీ: ఓటు హక్కు దోచుకోనివొద్దు అంటూ దేశ ప్రజలకు కాంగ్రెస్ పిలుపునిచ్చింది. ఓట్ల చోరీపై ప్రచారాన్ని జోరుగా సాగిస్తోంది. వినూత్న రీతిలో ఒకదాని ఒకటిగా నిమిషం నిడివిగల వీడియోలతో ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రయత్నిస్తోంది. ఇటీవల నకిలీ ఓట్ల వీడియో విడుదల చేసిన కాంగ్రెస్ ఇప్పుడు ఓట్ల దొంగతనంపై కొత్త వీడియో తీసుకు వచ్చింది. ఓట్ల దొంగతనంపై తమ వాదనకు మరింత బలం చేకూర్చేలా ఈ వీడియోను 'లాపాతా ఓట్' (ఓటు గల్లంతు) శీర్షికతో లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తన ఎక్స్ ఖాతా ద్వారా శనివారం విడుదల చేశారు. 'చోరీ చోరీ చుప్‌కే చుప్‌కే (దొంగచాట ఆగడాలు) ఇక సాగవు... ప్రజలు మేల్కొన్నారు' అని పోస్టు పెట్టారు. ఓట్ల దొంగతానికి వ్యతిరేకంగా, మన హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా గళం వినిపిద్దా మంటూ రాహుల్ పిలుపునిచ్చారు. కొత్త వీడియోలో ఓ వ్యక్తి పోలీసు స్టేషన్‌కు వెళ్లి తన ఓటు చోరీ అయినట్లు మొరపెట్టుకుంటాడు. లక్షల ఓట్లు గల్లంతయ్యాయని అధికారులతో చెబుతాడు. దీంతో పోలీసులు కూడా తమ ఓటు కూడా దొంగలించబడిందా అన్నట్లు ఆలోచనలో పడతారు. ఓటు చోరీ వ్యవహారాన్ని చావో-రేవో అన్నట్లు కాంగ్రెస్ భావిస్తోంది. వివిధ రూపాల్లో నిరసన తెలుపుతోంది. ఇప్పటికే వెబ్ పోర్టల్ ప్రారంభించింది. ఓట్ల దొంగతనంపై ఎన్నికల సంఘం జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసేందుకు, డిజిటల్ ఓటర్ల జాబితాల డిమాండ్‌కు మద్దతు ఇచ్చేందుకు నమోదు చేసుకోమని ప్రజలను కోరింది.

జీఎస్టీ మార్పుతో తగ్గనున్న ధరలు

న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానంలో కీలక సవరణలకు కేంద్రం సిద్ధమైంది. సామాన్యులు, చిరువ్యాపారులపై భారం తగ్గించేలా జీఎస్టీలో రెండు శ్లాబ్‌ల (5, 18 శాతం) విధానాన్ని ప్రతిపాదించింది. 12, 28 శాతం శ్లాబ్‌లకు స్వస్తి పలకనుంది. దీపావళి కానుకగా ఈ కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. దీంతో అనేక వస్తువుల ధరలు దిగి వచ్చే అవకాశం ఉంది. సవరించిన విధానాన్ని జీఎస్టీ మండలి ఆమోదిస్తే... ప్రస్తుతం 12 శాతం శ్లాబ్‌లో ఉన్న 99 శాతం వస్తువులు... 5 శాతం పన్ను శ్రేణిలోకి వెళ్లనున్నాయి. అదేవిధంగా ప్రస్తుతం 28 శాతం పన్ను శ్లాబులో ఉన్న వస్తు సేవల్లో 90 శాతం... 18 శాతం పన్ను రేటుకు మారనున్నాయి. ఈ కొత్త విధానంతో జౌళి, ఎరువులు, పునరుత్పాదక విద్యుత్తు, ఆటోమోటివ్, హస్తకళలు, వ్యవసాయం, వైద్యం, బీమా రంగాలకు లాభం చేకూరనుంది. జీఎస్టీ సవరణలతో ధరలు తగ్గే అవకాశం ఉన్న వస్తువులను పరిశీలిస్తే... టూత్ పేస్ట్, టూత్ పౌడర్, హెయిర్ ఆయిల్, సబ్బులు, గొడుగులు, కుట్టు మెషీన్లు, ప్రాసెస్డ్ ఫుడ్, కండెన్స్‌డ్ మిల్క్, శీతలీకరించిన కూరగాయల వంటి ప్యాకేజ్డ్ ఫుడ్స్ ధరలు తగ్గుతాయి. ప్రెజర్ కుక్కర్లు, వాటర్ ఫిల్టర్లు, ప్యూరిఫయర్లు (నాన్ ఎలక్ట్రానిక్), ఎలక్ట్రానిక్ ఐరన్స్, కంప్యూటర్లు, గీజర్లు, వాక్యూమ్ క్లీనర్లు (నాన్ కమర్షియల్), రెడిమేడ్ దుస్తులు, రూ.500-1000లోపు ఉన్న పాదరక్షలు, చాలా రకాల వ్యాక్సిన్లు, హెచ్ఐవీ, హెపటైటిస్, టీబీ డయాగ్నోస్టిక్ కిట్లు వంటి కొన్ని రకాల ఆయుర్వేద ఔషధాల ధరలు తగ్గవచ్చు. ఇక జామెట్రీ బాక్సులు, మ్యాప్‌లు, గ్లోబ్‌లు, సోలార్ వాటర్ హీటర్లు, అల్యూమినియం, స్టీల్‌తో తయారుచేసిన వంటపాత్రలు, ఇతర సామగ్రి, నాన్ కిరోసిన్ స్టవ్‌లు, సైకిళ్లు, ప్రజా రవాణా వాహనాలు, వ్యవసాయ పరికరాలు, వెండింగ్ మెషీన్ల ధరలు కూడా తగ్గే అవకాశం ఉంది. వీటితో పాటు గ్లేజ్డ్ టైల్స్ (లగ్జరీ కాని వేరియంట్లు), లిక్విడ్ సోప్స్, సిమెంట్, రెడీ మిక్స్ కాంక్రీట్ ఏసీ, టీవీ, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, డిష్‌వాషర్లు, కార్లు, మోటార్‌సైకిల్ సీట్లు, సైకిళ్లు, వ్యవసాయ వాహనాలకు వాడే రబ్బర్ టైర్లు, ప్లాస్టర్, ప్రొటీన్ సప్లిమెంట్లు, సుగర్ సిరప్‌లు, అరోమా కాఫీ, కాఫీ ఉత్పత్తుల ధరలు తగ్గుతాయి. ప్రస్తుతం బీమాపై 18 శాతం జీఎస్టీ ఉండగా... దాన్ని 5 శాతానికి తగ్గించే అవకాశాలున్నాయి. అవసరమైతే సున్నాకు కూడా తీసుకురానున్నట్లు తెలుస్తోంది. సేవల రంగంపై 18 శాతం జీఎస్టీ విధించే అవకాశం ఉంది.

పద్మశ్రీ బులా చౌదరి స్వర్ణపతకాల అపహరణ

కోల్‌కతా: పద్మశ్రీ అవార్డు గ్రహీత, స్విమ్మింగ్ క్వీన్ బులా చౌదరి ఇంట్లో దొంగలు పడ్డారు. ఆమె ప్రతిభకు గుర్తింపుగా వచ్చిన పలు ప్రతిష్ఠాత్మక పతకాలు, మెమెంటోలు ఎత్తుకెళ్లారు. పశ్చిమబెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని ఆమె పూర్వీకుల ఇంట్లో ఈ చోరీ జరగడంతో తాను జీవితంలో సంపాదించుకున్న సర్వం కోల్పోయానంటూ బులా చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. 'దొంగలు నేను జీవితాంతం కష్టపడి, ఎంతో అంకితభావంతో సాధించిన అన్నింటినీ దోచుకుపోయారు. శాఫ్ గేమ్స్‌లో గెలుచుకున్న ఆరు బంగారు పతకాలు సహా అన్ని మెడల్స్, పద్మశ్రీ పతకం కూడా ఎత్తుకెళ్లారు' అని చౌదరి తెలిపారు. తనకు వచ్చిన మెమెంటోలు కూడా దోచుకున్నారని, అయితే అర్జున్ అవార్డు, టెన్జింగ్ నార్గే అవార్డును దొంగలు వదిలేశారని చెప్పారు. బహుశా సైజులో చిన్నవిగా ఉండటంతో అర్జున్ అవార్డును, టెన్జింగ్ నార్గే అవార్డును దొంగలు గుర్తించినట్టు లేదని అన్నారు. హిండర్ మోటార్ రెసిడెన్స్‌లో చోరీ జరగడం ఇది మూడోసారని ఆమె చెప్పారు. హిండర్ మోటార్ రెసిడెన్స్ తాళం వేసి ఉంటుంది. అప్పుడప్పుడు చౌదరి వెళ్లి చూసుకుంటారు. ప్రస్తుతం ఆమె కోల్‌కతాలోని కాస్బా ఏరియాలో కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. ఆమె పూర్వీకుల ఇంటిని అక్కడికి కొద్ది దూరంలో ఉంటున్న ఆమె సోదరుడు మిలన్ చౌదరి వెళ్లి చూసుకుంటూ ఉంటారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హాలిడే కావడంతో మిలన్ తన సోదరి సూచనల మేరకు ఆ ఇంటిని శుభ్రం చేయించేందుకు వెళ్లారు. లోపలకు వెళ్లగానే ఆయన దిగ్భ్రాంతికి గురయ్యారు. 'దొంగలు నా మెడల్స్ ఎందుకు ఎత్తుకెళ్లారు? ఆ మెడల్స్ వల్ల వాళ్లకు ఏమాత్రం డబ్బులు రావు. అవి నా జీవితంలో సాధించిన విలువైన ఖజానా. నా కెరీర్‌లో సాధించిన విజయాలకు గుర్తులు. ఇల్లు ఖాళీగా ఉండటంతో ప్రతిసారి దొంగలు నా ఇంటిని టార్గెట్ చేస్తున్నారు' అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ముంచెత్తిన వర్షం...

కొండచరియలు పడి ఇద్దరి మృతి

ముంబై: మహారాష్ట్రలోని ముంబైని భారీ వర్షం ముంచెత్తింది. ఎడతెరిపి లేకుండా శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి నగరం మొత్తం స్తంభించిపోయింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి.

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ వర్షానికి ముంబైలోని విక్రోలిలో వర్ష నగర్ ప్రాంతంలోని జన్కళ్యాన్ సొసైటీలో శనివారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడ్డాయి. భారీగా మట్టి, రాళ్లు ఓ గుడిసెపై పడ్డాయి. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా... మరో ఇద్దరు గాయపడ్డారు. తెల్లవారుజామున 2.39 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక దళం, పోలీసులు, సహాయక బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. భారీ వర్షానికి సియోన్, కుర్లా, చెంబూర్, అంధేరి సహా నగరం మొత్తం జలమయమైంది. సియోన్‌లోని కొన్ని ప్రాంతాల్లో మోకాలి లోతులో నీరు నిలిచిపోయింది. వెస్ట్రన్ ఎక్స్‌ప్రెస్ హైవేపై వాహనాలు నిలిచిపోయాయి. భారీగా వర్షపు నీరు చేరడంతో అంధేరి సబ్‌వేని అధికారులు మూసివేశారు. విక్రోలిలో 21 గంటల్లో 248.5 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఎయిర్‌పోర్ట్‌లో విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. విమానాలు ఆలస్యం కాగా, మరికొన్నింటిని దారి మళ్లించారు. మరోవైపు భారత వాతావరణ శాఖ ముంబై నగరానికి రెడ్ అలర్ట్ జారీ చేసింది.

బడికి బంగారు బాట!

- 10 వేల పాఠశాలల్లో 10 రకాల సదుపాయాలు
- 6 వేలకుపైగా అదనపు తరగతి గదులు
- రూ.960 కోట్ల అంచనా వ్యయం
- విద్యాలయాల పునరుజ్జీవానికి ప్రజల తోడ్పాటు
- విద్యా వ్యవస్థలో తల్లిదండ్రుల భాగస్వామ్యం
- కీలక సంస్కరణలతో సమూల మార్పు

విశాలాంధ్ర - సచివాలయం: విద్యలో నాణ్యతా ప్రమాణాలు పెంచి విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను సమూలంగా మార్చేందుకు వివిధ కీలక సంస్కరణలు తీసుకొస్తున్నారు. ప్రధానంగా నాణ్యమైన విద్య, ఉపాధ్యాయుల సామర్థ్య అభివృద్ధి, డిజిటల్ టెక్నాలజీ వినియోగం, చిన్నారుల భవిష్యత్ కు అవసరమైన నైపుణ్యాలు అందించడంపై దృష్టి సారించారు. పాఠశాలల పునరుద్ధరణతో పాటు ఉన్నత విద్యా రంగంలోనూ మార్పులు చేపడుతున్నారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్యవరకు సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారు. పాఠశాల గడప దాటి ప్రపంచాన్ని ఆవిష్కరించాలనే విజన్‌తో ముందుకు సాగుతున్నారు. పాఠశాలల పనితీరు, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల అభ్యాస పురోగతి, తల్లిదండ్రులతో సమావేశాలు, ప్రతి స్కూల్ వివరాలను డిజిటల్ డాష్ బోర్డ్‌లో నమోదు చేసి సమీక్షిస్తున్నారు. విద్యను అందరికీ చేరువ చేసి ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్టను పెంపొందించాలని ప్రయత్నం చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో 'మనబడి-మన భవిష్యత్తు' కింద పనులు చేపట్టేందుకు మౌలికసదుపాయాల కల్పన విభాగం చర్యలు చేపట్టింది. 2025-26లో విద్యార్థుల ప్రవేశాల ఆధారంగా అవసరమైన చోట్ల మొదటి ప్రాధా న్యతగా పనులు చేపట్టనుంది. ఇందుకోసం జాబితాను రూపొందించింది. పాఠశాల విద్యలో తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా మౌలికసదుపాయాల అవసరాలు మారాయి. గత ప్రభుత్వంలో మూడు, నాలుగు, ఐదు తరగతులను 3,692 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు మార్చారు. అందుకోసం అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టారు. అయితే, వైసీపీ ప్రభుత్వం సకాలంలో నిధులు ఇవ్వకపోవడంతో ఆ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఇప్పుడు మూడు, నాలుగు, ఐదు తరగతులను చాలా చోట్ల వెనక్కి తీసుకొచ్చారు. దాంతో ఆయా తరగతి గదుల అవసరాలు మారాయి. రాష్ట్ర వ్యాప్తంగా 294 హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ కోసం ఒక్కోచోట మూడు తరగతి గదుల చొప్పున ప్రతిపాదించారు. వీటిల్లో ప్రవేశాలు తక్కువగా ఉండటంతో ప్రతిపాదించిన గదులన్నీ అవసరమయ్యే పరిస్థితి లేదు. దీంతో ఈ విద్యా సంవత్సరంలో ఎన్ని బడులకు తరగతి గదులు అవసరం... కూర్చునేందుకు బెంచీలు, మరుగుదొడ్లు వంటి వసతులు ఎన్నిచోట్ల కావాలనే వివరాలను పాఠశాల విద్య మౌలికసదుపాయాల కల్పన విభాగం సేకరించింది. ఈ విద్యా సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా ఆరు వేలకు పైగా తరగతి గదులు నిర్మించనున్నారు. అసంపూర్తిగా ఉన్న వాటిని పూర్తి చేయడంతో పాటు ఇంకా అవసరమైతే కొత్తగా నిర్మాణాలు చేపడతారు. రాష్ట్రంలో 2,745 బడుల్లో 6,756 అదనపు తరగతి గదులు అవసరం కానున్నట్లు అంచనా వేశారు. దీనికి సుమారు రూ.600 కోట్ల వరకు వ్యయం కానున్నట్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 10 వేల పాఠశాలల్లో మరుగుదొడ్లు, రక్షిత నీరు, ఫ్యాన్లు, బెంచీలు వంటి 10 రకాల మౌలికసదుపాయాలు కల్పించనున్నారు. ఇందుకు రూ.360 కోట్ల వ్యయం కానున్నట్లు అంచనా వేశారు. ఎక్కువగా ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు, కొన్ని ఉన్నత పాఠశాలల్లో అదనపు తరగతి గదుల అవసరం ఉంది. అదేవిధంగా విద్యార్థుల విద్యా పురోగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకమని భావించి, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్-టీచర్ సమావేశాలు తప్పనిసరి చేశారు. తల్లిదండ్రుల మద్దతు లేకుండా విద్యార్థుల అభివృద్ధి సాధ్యం కాదని, అందుకే పీటీఎంలను సజావుగా నిర్వహించి, తల్లిదండ్రులను విద్యా వ్యవస్థలో భాగస్వాములుగా చేయడమే ప్రధాన ఉద్దేశం. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాల ద్వారా పిల్లల సమస్యలను గుర్తించి, పరిష్కరించే దిశగా ప్రభుత్వ ముందుకు సాగుతుంది. 2025, జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన 2.0 కార్యక్రమంలో దాదాపు 2.3 కోట్ల మంది తల్లిదండ్రులు పాల్గొన్నారు. కొత్తతరం విద్యాదిశకు ప్రజల భాగస్వామ్య సంకేతంగా మారనుంది. పాఠశాలల్లో మెగా పేరెంట్ -టీచర్ మీటింగ్ 2.0ని నిర్వర్తించారు. ప్రభుత్వ పాఠశాలల పునరుజ్జీవనానికి ప్రజల తోడ్పాటు అవసరంగా భావించారు. పాఠశాలల్లో సదుపాయాల లోపాలు, బోధన ప్రమాణాలు, వసతులు మొదలైన అంశాలపై తల్లిదండ్రుల స్పందన, విద్యార్థి విజయానికి కుటుంబం, పాఠశాల కలిసి చేయవలసిన బాధ్యత ఉందని ప్రభుత్వం భావిస్తూ ఆ దిశగా అడుగులు వేస్తోంది.

విశాలాంధ్ర హైదరాబాద్

నెహ్రూ సిద్ధాంతానికి మారిన ప్రధాని మోడీ..?

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆగస్టు 15నాడు 79వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అద్దెకు తీసుకున్న ఎర్రకోట నుండి "దేశం స్వయం సమృద్ధి, స్వావలంభనకు కృషి చేస్తున్నదని ప్రకటించారు". ఇంతకాలం నెహ్రూ విధానాలను వ్యతిరేకించిన మోడీ నెహ్రూ విధానాలనే అమలు చేస్తున్నామని చెప్పటం విడ్డూరంగా ఉందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.యస్.బోస్ అన్నారు. మోడీ ఆర్థిక స్వావలంభన అని చెపుతూ దానికి మూలాల్కెన ఆర్థిక సంస్థల్కెన బ్యాంకులు, ఇన్సూరెన్స్ సంస్థలను ప్రైవేటీకరించటం, వాటి పని విధానంలో ఆటంకాలు సృష్టించటం, ఆర్థిక రంగంలో విదేశీ సంస్థలను అనుమతించటం లాంటి కార్యక్రమాలు దేశ ఆర్థిక స్వావలంభనకు వ్యతిరేకం. అలాగే ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయటం, అమ్మివేయటం, అదే స్థానంలో విదేశీ సంస్థలను ఆహ్వానించటం స్వయం సమృద్ధికి వ్యతిరేకం. స్వయం సమృద్ధి కొరకు నెహ్రూ డిఫెన్స్‌తో సహా అనేక ప్రభుత్వరంగ సంస్థలను నిర్మించి నిర్వహించటం జరిగింది. అదే బాటలో ఆర్థిక స్వావలంభన కొరకు ఇందిరాగాంధీ ఆర్థిక సంస్థల్కెన బ్యాంకులు, ఇన్సూరెన్స్, బొగ్గు, ఆయిల్ లాంటి అనేక సంస్థలను జాతీయం చేయటం జరిగింది. నెహ్రూ, ఇందిరాగాంధీలను వ్యతిరేకిస్తూ వారి సిద్ధాంతాలను వల్లెవేస్తున్న మోడీ నిజంగా తన పాలనలో స్వయం సమృద్ధి, ఆర్థిక స్వావలంభనకు కృషి చేస్తున్నాడా అంటే అదీ లేదని బోస్ అభిప్రాయపడ్డారు. భారత పెట్టుబడులతో, భారత్‌లో ఉత్పత్తి చేస్తే అది "మేక్ ఇండియా" అవుతుంది కానీ, విదేశీ సంస్థలు మన దేశంలో పరిశ్రమలు పెట్టి దేశ కార్మికుల శ్రమను దోచుకొని విదేశీ అవసరాల కోసం ఉత్పత్తులు తయారు చేసి వాటి కోసం ప్రభుత్వాల నుండి రాయితీ పొందే విధానం, లాభాలను తమ దేశాలకు తరలించుకుపోయే విధానం "మేక్ ఇండియా" అనిపించుకోదని, అలాంటి విధానం "లూట్ ఇండియా" అనిపించుకుంటుందని బోస్ అన్నారు. మోడీ తన తప్పును తెలుసుకొని ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలని, అభివృద్ధి చేయాలని కొత్త ప్రభుత్వరంగ సంస్థలను స్థాపించాలని డిమాండ్ చేశారు. రాజకీయ నాయకునికి వాక్‌శుద్ధి, ఆచరణ శుద్ధి ఉండాలని కానీ మాటల గారడీ, వాఘాడంభరం కాదని మోడీ తెలుసుకోవాలని హితవుపలికారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించే ఎన్నికలు నిర్వహించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ పెంచకుండానే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం మొగ్గు చూపు తున్నట్లు తెలుస్తున్నదని అదే జరిగితే బీసీలకు తీరని ద్రోహం చేయడమేనన్నారు. శాసనసభ, శాసన మండలిలలో బీసీ రిజర్వేషన్ పై బిల్లులను ఏకగ్రీవంగా అన్ని పార్టీలు ఆమోదించిన తర్వాత కేంద్రానికి పంపిన రాష్ట్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీల బీసీ సంఘాల ప్రతినిధులతో అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలోని బిజెపి శాసన సభ్యులు శాసన సభలో బిల్లులను బలపరిచి దానికి భిన్నంగా మాట మార్చడం దగుల్బాజీ తనమేనన్నారు. రాష్ట్రంలోని బిజెపి కేంద్ర మంత్రులు పార్లమెంటు సభ్యులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బిల్లులను రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్లో చేర్పించడానికి ప్రయత్నం చేయడం లేదంటే బీసీల ఎడల వారి చిత్తశుద్ధి ఏమిటో బహిర్గతమైంద న్నారు. బిజెపి రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆగస్టు 25న హైదరాబాదులో సత్యాగ్రహ దీక్ష చేస్తానని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై, ప్రధాని నరేంద్ర మోడీపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీలో చేస్తే బాగుంటుందన్నారు. బీసీలకు ద్రోహం చేసే రాజకీయ పార్టీలకు పుట్టగతులుండ వని తగిన సమయములో గుణపాఠం తప్పదని వెంకట్రాములు హెచ్చరించారు.

ఘనంగా హోప్ ఫౌండేషన్ అన్నదానం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్న ప్రసాద భోజన కార్యక్రమం 145 పూర్తి చేసుకుంది. 145వ శనివారం అన్నదాన కార్యక్రమంలో సుమారు 2000 వేల మంది పాల్గొన్నారు. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం చేపడుతున్న అన్నదానం కార్యక్రమం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. నిత్యం పనులు చేసుకుంటూ జీవనం గడిపే తమకు ప్రతి వారం ఉచిత భోజనం అందజేయడం పట్ల హెూప్ ఫౌండేషన్ చైర్మన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

18న రాజ్‌భవన్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : వికలాంగులను సకలాంగులుగా మార్చే సదుద్దేశ్యంతో ఈనెల 18న సోమాజిగూడలోని సాంస్కృతిక భవన్, రాజ్‌భవన్‌లో ఉచిత శస్త్ర చికిత్స ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ ఆర్గనైజింగ్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ విజయభాస్కర్, ఐఆర్ సిఎస్ హైదరాబాద్ చైర్మన్ ఎం.బీంరెడ్డి, నారి ఫౌండేషన్ డాక్టర్ కీర్తన యాదవ్, డాక్టర్ కమలాకర్, జన జాగృతి ప్రతినిధి కె.శరద్ పిట్టి తెలిపారు. శనివారం బషీర్ బాబులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు శిబిరానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. రాజ్ భవన్ డిజేబుల్ ఫౌండేషన్ ట్రస్ట్, రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ బ్రాంచ్, అగర్వాల్ సేవాదళ్ బద్రి విశాల్ పన్నాలాల్ పిట్టి ట్రస్ట్, మహావీర్ వికలాంగ్ సహాయత సమితి, రాందేవ్‌రావు హాస్పిటల్ ట్రస్ట్ సహకారంతో ఈ ఉచిత వైద్య శిబిరానికి తెలంగాణలోని వికలాంగులను డిసేబుల్ కార్పొరేషన్ ప్రభుత్వం సమీకరిస్తుందని తెలిపారు. కృత్రిమ అవయవాలు, కాలిపర్లు, వికలాంగుల వైకల్యాల ఉచిత శస్త్ర చికిత్స, దిద్దుబాటు, సాధారణ ఆరోగ్య శిబిరం, ఉచిత ఔషధం, ఉచిత ప్రయోగశాల పరీక్షలు, కంటి చెకప్ అద్దాలు అందించబడతాయని తెలిపారు. ఈ శిబిరంలో వందమంది వైద్య బృందం ఆధ్వర్యంలో 21 రకాల పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, వికలాంగులు, సామాజిక సాధికారత మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, గవర్నర్ సెక్రటరీ దాన కిషోర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య తదితరులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వికలాంగులు ఈ ఉచిత ఆరోగ్య శిబిరానికి హాజరై సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భారీ వర్షాల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణలో అనేక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ప్రజల అవసరాలను గమనించి, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను ఆ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. అధిక వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో పరిస్థితులను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన, ఈఎన్సీలు కృపాకర్ రెడ్డి, ఎన్ ఆశోక్, ఇతర సంబంధిత అధికారు లతో మంత్రి నిరంతరం సమీక్షిస్తున్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ముఖ్యంగా మంచినీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా, అధిక జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. తాగు నీటి కలుషితం జరగకుండా, ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచడం, నీటిని డబుల్ క్లోరినేషన్ చేసి సరఫరా చేయడం వంటి చర్యలు కొనసాగించాలని సూచించారు. వర్షాల వల్ల తలెత్తే ఎమర్జెన్సీ పరిస్థితులపై తక్షణ స్పందన అవసరమని, ఏ సమస్య ఎదురైనా వెంటనే పునరుద్ధరణ పనులు ప్రారంభించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఇందుకోసం కలెక్టర్ల వద్ద ఇప్పటికే ప్రత్యేక నిధులు అందుబాటులో ఉన్నందున, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మిషన్ భగీరథ అధికారులు క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్నారు. వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, నీటి సరఫరా కేంద్రాలు, భద్రతా ప్రమాణాలను తనిఖీ చేస్తున్నారు. అదే విధంగా పంచాయతీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు గ్రామాల నుంచి రోడ్లు, కల్వర్లు దెబ్బతిన్న చోట్ల సమాచారం సేకరించి, తాత్కాలిక ప్రత్యామ్నాయ రహదారి సదుపాయాలను కల్పిస్తున్నారు. ఇప్పటికి అందిన సమాచారం మేరకు భారీ వర్షాల వల్ల పంచాయతీ రాజ్ విభాగానికి చెందిన రహదారులకు వాటిల్లిన నష్టం పై అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తం 84.97 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులు దెబ్బతిన్నట్లు అధికారులు మంత్రి సీతక్కకు నివేదించారు. ఇందులో 48 ప్రాంతాకల్లో ఉపరితర రోడ్లు దెబ్బతినగా... తాత్కాలిక పునరుద్ధరణ కోసం రూ. 3.32 కోట్లు, శాశ్వత పునరుద్ధరణ కోసం రూ.42.63 కోట్లు ఖర్చు కానున్నట్లు అధికారులు అంచనా వేశారు. కల్వర్టు, లోకాజ్ వేలు, క్రాస్ డ్రేయిన్ పనులు మొత్తం 77 ప్రాంతాల్లో దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. వీటికి తాత్కాలిక పనుల కోసం రూ. 1.55 కోట్లు, శాశ్వత పునరుద్ధరణ కోసం రూ. 57.60 కోట్లు వ్యయం కానుందని ఇంజనీర్లు అంచనా వేశారు. 30 ప్రాంతాల్లో గండ్లు పడగా, తాత్కాలిక పునరుద్ధరణ కోసం రూ.కోటికి పైగా ఖర్చు అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అదే శాశ్వత పునరుద్ధరణ కోసం రూ. 5.45 కోట్లు ఖర్చు అవుతాయని సమాచారం. మొత్తంగా పీఆర్ ఆర్డీ పరిధిలో మొత్తం 124 రోడ్లు దెబ్బతినగా..తాత్కాలిక పునరుద్ధరణ పనుల కోసం సుమారు రూ.6 కోట్లు శాశ్వత పునరుద్ధరణ కోసం రూ. 141 కోట్ల వరకు ఖర్చు అవుతాయని అంచనా ఉంది. వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక, శాశ్వత అవసరాల కోసం రూ.147.70 కోట్లు ఖర్చు అవుతాయని అధికారులు పేర్కొన్నారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో త్వరితగతిన పునరుద్ధరణ చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు స్పష్టం చేశారు. ఇక గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో శిధిలావస్తలో ఉన్న ఇండ్లను గుర్తించి ప్రజలను అక్కడి తరలిస్తున్నారు. లోతట్టు ప్రాంత ప్రజలకు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. ఎక్కడైనా సమస్య తలెత్తినా, వెంటనే పై అధికారులకు సమాచారం అందించడంతో పాటు, వెంటనే పరిష్కారం చూపిస్తున్నారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో శాఖ ముందస్తు ఏర్పాట్ల కారణంగా ఇప్పటి వరకు ఎలాంటి ప్రధాన సమస్యలు తలెత్తకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. భవిష్యత్తులో ఏమైనా కొత్త పరిస్థితులు తలెత్తినా ఎదుర్కొనేందుకు శాఖ పూర్తిగా సిద్ధంగా ఉందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

ఆర్టీసీ కార్గో హమాలి కార్మికుల రేట్లు పెంచాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆర్టీసీ కార్గో హమాలీ కార్మికుల రెట్లు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. శనివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కార్గో హమాలీ కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ నేతృత్వంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పి. సురేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ట్రాన్స్ పోర్టు రంగాన్ని ఆర్టీసీ యాజమాన్యం నిర్వహించేదని ప్రస్తుతం కార్గో నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు టెండర్ల ద్వారా నిర్వాణ ఇవ్వడం చేత ట్రాన్స్ పోర్ట్ రంగం కార్గోలో పనిచేస్తున్న వివిధ రకాల కార్మికులు సిబ్బందికీ శ్రమకు తగిన రేట్లు చెల్లించడం లేదని దీని ఫలితంగా శ్రమ దోపిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కార్గోలో పనిచేస్తున్న హమాలి కార్మికులకు గతంలో ఆర్టీసీ యాజమాన్యం ఐదు కిలోల బరువు లోపు ఏడు రూపాయల యాబై పైసలు,5 కిలోల పైబడిన వాటికి పది రూపాయలు, 50 కేజీల పైబడిన వస్తువులకు 15 రూపాయలు చెల్లించేదని కానీ ఆర్టిసి యాజమాన్యం ఏడు రూపాయల 50 పైసలకు తగ్గించిందని అన్నారు. ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం చేత మరి దారుణంగా కార్మికుల పొట్టలు కొట్టే విధంగా హమాలి రేట్లు భారీగా తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్గో హమాలి కార్మికులు ఇప్పటికే అనేకసార్లు ప్రభుత్వాన్ని ఆర్టిసి యాజమాన్యాన్ని 15 రూపాయలకు పెంచాలని విజ్ఞప్తులు చేస్తు వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. మహబూబ్ నగర్ బస్టాండ్ కార్గో ప్రైవేట్ కాంట్రాక్టర్ రాష్ట్రవ్యాప్తంగా అందిస్తున్న మాదిరిగా కార్మికులకు హమాలి రేట్లు అందించాలని లేకపోతే ఆందోళన తప్పదని అన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి కార్గో హమాలి కార్మికులకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం హమాలి రేట్లు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా నాయకులు ఎస్. దేవానంద్, కార్గో హమాలీ కార్మికులు కె.రాములు, ఎం. రవికుమార్, సతీష్, నరేష్, సుధీర్, కృష్ణ,పాష, అంజి, గిరి, రఘు తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికుల శ్రమ ఎక్కువ... ఆదాయం తక్కువ : మహేష్ గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : అసంఘటిత కార్మికుల శ్రమ ఎక్కువ చేసినా వారి ఆదాయం మాత్రం తక్కువే ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. అణగారిన వెనుకబడిన కార్మికులు ఎవరైనా ఉన్నారంటే అది అసంఘటిత కార్మికులే అంటూ వ్యాఖ్యానించారు. శనివారం గాంధీ భవన్లో కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ అఖిల భారత అసంఘటిత కార్మికులు, ఉద్యో గుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, కేకేసి నేషనల్ చైర్మన్ ఉదిత్ దిత్ రాజులతో పాటు కార్యక్రమంలో ఏఐసీసీ జెట్టి కుసుమ కుమార్, కేకేసి నేషనల్ వైస్ చైర్మన్ షేక్ ఇబ్రహీం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేష్ కూమార్ గౌడ్ కామెంట్స్ మాట్లాడుతూ దేశంలోని అన్నీ రకాల ప్రజలను, కార్మికులను ఆదుకోవాలని రాహుల్ గాంధీ బలమైన ఆలోచనతో ఆకాంక్షిస్తున్నారని చెప్పారు. అసంఘటిత కార్మికులు అత్యంత శ్రమ పడుతారు... కానీ సరియైన గుర్తింపు ఉండదున్నారు. తెలంగాణలో ఈ కార్మికుల సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలోనే అసంఘటిత కార్మికుల సాదక- బాదలు విన్నామని, కార్మికులందరూ కష్టపడండి.. మిమ్మల్ని గుర్తించి సీఎం రేవంత్ రెడ్డి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. మీ శ్రేయస్సు కోసం పార్టీ పరంగా సీఎంతో చర్చిస్తామని, త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డితో అసంఘటిత కార్మికుల సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

బ్యాంక్ వడ్డీ కన్నా ఎక్కువ ఇస్తానంటూ మోసం...

విశాలాంధ్ర - మల్కాజిగిరి : బ్యాంకులు ఇచ్చే వడ్డీకన్న అధిక మొత్తంలో వడ్డీని చెల్లిస్తా నంటూ ప్రజల నుంచి దాదాపు 20 కోట్ల రూపాయలతో ఉడాయిచ్చిన ఓ ఘనుడి సంఘటన వెలుగులోకి వచ్చింది. ప్రతినెల సమయానికి వడ్డీలను క్రమం తప్పకుండా వారివారి ఆకౌంట్లలో వేస్తుండడంతో పలువురు ఇదేదో బాగానే ఉందని, ఒకరి నుండి మరొకరు తెలిసుకుని నెల వారి ఖర్చులకైనా వస్తాయని ఆశపడ్డ సుమారు 170 మంది ఈ ఉచ్చులో పడ్డారు. మల్కాజిగిరి పరిసర ప్రాంతాల వాసులే కాకుండా వివిధ ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలకు చెందిన పలువురు నుంచి ఇరవై కోట్ల వసూళ్లు చేసుకుని బిషాణా ఎత్తివేయడంతో బాదితులు పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకపోవడంతో ఇక ప్రభుత్వమే తమకు న్యాయం చేయాలంటూ వేడుకుంటున్నారు. దీనికి సంబం దించిన వివరాలు బాధితులు శనివారం మల్కాజి గిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలియజేశారు. సైనిక్ పురి ప్రాంతానికి చెందిన దినేష్ పాణ్యం, కవితాపాణ్యం భార్య భర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు. ఇద్దరు పిల్లలు యు.ఎస్.లో స్థిరపడ్డారు. దినేష్ పాణ్యం సైనిక్ పురిలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. భార్య కవితా పాణ్యం తానొక సైకలాజిస్టునంటూ నిమ్మించింది. మల్కాజిగిరి చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన పలువురిని మాయ మాటలతో మంచి మాటలతో పరిచయం పెంచుకున్నారు. ఇందులో ఎక్కువగా విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు, సాఫ్ట్వేర్ ఉద్యోగులతో పాటు అమాయక ప్రజల్ని తక్కువ కాలంలో ఎక్కువమందిని పరిచయం చేసుకున్నాడు. తాను షేర్ మార్కెట్ చేస్తానని, మీ వద్ద ఉన్న డబ్బును నాకు అప్పుగా చేబదులు ఇస్తే నెల నెల బ్యాంకు ఇచ్చే వడ్డీ కంటే ఎక్కువ ఇస్తాననని నమ్మపలికాడు. ఒక్కొక్కరి నుండి లక్షల్లో వసూళ్లు చేశాడు. వీరికి ప్రతినెల వడ్డీ మాత్రం సమయానికి ఇచ్చేవాడు. సమయానికి వడ్డీ వస్తుందని భావించిన అప్పిచ్చిన వారే మరింత డబ్బును అప్పుగా ఇచ్చారు. అయితే గత కొన్ని నెలలుగా వడ్డీలు పడకపోవడం, సైనిక్ పురిలోని కార్యాలయంలో ఎవరు లేకపోవడంతో బాధితులు ఈ ఏడాది జూన్ 2 న కుషాయిగూడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన రెండు రోజులకే ఆయన భార్య కవితాపాణ్యం తనకు తన భర్త నుండి విడాకుల కోసం కోర్టును ఆశ్రయించినట్లు చెప్పడం విస్మయం కలిగిస్తుందని బాధితులు వాపోతున్నారు. వృద్ధాప్యంలో ఉన్న మాకు ప్రభుత్వమే న్యాయం చేయాలంటూ బాధితులు జగన్నాధరావు, రవి, శ్రీధర్, సతీష్, సుధాకర్, ఫణి, సూర్యనారాయణ తదితరులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

తోల్కట్ట - నక్కపల్లి రోడ్డుకు మరమ్మత్తులు చేయాలి

విశాలాంధ్ర - మొయినాబాద్ : తోల్కట్ట చౌరస్తా నుండి నక్కపల్లి వరకు దాదాపు 7 కిలోమీటర్ల మేరా బీటీ రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారి గుంతలు కుంటలుగా తలపిస్తున్నాయి అంటూ మొయినాబాద్ మండల నాయకులు తోల్కట్ట గ్రామానికి చెందిన వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనుసరి అనసూయ అలియాస్ సీతక్కకు వినతి పత్రం అందజేశారు. శనివారం చేవెళ్లలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్కకు మండల కిసాన్ సెల్ అధ్యక్షులు తోల్కట్ట గ్రామ నివాసి బి. వెంకట్ రెడ్డి ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో నాయకులు మధుసూదన్ రెడ్డి, షాబాద్ దర్శన్, మహేందర్ ముదిరాజ్, రామ్ రెడ్డి, రాజుగౌడ్ తదితరులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మంత్రికి రోడ్డు గురించి వివరిస్తూ తోల్కట్ట చౌరస్తా హైదరాబాద్ - బీజాపూర్ రహదారి నుంచి మొదలుకుని ఎత్బార్ పల్లి, నక్కలపల్లి వరకు రోడ్డు పూర్తిగా గుంతలు పడి ప్రమాదాలకు నిలయంగా మారిందని తెలిపారు. రీ-బీట్ చేయించాలని మంత్రిని కోరారు. ఈ రోడ్డుకు గత 10ఏళ్ల నుండి గుంతలకు మరమ్మత్తులు నిర్వహించలేదని అన్నారు. హైదరాబాద్ -బీజాపూర్ రహదారి నుంచి తోల్కట్ట చౌరస్తా మొదలుకుని తోల్కట్ట, నక్కపల్లి ఈ గ్రామాలు ఈ రహదారిపై ప్రయాణికులు వాహనదారులు ఎంతోమంది వెళ్తుంటారు. వెంటనే ఈ రోడ్డు రీ - బీట్ చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించి వెంటనే అధికారులతో మాట్లాడి రీ-బీట్ చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మా అమ్మే నాకు ప్రేరణ : నైతిక్

విశాలాంధ్ర - హైదరాబాద్ : పాఠశాల విద్య, క్రీడలు, ఈతలు, నాట్యంలో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో శిక్షణ పొందుతున్న తాను రాణించగానికి అడుగడుగునా నా వెన్నంటి ఉంటూ నన్ను ప్రోత్సహిస్తున్న మా అమ్మ డాక్టర్ సాహెబ్ జాదా సృజన నాకు ప్రేరణ అన్ని ఎనిమిదేళ్ళ బాలుడు నైతిక్ అన్నారు. మా అమ్మమ్మ డాక్టర్ కందిమళ్ళ భారతి, తాతయ్య ప్రొఫెసర్ ఎస్.వి. సత్యనారాయణ నాకు స్ఫూర్తి' అంటూ ముద్దు ముద్దు మాటలతో వివరించాడు. శనివారం సాయంత్రం 6 గంటలకు బాగ్ అంబర్‌పేటలోని సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ సీనియర్ సిటిజన్స్ పార్క్‌లో, శనివారం కాలనీ ఉపాధ్యక్షులు సుధాకర రావు అధ్యక్షతన జరిగిన సభలో మాస్టర్ నైతిక్ రచించిన స్వీయ కథ 'గమ్యం, నేను, అమ్మ, నా పెద్ద స్వప్నం" ఆంగ్ల పుస్తకాన్ని స్వాతంత్య్ర సమరయోధుడు, బహుగ్రంథకర్త, నైతిక్ ముత్తాత కందిమళ్ళ ప్రతాపరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ 'పుస్తకాలు చదివే, రాసే అలవాటు తగ్గిపోతున్న ఎలక్ట్రానిక్ యుగంలో నా మునిమనుమడు నైతిక్ తన క్రీడాభిమానాన్ని, పుస్తక పఠన ప్రీతితో కూడిన తన స్వీయానుభవాన్ని, దీర్ఘకాలిక స్వప్నాన్ని చక్కని కథా కథన శైలిలో రాయడం సంతోషంగా ఉందన్నారు. సభా ప్రారంభంలో ప్రొఫెసర్ ఎస్వి సత్యనారాయణ సభికులకు స్వాగతం పలుకుతూ తన స్వీయ కవిత 'మనుమడొస్తున్నాడు' చదివినప్పుడు శ్రోతలు ఉద్రూతలూగారు. నైతిక్ మాతృమూర్తి డాక్టర్ సృజన పుస్తక నేపథ్యాన్ని వివరిస్తూ. 'ఈ పుస్తకం తన తండ్రిఎస్వి సత్యనారాయణ 72వ జన్మదినోత్సవ సందర్భంగా ఆవిష్కరించడం ఆనందగా ఉందన్నారు. సిహెచ్ వేణుగోపాలరెడ్డి, బి.శేఖరరెడ్డి, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్, కార్యనిర్వాహక కార్యదర్శి కెవిల్, కందిమళ్ల సావిత్రి, విజయలక్ష్మి, ఉషా, కళ్యాణి, పార్వతి,పుష్ప,చిలువేరు యాదగిరి, గండూరి నాగేశ్వరరావు, సింగరాజు నాగేశ్వరరావు, మక్కంమధుసూదన్, నూకల సుబ్బారావు, శర్మ, సుధాకర్, హరిప్రసాద్, వెంపటి గోపాలకృష్ణ మూర్తి, కృష్ణ మోహన్, ఆర్.పార్థసారథి, ఎం.బి.గంగారెడ్డి, డాక్టర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

పీర్జాదిగూడలో వైభవోపేతంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని మా భవాని నగర్‌లో ఆర్.కె. యువభారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఆర్.కె. యువ భారతి ఫౌండేషన్ చైర్మన్ కన్నెబోయిన రాము యాదవ్ మార్గ నిర్దేశనంలో నిర్వహించిన ఈ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. తొలుత శ్రీ కృష్ణ అలంకరణతో ప్రారంభమైన వేడుకలో గోమాత హారతి, చిన్ని కృష్ణ గోపికల వేష ధారణ, చిత్ర లేఖనం పోటీల నిర్వహణ, భగవద్గీత విశిష్టతపై ప్రసంగాలు. ఉట్టి కొట్టే మహత్తర కార్యక్రమంతో పాటు శ్రీ కృష్ణ జన్మ ఆవశ్యకతపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలో ముఖ్య అతిథులు మాతా అన్నపూర్ణేశ్వరి మాతా స్వామి దుర్గానంద స్వామి, బీజేపీ రాష్ట్ర నాయకులు ఏనుగు సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోకంలో ధర్మం గతి తప్పినప్పుడు, అధర్మం పెచ్చు మీరినప్పుడు భగవానుడు జన్మిస్తాడని. అదే క్రమంలో శ్రీ మహా విష్ణువు ఎనిమిదవ అవతారంగా ద్వాపర యుగంలో శ్రీ కృష్ణ భగవానుడు జన్మ తీసుకుని ధర్మ పరిరక్షణ చేసాడని తెలిపారు. ఆ దేవదేవుడి పసి తనంలోనే లోక కంతకుడైన కంసుడిని వదించి సర్వ జనుల హితం కలిగించాడని అన్నారు. మహాభారత యుద్ధంలో కౌరవుల పక్షం వహించిన భగవానుడు మహెూన్న మహెూన్నతమైన భగవద్గీత అందించి జగద్గురువుగా ప్రసిద్ధికెక్కారని వివరించారు. గీతలో ఆయన అందించిన సారం అర్థం చేసుకుంటే మానవ సమాజంలో ఎవరికి వారు పాటించాల్సిన విధివిదానాలు, నడవడిక అర్థమవుతాయన్నారు. ఆ భగవానుడు భోదించిన గీతా సారాంశం నేటి సమాజానికి ఎంతో ఉపయోగకరమని అన్నారు. భగవద్గీత అధ్యాయాలు ఆకలింపు చేసుకుంటే నేటి తరంలో ఎటువంటి పెడ ధోరణులు. రుగ్మతలు తలెత్తవని, శారీరకంగా, మానసికంగా వ్యక్తి ఉన్నతిని పొందుతాడని అన్నారు. శ్రీ కృష్ణ పరమాత్మ లీలలను నెమరు వేసుకోవడానికి జన్మాష్టమి వేడుకలు జరుపుకుంటారని వారి ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బండారు పవన్ రెడ్డి. మనోహర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, నీలారపు ఐలయ్య యాదవ్, స్వరూప చంద్రా, సుధాకరాచారి, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కృష్ణాష్టమి పండుగను పురస్కరించుకొని కోకాపేట్‌లోని హరే కృష్ణ హెరిటేజ్ టవర్‌లో కృష్ణాష్టమి ఉత్సవాలలో కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డితో కలిసి కృష్ణాష్టమి వేడుకలలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ శ్రీకృష్ణుని చల్లని ఆశీస్సులు దీవెనలతో దేశం శాంతి, సుభిక్షంగా ఉండాలని ఆయన ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలకు జీవితాంతం ఆనందంగా ఉండాలని వేడుకున్నట్టు ఆకాంక్షించడం జరిగింది మరొకసారి ప్రజలందరి కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజన్, జిల్లా కన్వీనర్ లక్ష్మీనారాయణ, మణికొండ వైస్ చైర్మన్ నరేందర్, కార్యవర్గ సభ్యులు మల్లారెడ్డి కొమురయ్య, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, మణికొండ మున్సిపల్ ప్రెసిడెంట్ రవికాంత్, నాగేష్ వెంకటేష్, బిక్షపతి యాదవ్, బీరప్ప మైపాల్, మహేష్ యాదవ్, మలింగం గౌడ్, విజయ్ శివరాజ్, మధుసూదన్, మన్మోహన్ రెడ్డి, శేఖర్ రామారావు, నార్సింగి మున్సిపాలిటీ మణికొండ మున్సిపాలిటీలోని నాయకులు కార్యకర్తలు హరే కృష్ణ హెరిటేజ్ టవర్ కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని చౌడమ్మ గుట్ట ఆంజనేయ స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న సీనియర్ జర్నలిస్టులు గుడిపల్లి శ్రీనివాస్, శ్రీశైలం పల్లకి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంజనేయ స్వామివారి కృప, కటాక్షం భక్తులపై ఎల్లవేళలా ఉండాలని కోరారు. భారీగా తరలివచ్చిన భక్తులు, భజన బృందంతో కలిసి స్వామివారి పల్లకి మోశారు, ఇలాంటి అవకాశం కల్పించిన ఆలయ కమిటీ, అర్చకులకు, భజన బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులతో పాటు భజన బృందం గడ్డ మీది రమేష్, మహిళా భక్తులు, అన్నదాన సభ్యులు అన్నారం కుమార్ గౌడ్, వేణు గౌడ్, లక్ష్మాయ గౌడ్, యాదగిరి గౌడ్ రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

విశాలాంధ్ర - కాప్రా : మన సంప్రదాయ పండుగలు సమాజానికి ఐకమత్యాన్ని తెస్తాయని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కాప్రా సర్కిల్ డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని జమ్మిగడ్డలో శనివారం శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా గోపికృష్ణ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలకు భక్తులు తరలివచ్చారు. ఆలయం నలుమూలలా పూలదండలతో, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. భక్తులు ఘనంగా పూజలు, భజనల్లో పాల్గొని స్వామి కీర్తనలతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగిపోయింది. శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డితో ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీ కృష్ణ పరమాత్ముడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మన సంప్రదాయ పండుగలు సమాజానికి ఐకమత్యాన్ని తెస్తాయని, ఉత్సవాలు భక్తి భావనను పెంచడమే కాకుండా, సామాజిక సౌభ్రాతృత్వానికి వేదికలు అవుతాయన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాముల యాదవ్, ఎం.బి.కృష్ణ యాదవ్, జెమ్మిగడ్డ గోపి కృష్ణ యాదవ్ సంఘం వ్యవస్థాపక సభ్యులు రమేష్ యాదవ్, తిరుమలయ్యయాదవ్, సలహాదారులు కనుక ప్రసాద్ యాదవ్, పరమేష్ యాదవ్, రాములు యాదవ్, కనకయ్య యాదవ్, అధ్యక్షుడు గోపాల్ యాదవ్, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ యాదవ్, నర్సింహులు యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యాదవ్, కార్యనిర్వక కార్యదర్శి వెంకటయ్య యాదవ్, సంయుక్త కార్యదర్శిలు కనకయ్య యాదవ్ హాజరయ్యారు.

నాగాలాండ్ గవర్నర్ లా గణేశన్ మృతికి దత్తాత్రేయ సంతాపం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : నాగాలాండ్ గవర్నర్ లా గణేశన్ మృతి తనకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని, వారు మంచి స్నేహశీలి, మృదు స్వభావి అని, లోతైన విషయ పరిజ్ఞానం ఉన్న నాయకుడని, రాజ్యసభ సభ్యుడిగా విశేష సేవలందించారని, భారతీయ జనతా పార్టీ తమిళనాడు సంఘటన మంత్రిగా పార్టీ అభివృద్ధికి నిరంతరం నిస్వార్థంగా పాటుపడ్డ నాయకుడని బండారు దత్తాత్రేయ వారి సేవలను కొనియాడారు. నిజ జీవితంలో అన్ని వదిలిపెట్టి కేవలం సమాజం కోసం సమర్థ భావంతో తన జీవితాన్ని అర్పించిన నాయకుడు లా గణేశన్ ని, దేశ భక్తి, జాతీయభావం, భారతీయ సంస్కృతి పెంపొందింపజేసేందుకు అన్ని వర్గాలతో కలిసి కృషి చేశారని, భారతీయ జనతా పార్టీ అఖిల భారత కార్యదర్శిగా కూడా వారు సేవలందించారని, తాను తమిళనాడు రాష్ట్ర బీ జే పీ ప్రభారిగా వారితో కలిసి పనిచేసిన సమయంలో వారు అనేక విషయాలు నాతో చర్చించేవారని, లా గణేశన్ మరణం జాతీయ వాద సంస్థలకు, తమిళనాడు రాజకీయాలకు తీరని లోటు అని, వారి మృతి పట్ల తన ప్రగాఢ సంతాపం తెలుపుతున్నానని, వారి కుటుంబ సభ్యులకు ఈ క్లిష్ట సమయన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని, భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు బండారు దత్తాత్రేయ తెలియజేసారు.

బహిరంగ ప్రదేశంలో లిక్కర్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర - మేడిపల్లి: బహిరంగ ప్రదేశంలో లిక్కర్ అమ్ముతున్న ఇద్దరు వ్యక్తుల అదుపులోకి తీసుకున్న సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొందరి సమాచారం మేరకు మేడిపల్లి పోలీస్ వారు బోడుప్పల్ ఏరియాలో గస్తీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు టెలిఫోన్ కాలనీలో మురారి శెట్టి, సంపత్ కుమార్ లను బోడుప్పల్ లోని మహంకాళి బార్ ఓపెన్ ప్లేస్ లో బత్తిరి అజయ్ ని లిక్కర్ అమ్ముతుండగా పట్టుకుని విచారించగా స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా వైన్ షాప్స్ మూసి ఉన్నాయి. కావున అధిక ఆదాయం మేరకు వారికి దగ్గరలో ఉన్న లిక్కర్ షాపుల నుండి లిక్కర్ కొని అమ్ముతుండగా వారిని పట్టుకొని కేసు నమోదు చేశారు. వారి నుండి 8.190 లీటర్ల లిక్కర్ను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

మున్నూరు కాపు సంఘంతో మాగంటి సమావేశం

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : యూసుఫ్ గూడ డివిజన్ శ్రీకృష్ణ నగర్ మున్నూరు కాపు సంఘం వారి ఆహ్వానం మేరకు వారి కార్యాలయానికి వెళ్లి ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న మాగంటి వజ్రనాథ్. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు బుడుగు రవీందర్, చైర్మన్ మామిడాల రాజు, మాజీ చైర్మన్ కోలా శివకుమార్, పేరుక రవి, బసవరాజు, సతీష్, రాములు, ప్రభాకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా
శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో సమయజ్ఞ, శ్రేయాన్వి
(విశాలాంధ్ర - మల్కాజిగిరి)

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి : మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఎర్రగడ్డ డివిజన్‌లో నేతలంతా ఐక్యంగా పని చేయాలి, అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. శనివారం ఎర్రగడ్డ డివిజన్ కో ఆర్డినేషన్ కమిటీ, బూత్ కో ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసుకోవాలని, మినిస్టర్ క్వార్టర్స్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఎర్రగడ్డ డివిజన్ బూత్ ఇన్చార్జిలు, ముఖ్య నేతలతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ ఎర్రగడ్డ డివిజన్‌లో ఉన్న ప్రజా సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. డివిజన్‌లో ఉన్న 46 బూత్‌లకు బూత్‌ల వారిగా సమస్యలపై ప్రజల నుండి స్వీకరిద్దామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని, పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులు పూర్తి చేయాలని జీహెచ్ ఎంసీ కమిషనర్, హైదరాబాద్ కలెక్టర్‌లను తీసుకొని డివిజన్‌లో పర్యటిస్తానని చెప్పారు. డివిజన్‌లో స్వయంగా నేనే పాదయాత్ర చేస్తూ సంబధిత అధికారులతో సమస్యలు తెలుసుకునీ పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజా పాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న పథకాలు ఇంటింటా తీసుకుపోవాలని, గత 10 సంవత్సరాలుగా నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, హైదరాబాద్ నగర అభివృద్ధి, రోడ్ల నిర్మాణాలు, నాళాలు అభివృద్ధి అంశాలు గడప గడపకు ప్రజల్లోకి తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో అజారుద్దీన్, కూడా చైర్మన్ ఇనగాళ వెంకట్రామిరెడ్డి, తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్‌గా గుత్తా అమిత్ రెడ్డి, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట స్వామి, బూత్ ఇంచార్జిలు, ముఖ్య నేతలు హాజరయ్యారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపల్ పట్టణ అభివృద్ధిలో భాగంగా కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని 6, 9వ వార్డులోని పలు కాలనీల్లో శనివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్థానిక నేతలతో కలిసి కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అదేవిధంగా 9వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ నియంత్రికలను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయా కాలనీవాసులు తమ ప్రధాన సమస్యలైనా సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వీధి దీపాలు వంటి పలు సమస్యలను వివరించి పరిష్కారించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన కాలనీవాసులు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు మహిళలు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 15 రోజుల్లోనే పనులు పూర్తి చేస్తాం అన్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ పట్టణ మున్సిపల్‌ను ఆదర్శ మున్సిపల్‌గా తీర్చిదిద్దడంలో భాగంగా 15 రోజుల క్రితం 9వ వార్డులో నెలకొన్న విద్యుత్ సమస్యలను అధికారులతో కలిసి పర్యవేక్షించడం జరిగిందని, ప్రజల అవసరాల మేరకు తక్షణమే విద్యుత్ నియంత్రికులు, స్తంభాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రధాన సమస్యలైనా అంతర్గత డ్రైనేజీ, సీసీ రోడ్లు, నల్ల కనెక్షన్ వంటి సమస్యలు ఉంటే కాలనీవాసులంతా చర్చించుకుని ఒక వినతి పత్రం సమర్పించాలని ఆయన కాలనీవాసులకు సూచించారు. అదేవిధంగా కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు. ఈ సందర్భంగా వారందరికీ ఎమ్మెల్యే దసరా లోపు పనులన్నీ పూర్తి అయ్యేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, శ్రీశైలం, ఇబ్రహీం, ముబారక్ అలీ ఖాన్, కొప్పునూరు ప్రవీణ్, ఖదీర్, కాలనీవాసులు, మహిళలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి : ఎంపీ

విశాలాంధ్ర - బషీర్ బాగ్: పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించినప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా ప్రవర్తిస్తున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ. ఆర్.కృష్ణయ్య విమర్శించారు. విద్యార్థి ఉద్యమాలను తక్కువగా చూడొద్దన్నారు. బకాయిల విడుదల కోసం ఈ నెల 20న కళాశాలలను బహిష్కరించి, విద్యార్థులతో కలిసి కలెక్టరేట్, ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయాల వద్ద శాంతియుతంగా నిరసన తెలిపి, అధికారులకు వినతి పత్రాలు అందజేస్తామని తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ అధ్యక్షతన ఛలో కలెక్టరేట్‌కు సంబంధించిన వాల్ పోస్టర్ ను కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆరు కృష్ణయ్య మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్యకు కేటాయించిన సొమ్మును డబ్బులను మంత్రులు మింగుతున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్లకు వేల కోట్లు బిల్లులను రిలీజ్ చేస్తూ, 15 లక్షల విద్యార్థుల బకాయిల విడుదలలో మాత్రం ప్రభుత్వం తీవ్ర జాప్యం వహిస్తుందని అన్నారు. ఈ బకాయిల విషయంలో ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్కను అనేక సార్లు కలసి విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. వేముల రామకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా, ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు రూ.20 కూడా విడుదల చేయలేదని ఎద్దేవా చేశారు. ముఖ్య మంత్రి జోక్యం చేసుకొని విద్యార్థులకు, కాలేజీ యాజమాన్యాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల స్కీములు ఎత్తివేయడానికి 'ట్రస్ట్ బ్యాంకు' ఏర్పాటు చేసి దాని ద్వారా ఫీజులు చెల్లిస్తామని కొత్త నాటకానికి తెర లేపారని ఈ ప్రతిపాదన ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబో మని అన్నారు. నీల వెంకటేష్, నంద గోపాల్, మోడీ రాందేవ్, కార్తీక్ పటేల్, కృష్ణ, గౌడ్, భరత్ గౌడ్, అభిరాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల పేరుతో మోసగించిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

విశాలాంధ్ర-దుండిగల్: అడ్మిషన్‌ల పేరిట పెద్ద ఎత్తున మోసం చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని బిజెపి మున్సిపల్ అధ్యక్షుడు పిసరి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి సాయి అనురాగ్ కాలనీలో ఐర ఎడ్యుకేషన్ సర్వీస్ పేరుతో కార్యాలయం ప్రారంభించి బీటెక్, డిగ్రీ అడ్మిషన్లు ఇప్పిస్తామని విద్యార్థుల డాటా కనెక్ట్ చేసి ఒక్కొక్కరి దగ్గర 50 వేల నుండి రెండు లక్షల వరకు సుమారు 150 మంది తల్లిదండ్రుల నుండి రెండు కోట్ల వరకు వసూలు చేసి టోపీ పెట్టి పారిపోయిన రాజు అనే వ్యక్తిపై జులై 23, ఆగస్టు 4 తేదీన బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో రెండు సార్లు పిర్యాదు చేసి ఒత్తిడి చేస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేసిన బాచుపల్లి పోలీస్‌లు ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం చేకూర్చలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతరం బిజెపి దుండిగల్ మున్సిపల్ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి బాధితులతో కలిసి పోలీస్‌స్టేషన్ పోలీస్‌లో అధికారులను కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ పిర్యాదు చేసి సుమారు నెల రోజులు కావస్తున్న అతన్ని ఇప్పటివరకు ఎందుకు అరెస్ట్ చేయలేకపోయారని ప్రశ్నించారు. పోలీసులకు బాధితులే నిందితుడి నివాసం, ఫోన్ నెంబర్ కుటుంబ సభ్యుల వివరాలను తెలియజేసిన కూడా పట్టుకోలేకపోయారు. కావున ఇలాంటి వారిని ఎక్కడున్నా అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బిజెపి పార్టీ తరఫున కోరారు. బాధితులలో ఘౌరంపేట్ సామల మహేందర్రెడ్డి, వీరారెడ్డి, రాందాస్, ప్రభాకర్, జయపాల్, భరత్ గౌడ్, అనంతరెడ్డిలు మరో 150 మంది ఉన్నారు.

ఖజానా జ్యువెల్లర్స్ దొంగల ముఠా అరెస్ట్

విశాలాంధ్ర - హైదరాబాద్ : గత నాలుగు రోజుల క్రితం 12వ తేదీన ఉదయం షాపు తెరిచిన పది నిమిషాల్లో చందానగర్‌లోని ఖజానా జ్యువెల్లర్స్ షాపులోకి ఆరుగురు గుర్తు తెలియని దుండగులు ఆయుధాలతో మాస్కులు ధరించి ప్రవేశించారు. ఆ దొంగలు ప్రవేశిస్తూనే అడ్డు వచ్చిన డిప్యూటీ మేనేజర్ సతీష్ కుమార్‌పై కాల్పులు జరిపి, ఆయన ఎడమ మోకాలికి గాయపరిచారు. అనంతరం సుమారు 10 కిలోల వెండి ఆభరణాలు (బంగారు పూత పూసిన వెండి సహా) దోచుకెళ్లారు. గాయపడిన సతీష్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై చందానగర్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 890/2025 కింద కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా శనివారం గచ్చిబౌలిలోని మాదాపూర్ డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాదాపూర్ డిసిపి వినీత్ మాట్లాడుతూ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. తదుపరి దర్యాప్తులో సైబరాబాద్ పోలీసులు ఈ దోపిడీ కేసులో పాల్గొన్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి 900 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో మొత్తం ఏడుగురు నిందితులు గుర్తించామన్నారు. అరెస్టయిన నిందితుల వివరాలు ఆశిష్ కుమార్ సింగ్ (22), స్వస్థలం: సారణ్ జిల్లా, బీహార్ రాష్ట్రం, దీపక్ కుమార్ సహ (22), స్వస్థలం: సారణ్ జిల్లా, బీహార్ రాష్ట్రం. మరికొంతమంది నిందితులు పరారీలో ఉన్నారు. బీహార్‌కు చెందిన నిందితులు హైదరాబాద్‌లో బంగారం, వజ్రాల ఆభరణాల షాపులను తుపాకులతో దోచుకోవాలని ప్లాన్ చేశారు. ఈ కుట్రలో భాగంగా హైదరాబాదులో వెల్డింగ్ వర్కర్‌గా పని చేస్తున్న దీపక్ కుమార్ సహ సహకారంతో, గత నెల 31వ తేదీన జీడిమెట్లలోని అస్బెస్టాస్ కాలనీలో ఒక గదిని అద్దెకు తీసుకున్నారు. అనంతరం ఖజానా జ్యువెల్లర్స్‌లో 12వ తేదీ ఉదయం షాపు తెరవగానే దోపిడీకి పాల్పడ్డారు. నిందితులు ఆశిష్ కుమార్ సింగ్‌ను మహారాష్ట్రలో పోలీసులు అరెస్ట్ చేయగా, అతని సమాచారంతో ఆశ్రయం కల్పించిన, వాహనాలు సర్దిచేసిన, షాపులను చూపించిన దీపక్ కుమార్ సహను కూడా అరెస్ట్ చేశామని డిసిపి వెల్లడించారు. నగల షాపుల నిర్వాహకులు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, షాపుల్లో ఇంట్రూషన్ అలారం ప్యానెల్స్ ఏర్పాటు చేసి, సమీప పోలీస్ స్టేషన్లకు అనుసంధానం చేయాలని సైబరాబాద్ ఆయన సూచించారు. మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ తో పాటు సైబరాబాద్ ఎస్ ఓటి, సీసీఎస్, లా అండ్ ఆర్డర్ అధికారులు, పనిచేశారు.

ఉత్తమ అధికారిగా పీర్జాదిగూడ కమిషనర్

విశాలంధ్ర - మేడిపల్లి: మేడ్చెల్ జిల్లా కేంద్రంలో జరిగిన 79వ స్వాతంత్రదినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ మను చౌదరి చేతుల మీదుగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు ఉత్తమ అధికారి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కమీషనర్ త్రిలేశ్వర్ రావు మాట్లాడుతూ ఉత్తమ అవార్డు పొందడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల అమలు, పరిపాలన, పారిశుద్యం, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సేవల్లో చూపిన ప్రతిభకు గాను ఉత్తమ కమిషనర్ అవార్డు లభించిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో పిర్జాదిగూడ నగరపాలక సంస్థను సమిష్టి కృషితో మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని, కమిషనర్ త్రిలేశ్వర్ రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగులు, నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర మహాసభలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఈ నెల 20న మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, గాజులరామారం, మహారాష్ట్ర గార్డెన్స్ నందు ప్రారంభం కానున్నాయి. ఆగస్టు 20న ఉదయం 9 గంటలకు జీడిమెట్ల పోలీస్ స్టేషన్ నుండి ప్రదర్శన జరుగుతుంది. ఉదయం 11 లకు ప్రారంభం ప్రారంభకులు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, అతిథులు సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హాజరు కానున్నారు. ఉదయం 10 గంటలకు అరుణ పతాకావిష్కరణ కె. ప్రతాప రెడ్డి చేయనున్నారు. ఉదయం 10.15 గంటలకు మృతవీరుల స్థూపావిష్కరణ ఏటుకూరి ప్రసాద్ చేయనున్నారు.

సంక్షేమ సంఘాల కృషితోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాల కృషితోనే కాలనీల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి రాజీవ్ గృహకల్ప మదర్ తెరిసా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని శనివారం ఆ కమిటీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కమిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పోచారం ప్రభాకర్ రెడ్డి, చీఫ్ సెక్రటరీ మన్నెపల్లి నర్సింగరావు, అధ్యక్షులు సలాది శివ, ఉపాధ్యక్షుడిగా మూర్తి, జనరల్ సెక్రెటరీ దాలినాయుడు, పితాని శ్రీనివాసరావు, కోశాధికారులుగా శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలుగా నాగభూషణం, పాల శ్రీనివాసరావు, కార్య నిర్వాహక కార్యదర్శులుగా బుజ్జిలు నియమితులయ్యారు. ఈ సందర్భంగా కొలను శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఏడాది కాలం పాటు కొనసాగే ఈ కమిటీ పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించి నిరుపేదలకు అండగా నిలబడేందుకు కృషి చేయాలని వారికి సూచించారు. మదర్ తెరిసా అంటే మానవత్వానికి ప్రతీక అని, సమాజంలో మానవత్వం పరిమళించే విధంగా కమిటీ స్ఫూర్తిదాయక కార్యక్రమాలను నిర్వహించాలని తెలియజేశారు. ప్రత్యేక ఆ మాతృమూర్తి జయంతి రోజు మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఎంతోమందికి ఆరోగ్య ప్రయోజనం చేకూరు స్తున్న కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. అదే విధంగా ఈ సంవత్సరం పాటు సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టాలని, అందుకు ఆయన సహకారం ఎల్లవేళలా ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులకు కొలన్ శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు.

25 వేల మంది సభ్యులను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : అగ్రసేన్ జయంతి నాటికి కనీసం 25 వేల మంది సభ్యులను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని తెలంగాణ అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా కోరారు. శనివారం అగర్వాల్ సమాజ్ తెలంగాణ రెండవ ఈజీఎం జరిగింది. ఈ సమావేశంలో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సహ కార్యదర్శి సీమా జైన్ సభకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈజీఎం ముఖ్యమైన ఎజెండాలో భాగంగా రాబోయే రెండేళ్లపాటు సభ్యత్వ రుసుమును రూ.350 నుండి రూ.21కి తగ్గించే ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆ తర్వాత, ఓటు హక్కు పరిధిని విస్తరిస్తూ, కేంద్ర మాజీ అధ్యక్షులు, ప్రస్తుత అధ్యక్షులు, శాఖల ప్రస్తుత అధ్యక్షులకు ఓటు హక్కు కల్పించే ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదించారు. జూలై 31న లేదా అంతకు ముందుగా కొత్త ఆఫీస్ బేరర్లతో మొదటి కేంద్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించాలన్న ప్రతిపాదనకు కూడా ఆమోదం తెలిపారు. ప్రివిలేజ్ కార్డ్ సంస్థల ఉద్యోగులకు కూడా ఇవ్వాలని నిర్ణయించారు. అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా 2 లక్షల మంది సభ్యులను చేర్చే ప్రణాళిక గురించి సమాచారం ఇచ్చారు. ఉపాధ్యక్షుడు, అగ్రసేన్ జయంతి కన్వీనర్ రూపేష్ అగర్వాల్ కార్యక్రమ సన్నాహాల గురించి సభకు తెలిపారు. జయంతి వేడుకలకు పలు శాఖలు తమ సహకారాన్ని ప్రకటించాయి. ఆమోదించిన తీర్మానాల పట్ల సలహాదారులు చంద్రకాంత్ దకాలియా, హరీష్ అగర్వాల్, అధ్యక్షుడు అనిరుధ్ గుప్తాను, ఇతర ఆఫీస్ బేరర్లను అభినందించారు. తమ శాఖల నుండి పూర్తిస్థాయిలో ఆఫీస్ బేరర్లు హాజరైనందుకు బహదూర్‌పురా శాఖను, మానసరోవర్ శాఖను సత్కరించారు. అలాగే హాజరైన మహిళా శక్తిని కూడా సత్కరించారు. సహ కార్యదర్శి సీమా జైన్ వందన సమర్పణతో సభ ముగిసింది. ఈ కార్యక్రమంలో అగర్వాల్ సమాజ్‌కు చెందిన వివిధ శాఖల కేంద్ర కమిటీ సభ్యులు, శాఖల ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థికి హోప్ ఫౌండేషన్ ప్రోత్సాహం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : సేవే లక్ష్యంగా 10 సంవత్సరాల క్రితం ఏర్పాటు కాబడ్డ హోప్ ఫౌండేషన్ సేవలు నిరంతరం కొనసాగడం పట్ల భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ భాస్కర్ పేర్కొన్నారు. శనివారం చందానగర్ హోప్ ఫౌండేషన్ కార్యాలయంలో 7వ తరగతికి చెందిన కార్తీక్ చదువులో రాణించడంతో పాటు క్రీడల్లో సైతం రాణిస్తూ ఇతర విద్యార్థులకు ఆదర్శంగా ఉంటున్నందుకు హోప్ ఫౌండేషన్ ద్వారా రూ 20 వేల రూపాయలు నగదును చైర్మెన్ కొండ విజయ్ కుమార్ బ్యాంక్ అధికారుల చేతుల మీదుగా అందజేశారు. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం వేలాది మందికి భోజనాలతో పాటు క్రీడా రంగంలో, విద్యలో రాణిస్తున్నా విద్యార్థులకు సహాయం అందచేయడంతో పాటు వైద్య ఖర్చుల విషయంలో సహాయం చేయడం తదితర సేవలను బ్యాంక్ అధికారులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు అశోక్, అన్నె సందీప్ తదితరులు పాల్గొన్నారు.

చేదురకు తెలుగు తేజ పురస్కారం

విశాలాంధ్ర - జవహర్‌నగర్ : తెలుగు భాషా పరిరక్షణ ఉద్యమ పితామహుడు స్వర్గీయ గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని ప్రముఖ రచయిత చేదురకు అంతర్జాతీయ ఐఎస్ఓ ఈనెల 31న ఆంధ్రప్రదేశ్ పల్నాడులో తెలుగు తేజ పురస్కారం అందివ్వనున్నట్లు నిర్వాహకులు ఆహ్వానాన్ని పంపారు. ఎంతో కాలంగా స్వచ్ఛమైన తెలుగులో ప్రజల హక్కులు ప్రభుత్వ పనితీరు మానవ సంబంధాలతో విషయంలో ఎప్పటికప్పుడు కరెంట్ అఫైర్స్ స్పందిస్తూ పాఠకులకు ఉత్సాహాన్ని నింపుతున్న చేదురకు అనేకమంది అభిమానులు ఉన్నప్పటికీ అంతే సమానంగా వ్యతిరేకులు కూడా ఉన్నారు. ఎవరు ఏమీ అనుకున్న ఇలాంటి బెదిరింపులకు ఆర్థిక లావాదేవీలు లొంగకుండా ఎప్పటికప్పుడు తన భావోద్వేగ రచనలను సోషల్ మీడియా ద్వారా పత్రికల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారు. రచయిత జర్నలిస్టు కవి చెదుర ఈ నేపథ్యంలోనే అంతర్జాతీయ ఐఎస్ఓ గుర్తింపు పొందిన సంస్థ చెదుర రాస్తున్నటువంటి కవితలను గుర్తించి ఈ తెలుగుతేజం పురస్కారం ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

పేదల పక్షాన పోరాడేది సీపీఐ ఒక్కటే

- పోలవరం సమస్యల పరిష్కారానికి పోరు
- అల్లూరి జిల్లా మహాసభలలో రామకృష్ణ

విశాలాంధ్ర-రంపచోడవరం: పేదల పక్షాన పోరాడేది సీపీఐ ఒక్కటేనని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఉద్ఘాటించారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక, కార్మిక-కర్షక విధానాలను ఎండగట్టారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు విఫలమయ్యారని విమర్శించారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ పోరాటం చేస్తున్నట్లు రామకృష్ణ వెల్లడించారు. సీపీఐ అల్లూరి సీతా రామరాజు జిల్లా మహాసభలు శనివారం రంపచోడ వరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 23 మండలాల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. తొలుత ఫారెస్ట్ చెక్ పోస్ట్ నుంచి అంబేద్కర్ సెంటర్ మీదగా సభా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కార్యదర్శి పొట్టిక సత్య నారాయణ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడుతూ గిరిజనులంటే పాలకులకు పట్టడం లేదని, వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కార్పొరేట్ సేవలో మోదీ తరిస్తున్నారని, అంబానీకి, అదానీకి దేశ సంపద దోచిపెడుతున్నారన్నారు. దేశంలో 100 ఏళ్లు పూర్తి చేసుకున్న పార్టీలు సీపీఐ, కాంగ్రెస్ అని తెలిపారు. పేదలకు, కార్మికులకు, కర్షకులకు ఎర్రజెండా ఎల్లప్పుడు అండగా ఉంటుందని రామకృష్ణ అన్నారు. త్వరలో ఒంగోలులో జరగబోయే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. లక్ష మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు రామకృష్ణ తెలిపారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ మావోయిస్టులను అంతం చేయడమే అజెండా అంటూ వరుస ఎన్‌కౌంటర్లు చేయిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విధానాన్ని ఖండించారు. గిరిజనుల సమస్యలపై మాట్లాడేది ఎప్పుడంటూ ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల ప్రయోజనాల కోసం, రైతుల పక్షాన అనేక పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. పోలవరం సంబంధిత సమస్యలపై పోరాటాలు చేస్తూనే ఉన్నామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేగ ప్రభాకర్, జాతీయ సమితి సభ్యుడు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. రంపచోడవరం డివిజన్ కార్యదర్శి జుత్తు కుమార్, నాయకులు దుర్గ, 23 మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు.

డా.కత్తి పద్మారావుకు విమలాశాంతి సాహిత్య జీవిత సాఫల్య పురస్కారం

విశాలాంధ్ర-అనంతపురం: తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేసి... ఏడు పదుల వయసు పైబడిన ప్రముఖ సాహితీవేత్తకు ఇస్తున్న విమలాశాంతి సాహిత్య జీవిత సాఫల్య పురస్కారాన్ని ఈ సంవత్సరం (2025) డా.కత్తి పద్మారావుకు అందజేస్తున్నామని విమలాశాంతి సాహిత్య జీవిత సాఫల్య పురస్కారం వ్యవస్థాపకులు శాంతి నారాయణ తెలిపారు. శాంతి నారాయణ శనివారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ సాహిత్యవేత్తలు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి (రాయలసీమ), కేపీ అశోక్ కుమార్ (తెలంగాణ), గంటేడ గౌరునాయుడు (కోస్తా) జ్యూరీ సభ్యులుగా తమ సాహిత్య సంస్థ సూచించిన నియమ నిబంధనలను అనుసరించి కొంతమంది సుప్రసిద్ధ సాహిత్య కురువృద్ధుల పేర్లను, వారి అపారమైన నిబద్ధ సాహిత్య కృషిని పరిగణనలోకి తీసుకొని డా.కత్తి పద్మారావును ఏకగ్రీవంగా విమలాశాంతి సాహిత్య జీవిత సాఫల్య పురస్కారం-2025 కోసం ఎంపిక చేశారని వివరించారు. మహా సంస్కృతాంధ్ర భాషా పండితుడు, కవి, గొప్ప చరిత్రకారుడు, సామాజిక తత్వవేత్త, బుద్ధిస్టు, అంబేద్కరిస్టు, మూర్తీభవించిన దళిత బహుజన స్త్రీవాది, హేతువాది, మహా మానవతావాది అయిన కత్తి పద్మారావు కట్టెల మోపు, ఈ యుగం మాది, ఒక అస్పృశ్యుని యుద్ధగాథ, తెలుగు సాహిత్య చరిత్ర, ఆత్మగౌరవ స్వరం వంటి శతాధిక గ్రంథ కర్త కత్తి పద్మారావు అని చెప్పారు. దళిత మహోద్యమ వ్యవస్థాపకుడు, అంబేద్కరిజమే తన వాక్కు, వాగ్స్వరంగా, శ్వాసా ధ్యాసగా, నడతా నడకగా జీవిస్తున్న మహా నిబద్ధ జీవనశిల్పి అని అన్నారు. అటువంటి మహా వ్యక్తిని జ్యూరీ సభ్యులు తమ సాహిత్య పురస్కారం కోసం ఎంపిక చేయడం ఎంతో సంతృప్తికరమన్నారు. వారి ఎంపికను సగౌరవంగా ఆనందంగా ఆమోదిస్తూ డా.కత్తి పద్మారావుకు ఈ పురస్కారాన్ని ప్రకటిస్తున్నామన్నారు.

ఉప రాష్ట్రపతిపై ఉత్కంఠ

- అభ్యర్థి ఎంపికకు ఎన్డీయే కసరత్తు ముమ్మరం
- రేసులో ఆరుగురు గవర్నర్లు?
- పరిశీలనలో ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త పేరు

న్యూఢిల్లీ: తదుపరి ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టబోయేది ఎవరన్న చర్చ సర్వత్రా జరుగుతోంది. రేసులో ఎవరు నిలుస్తారన్నది ఉత్కంఠ రేపుతోంది. బీజేపీ ఎవరిని పీఠం ఎక్కిస్తుందని, ప్రతిపక్షాలు ఎవరిని నామినేట్ చేస్తారన్నది ఆసక్తి కరంగా మారింది. ఉప రాష్ట్రపతి ఎన్నిక సమీపిస్తుండటంతో అభ్యర్థిని ఖరారు చేసేందుకు బీజేపీ కసరత్తు ముమ్మరం చేసింది. ఎవరిని ఎంపిక చేయాలనే విషయమై సమాలోచనలు జరుపుతోంది. అయితే రేసులో దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా, బీహార్ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్, గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవ్‌వ్రత్, కర్నాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, సిక్కిం గవర్నర్ ఓం మాథూర్, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా తదితరులు రేసులో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త శేషాద్రిచారి పేరు కూడా పరిశీలనలో ఉందని తెలుస్తోంది. బీహార్ ఎన్నికల దృష్ట్యా రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌ను నామినేట్ చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ గత నెల రోజులుగా ఉప రాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేసే పనిలో నిమగ్నమైనట్లు వెల్లడించాయి. ఉప రాష్ట్రపతి పదవికి సెప్టెంబర్ 9న ఎన్నిక జరగాల్సి ఉంది. అయితే ఆరోగ్యం సహకరించడం లేదంటూ జగదీప్ ధంకర్ జులై 21న రాజీనామా చేశారు. పదవీ కాలం పూర్తి కాకుండానే బాధ్యతల్లో నుంచి తప్పుకున్నారు. అయితే పార్టీకి, ధంకర్‌కు మధ్య దాదాపు సంవత్సర కాలంగా అభిప్రాయ బేధాలు ఉండటంతోనే ఆయన రాజీనామా చేశారన్న వాదన ఉంది. దీంతో తదుపరి ఉప రాష్ట్రపతి అభ్యర్థిని ఆచితూచి ఎంపిక చేయాలని బీజేపీ నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ నిర్ణయాధికారాన్ని బీజేపీ అధ్యక్షుడు నడ్డాకు అప్పగిస్తూ ఎన్డీయే ఇటీవల నిర్ణయం తీసుకుంది. ఇదే క్రమంలో వచ్చే వారం 'మెగా మీటింగ్'కు బీజేపీ ఏర్పాట్లు చేస్తోందని, తద్వారా తమ బలాన్ని ప్రదర్శించుకోవాలని భావిస్తోందని తెలుస్తోంది. ఇక పార్టీ పార్లమెంటరీ సమావేశానికి ఎన్డీయే ఎంపీలందరినీ ఆహ్వానించింది. పార్లమెంటు ఆడిటోరియంలో నిర్వహించే ఈ సమావేశంలో ప్రధాని మోదీ ప్రసంగిస్తారు.

జర్నలిస్టులకు సంకెళ్లొద్దు

- దేశద్రోహం చట్టాలతో శిక్షించరాదు
- పత్రికా-వాక్ స్వేచ్ఛకు విలువ ఇవ్వాలి
- ఐజేయూ డిమాండ్
- ది వైర్ కేసులో సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం

న్యూఢిల్లీ: పాత్రికేయ వృత్తి ధర్మానికి కట్టుబడిన జర్నలిస్టుల కథనాలు, వీడియోలను నేరపూరితమైనవిగా చిత్రీకరిస్తూ, దేశ ద్రోహం వంటి చట్టాల కింద ఏకపక్షంగా శిక్షలు విధించడం ఆమోదయోగ్యం కాదని ది ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) పేర్కొంది. పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యాన్ని రాజ్యాంగం కల్పించిందని, వీటికి విలువ ఇవ్వాలని పాలకులకు, అధికారులకు సూచించింది. ఉద్యోగ ధర్మానికి కట్టుబడిన జర్నలిస్టులకు సంకెళ్లు వేసే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికింది. జర్నలిజం సిద్ధాంతాలకు విలువ ఇస్తూ, పాత్రికేయుల రక్షణకు కట్టుబడే విధంగా సర్వోన్నత న్యాయస్థానం ప్రగతిశీలంగా వ్యవహరించిందని, 'ది వైర్'కు రక్షణ కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేసిందని, దీనిని స్వాగతిస్తున్నామని ఐజేఐ అధ్యక్షులు, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యులు గీతార్థ్ పాథక్, ఐజేయూ ప్రధాన కార్యదర్శి, ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఉపాధ్యక్షులు సబీనా ఇందర్‌జిత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చట్టాలను దుర్వినియోగించడం ద్వారా జర్నలిస్టులకు హాని తలపెట్టే పరిస్థితులు లేకుండా చూడాలని, పాత్రికేయులకు రక్షణ కల్పించాలని అధికార యంత్రాంగాలను కోరుతున్నామన్నారు. బెదిరింపులు, వేధింపులకు గురయ్యే దేశంలోని జర్నలిస్టుల ఆశాజ్యోతిగా సుప్రీం కోర్టు తీర్పు ఉందని పాథక్ అభిప్రాయపడ్డారు. పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు దేశ న్యాయ వ్యవస్థ కట్టుబడి ఉందన్న బలమైన సందేశం తాజా తీర్పుతో ప్రపంచానికి అందిందని ఇందర్‌జిత్ అన్నారు. రాజ్యాంగబద్ధ పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం సిద్ధాంతాలను గౌరవించాలని ప్రభుత్వానికి, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు ఐజేయూ తరపున విజ్ఞప్తి చేశారు. నిజాలను నిర్భయంగా ప్రజల ముందుకు తెచ్చే జర్నలిస్టులు వారి పనిని వారు స్వేచ్ఛగా చేసుకునే వాతావరణాన్ని కల్పించాలని కోరారు. దేశద్రోహం చట్టాలను అడ్డంపెట్టుకొని జర్నలిజాన్ని ఏకపక్షంగా శిక్షించరాదన్నారు. ప్రముఖ వార్తా సంస్థ ది వైర్, దాని వ్యవస్థాపక సంపాదకుడు సిద్ధార్థ వరదరాజన్‌కు రక్షణ కల్పిస్తూ సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేయడాన్ని ఐజేయూ స్వాగతించింది. ఆపరేషన్ సిందూర్‌పై ప్రచురించిన వ్యాసానికి సంబంధించిన కేసులో ది వైర్‌పై కఠిన చర్యలు తీసుకోకుండా అసోం పోలీసులను కూడా సర్వోన్నత న్యాయస్థానం కట్టడి చేసిందని పేర్కొంది. ఈ తీర్పు జర్నలిస్టుల స్వేచ్ఛ పరిరక్షణకు కీలక అడుగుగా వర్ణించింది. జర్నలిస్టుల వార్తా సేకరణ ముఖ్యంగా క్రిటికల్ రిపోర్టింగ్‌ను దేశద్రోహం లేదా అటువంటి చట్టాల కింద నేరంగా పరిగణించి శిక్షించరాదన్న సిద్ధాంతానికి బలం చేకూర్చేలా సుప్రీం కోర్టు ఆదేశాలున్నాయని ఐజేయూ వెల్లడించింది. ప్రజాస్వామ్యం విజయానికి ఇది సంకేమని, అసంతృప్తి, విమర్శనాత్మక స్వరాలను అణచివేసేందుకు న్యాయ నిబంధనల దుర్వినియోగం నుంచి ఫోర్త్ ఎస్టేట్‌కు రక్షణ కల్పించడంలో న్యాయవ్యవస్థల పాత్రను పునరుద్ఘాటించేదిగా సుప్రీంకోర్టు వ్యవహరించిందని పేర్కొంది. ప్రగతిశీల వైఖరితో కోర్టు తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు ఐజేయూ వెల్లడించింది. కాగా, జర్నలిస్టు కథనం లేదా వీడియో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 152 కింద దేశ ఐక్యత, సమగ్రతకు హాని కలిగించే నేరంగా పరిగణించబడదని సుప్రీంకోర్టు ఈనెల 12న వెలువరించిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

అమరవీరులకు అవమానం: నారాయణ



విశాలాంధ్ర- హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని దేశమంతా పండగ వాతావరణంలో చేసుకొంటుంటే ... అదే ఆగస్టు 15న ప్రధాని మోదీ దిల్లీ ఎర్రకోట పైనుంచి స్వాతంత్ర్య పోరాటాన్ని అవమానపరిచే విధంగా స్వతంత్రపోరాటంలో అసువులుబాసిన అమరవీరులకు ద్రోహం చేసే విధంగా మాట్లాడడం యావత్ భారత ప్రజలను అవమానపరచడమేనని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. 1925లో సీపీఐ, ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించిందని, ఆనాటి నుంచి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దేశభక్తులందరు ప్రత్యక్షం పోరాటంలో పాల్గొన్నారన్నారు. తుపాకీ గుళ్లకు బలయ్యారు... తూటాలకు, లాఠీలకు ఎదురొడ్డారు... ఆర్‌ఎస్‌ఎస్ వాళ్లు చరిత్రలో ఎక్కడయినా పాల్గొన్నారా, లాఠీలకు, తూటాలకు గురయ్యారా, ఉంటే ఒక పేరైనా చెప్పగలరా? సావర్కర్ అరెస్ట్ అయి అండమాన్ జైలులో బ్రిటిష్ పాలనకు లొంగి క్షమాపణ చెప్పి బయటికి వచ్చి, ఆర్‌ఎస్‌ఎస్ వాళ్లని బ్రిటిష్ ఉద్యమంలో పాల్గొనవద్దని ఆదేశించడం వాస్తవం కదా అని నిలదీశారు. అలాంటి చరిత్రకలిగిన ఆర్‌ఎస్‌ఎస్‌ను పొగడడమంటే అంతకన్నా మించిన దేశద్రోహం ఇంకొకటి ఉందా... చరిత్రాత్మక ఎర్రకోటకు అవమానంకదా అని ప్రశ్నించారు. దేశభక్తులు క్షమించరు గాక క్షమించరని నారాయణ పేర్కొన్నారు.

పంద్రాగస్టు స్ఫూర్తికి అవమానం

ఆర్‌ఎస్‌ఎస్‌పై మోదీ వ్యాఖ్యలకు విజయన్ ఖండన

తిరువనంతపురం: దేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎర్ర కోట నుంచి జాతినుద్దేశించిన సమయంలో ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రశంసించడం ద్వారా పంద్రాగస్టు స్ఫూర్తిని ప్రధాని అవమానించారని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. స్వాతంత్ర్య సమరంలో ఆర్‌ఎస్‌ఎస్‌కు పాత్ర లేదన్నారు. మహాత్మాగాంధీ హత్య తర్వాత నిషేధానికి గురైందని గుర్తుచేశారు. ఇలాంటి సంస్థకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర్య ఉద్యమంలో ఘనత లభించాలనే ప్రయత్నంలో భాగంగానే మోదీ ఈ వ్యాఖ్యలు చేశారని విజయన్ దుయ్యబట్టారు. నాడు ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త వీర సావార్కర్‌పై దర్యాప్తు జరిగిందని, ఇటువంటి వారికి ఘనత ఇవ్వడం చారిత్రక తప్పిదమని ఆక్షేపించారు. బ్రిటిష్ వారికి సేవ చేసిన వారిని కీర్తించేందుకు స్వాతంత్ర్య సిద్ధించిన రోజును ఎంపిక చేసుకోవడం ద్వారా సమరయోధులను మోదీ ఘోరంగా అవమానించారన్నారు. మతతత్వ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌కు క్లీన్‌చిట్ ఇవ్వాలనే ఇలాంటి ప్రయత్నాలు ఫలించబోవని అన్నారు. ఇలాంటి వైఖరి స్వాతంత్ర్య దినోత్సవం స్ఫూర్తికి అవమానకరమని విజయన్ వెల్లడించారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి కూడా మోదీ పద్ధతిని తప్పుపట్టారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రశంసించడం ద్వారా దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమర వీరుల్ని అవమానించారని, మత అల్లర్లు సృష్టించే సంస్థగా ఆర్‌ఎస్‌ఎస్ చరిత్రలో నిలిచిన గుర్తు పెట్టుకోవాలన్నారు.

పుస్తక మహోత్సవం... వైవిధ్యభరితం

- పిల్లల కోసం ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ వర్క్‌షాప్
- 'చరిత్ర గమనంలో సైన్స్'... 'ప్రజా సైన్స్ ఉద్యమం' పుస్తకావిష్కరణ
- శ్రోతలను మంత్రముగ్ధులు చేసిన కవిత్వాలు

విశాలాంధ్ర -ఒంగోలు: విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతికశాఖ, గ్రంథాలయ శాఖ సంయుక్త అధ్వర్యంలో జరుగుతున్న మూడవ ఒంగోలు పుస్తక మహోత్సవం రెండో రోజైన శనివారం వైవిధ్యభరిత కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పిల్లల కోసం ప్రత్యేకంగా ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ వర్క్‌షాప్ నిర్వహించారు. నేషనల్ బుక్ ట్రస్ట్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 40 మంది పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సి.ఎ. ప్రసాద్, సంగెం అనిల రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించి పిల్లలకు కళలు... చేతిపనులలో మెళకువలు నేర్పించారు. సాయంత్రం ఆరు గంటలకు జన విజ్ఞాన వేదిక ప్రచురించిన "చరిత్ర గమనంలో సైన్స్" (రచన డాక్టర్ గేయానంద్), "ప్రజా సైన్స్ ఉద్యమం" (రచన మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం) పుస్తకాలను ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు ఎ.వి. పుల్లారావు (మంగమ్మ కళాశాల విశ్రాంత ప్రాచార్యులు), రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డాక్టర్ దార్ల బుజ్జిబాబు, సిహెచ్. జయప్రకాశ్, జె.వి.వి. రాష్ట్ర కమిటీ సభ్యుడు యు. భాస్కర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు. వెంకటరావు, జి. శ్రీనివాస రెడ్డి హాజరయ్యారు.

అలరించిన కవి సమ్మేళనం

రాత్రి ఏడు గంటలకు "వందమంది కవులతో కవి సమ్మేళనం" ఆద్యంతం అలరించింది. పొన్నూరు వెంకట శ్రీనివాస్ , చంద్ర నాయక్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ కవి సమ్మేళనానికి ముఖ్య అతిథిగా మాజీ కలెక్టర్ ఎ.ఎం.డి. ఇంతియాజ్, గౌరవ అతిథిగా ప్రకాశం జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సరియా హాజరయ్యారు. వంద మంది కవులు తమ తమ కవిత్వాలను వినిపించి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. ఎ.వి. పుల్లారావు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు శాస్త్ర పరిజ్ఞానం కలిగి ఉండాలని అన్నారు. సైన్స్ ప్రయోజనాలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండాలని, పర్యావరణాన్ని కాపాడాలి, ఆరోగ్యకరంగా ఉండాలి అందుకు సైన్స్ ప్రచారం కళారూపాల మాధ్యమంగా జరిగేలా జన విజ్ఞాన వేదిక ఏర్పడిందని వివరించారు. అక్షరాస్యత ప్రాముఖ్యాన్ని తెలుపుతూ 500 జిల్లాలలో జరిగిన అవగాహన సదస్సులకు ఒంగోలు ఒక వేదిక అయిందని ఆయన తెలిపారు. జన విజ్ఞాన వేదిక మద్యపానం వల్ల జరిగే దుష్పరిణామాల గురించి ప్రచారం చేసిందన్నారు. ఆ వివరాలన్నీ విఠపు బాలసుబ్రహ్మణ్యం రచించిన "ప్రజా సైన్స్ ఉద్యమం" పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. గేయానంద్ రచన "చరిత్ర గమనంలో సైన్స్" మానవ పరిణామ క్రమంలో కమ్యూనికేషన్ మాధ్యమంగా మానవాళి ఎలా మిగితా జీవరాశుల కన్నా మేలుగా జీవనశైలిని మెరుగుపరుచుకుందో తెలుపుతుందని అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు, ప్రజాశక్తి బుక్ హౌస్ జనరల్ మేనేజర్ లక్ష్మయ్య మాట్లాడుతూ అన్ని పుస్తక ప్రదర్శనల్లో అనుబంధంగా సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామన్నారు. చరిత్ర, సైన్స్ పుస్తకాలు, మానవ పరిణామ క్రమాన్ని ప్రభావితం చేయడంలో ముఖ్య పాత్ర వహించాయన్నారు.

నేటి కార్యక్రమాలు

నేషనల్ బుక్ ట్రస్ట్ అధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు పిల్లలకు క్రియేటివ్ రైటింగ్ వర్క్‌షాప్ జరుగుతుంది. మంజులూరి కృష్ణకుమారి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తారు. సాయంత్రం ఆరు గంటలకు ఎన్.బి.టి. పుస్తకాల ఆవిష్కరణ. రాత్రి ఏడు గంటలకు తమను ప్రభావితం చేసిన పుస్తకాలపై ప్రముఖులు ప్రసంగిస్తారు.

కేరళలో భారీ వర్షాలు

ఐదు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

తిరువనంతపురం: కేరళలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో భారత వాతావరణ శాఖ ఐదు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఎర్నాకులం, ఇడుక్కి త్రిస్సూర్, కన్నూర్, కాసరగోడ్ జిల్లాలకు భారత వాతావరణ శాఖ శనివారం ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగిలిన తొమ్మిది జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. 11 నుంచి 20 సెంటీమీటర్ల వర్షం కురిసే అవకాశం ఉన్నప్పుడు ఆరెంజ్ అలర్ట్... 6 నుంచి 11 సెంటీమీటర్ల వరకు కురిసే వర్షపాతానికి ఎల్లో అలర్ట్‌ను వాతావరణశాఖ జారీ చేస్తుంది. ఇలాంటి వాతావరణం నేపథ్యంలో 40 కిలోమీటర్ల మేర బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు రాజస్థాన్‌లో మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రతినిధి శనివారం తెలిపారు. ఉదయ్‌పూర్, జోధాపూర్‌లో రాబోయే ఐదు రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. కోటా, అజ్మీర్, జైపూర్, భరత్‌పూర్, బికనీర్‌లో తేలికపాటి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తూర్పు రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. పశ్చిమ రాజస్థాన్‌లో మోస్తారు వర్షం... కొన్ని ప్రదేశాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. గడచిన 24 గంటల్లో పాలి జిల్లా బాలిలో 70 మి.మీ వర్షపాతం నమోదైందని ఐఎండీ పేర్కొంది. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుండి (జూన్ 20) హిమాచల్ ప్రదేశ్‌లో 257 మంది చనిపోయారు. 37 మంది గల్లంతయ్యారని హిమాచల్ ప్రదేశ్ విపత్తు నిర్వహణ శాఖ తెలిపింది.

గూఢచర్యం కేసులో జ్యోతి మల్హోత్రాపై చార్జిషీటు

న్యూఢిల్లీ: పాక్ కోసం గూఢచర్యానికి పాల్పడ్డ యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసులో పోలీసులు తాజాగా 2,500 పేజీల చార్జ్‌షీటు దాఖలు చేశారు. ఆమె గూఢచర్యానికి పాల్పడిందనేందుకు పక్కా ఆధారాలు లభించాయని పోలీసు వర్గాలు తెలిపాయి. దాదాపు మూడు నెలల పాటు విచారణ అనంతరం పోలీసులు ఈ చార్జ్‌షీటు దాఖలు చేశారు. జ్యోతి మల్హోత్రా అలియాస్ జ్యోతి రాణిని మే నెలలో హర్యానాలోని హిసార్‌లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆమె పాక్ హైకమిషన్‌లో ఎహ్సాన్ ఉర్ రహీమ్ అలియాస్ డానిష్ అనే వ్యక్తితో టచ్‌లో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. పాక్‌కు ఆమె రెండుసార్లు వెళ్లివచ్చినట్టు చెప్పారు. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో రహీమ్‌ను పర్సోనా నాన్ గ్రేటాగా పేర్కొంటూ దేశం విడిచి వెళ్లాలని కేంద్రం ఆదేశించింది. గూఢచర్యం, గోప్యమైన విషయాలను లీక్ చేయడం తదితర ఆరోపణలపై అతడిని దేశం వీడాలని తేల్చి చెప్పింది. చార్జ్‌షీటులోని వివరాల ప్రకారం మల్హోత్రా చాలాకాలంగా గూఢచర్యానికి పాల్పడుతోంది. రహీమ్‌తో పాటు ఐఎస్ఐ ఏజెంట్లు అయిన షకీర్, హసన్ అలీ, నాసిర్ ఢిల్లాన్‌తో ఆమె టచ్‌లో ఉన్నట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. ఏప్రిల్ 17వ తేదీన పాకిస్థాన్‌కు వెళ్లిన ఆమె... ఆ తరువాత మే15న తిరిగొచ్చినట్టు పోలీసులు చార్జ్‌షీటులో పేర్కొన్నారు. జూన్ 10న చైనా వెళ్లిన ఆమె... జులై వరకూ అక్కడే ఉన్నారని వివరించారు. తర్వాత నేపాల్ సందర్శించినట్టు చార్జ్‌షీటులో పేర్కొన్నారు. ఆమె కర్తార్‌పూర్ కారిడార్ మీదుగా పాకిస్థాన్ వెళ్లింది. అక్కడ పంజాబ్ ముఖ్యమంత్రి, పాక్ మాజీ ప్రధాని షరీఫ్ కూతురు మరియమ్ నవాజ్ షరీఫ్‌ను కలిసింది. ఆమెను ఇంటర్వ్యూ కూడా చేసిందని పోలీసు వర్గాలు తెలిపాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.